
ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్



# యుగశక్తి  గాయత్రి



ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః

ప్రఖర ప్రజ్ఞ | సజల శ్రద్ధ


సంకల్పం - సంరక్షణ
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**
శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
డాక్టర్ ప్రణవ్ పండ్యా
సంపాదక మండలి
డాక్టర్ మారెళ్ళ శ్రీరామకృష్ణ
పొన్నూరు హైమవతీశాస్త్రి
ముక్కామల రత్నాకర్
డి.వి.ఆర్.మూర్తి
సాధన నరసింహాచార్య

సంపుటి 16 - సంచిక 8
**జనవరి 2012**
**విడిప్రతి రూ॥ 12.00**
**సం॥ చందా రూ॥ 120**
**3 సం॥ చందా రూ॥ 350**
**10 సం॥ చందా రూ॥ 1116**

పత్రిక చందా మనీ ఆర్డర్ ద్వారా కాని డ్రాఫ్టు ద్వారా కాని పంపవలసిన చిరునామా
**“శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు”**
**గాయత్రీ చేతనా కేంద్రము**
హెచ్.పి. రోడ్, మూసాపేట,
అశ్విని హౌస్ దగ్గర,
హైదరాబాదు - 500 018.


## నాకు ధైర్యాన్ని ప్రసాదించండి

‘ఓ భగవంతుడా! కష్టాలకు భయపడి పారిపోకుండా వాటిని ఎదుర్కొనగలిగే ధైర్యమును నాకు ప్రసాదించు. నేను కోరుకునేది ఇది ఒక్కటే. ఆపదలు వచ్చినప్పుడు నన్ను రక్షించమని ప్రార్థించటం లేదు. కానీ వాటిని ఎదుర్కొనటానికి కావలసిన శక్తిని ప్రసాదించమని మాత్రం నిన్ను వేడుకొంటున్నాను. కష్టాలలో నేను కొట్టుకుపోతున్నప్పుడు నాకు సాంత్వన చేకూర్చమని నేను నిన్ను వేడుకొనటం లేదు. భావసుమాలను దోసిలి నిండా నింపి నీ చరణముల చెంత అర్పిస్తూ, ‘కష్టం వచ్చినప్పుడు దానిని ఎదుర్కొని, దానిపై విజయమును సాధించగలిగే శక్తిని నాకు ప్రసాదించమని’ మాత్రం వేడుకొంటున్నాను.

కష్టభూయిష్టమైన విషమ పరిస్థితిలో నేను చిక్కుకున్న వేళ ఎటువైపునుండి ఎలాంటి సహాయము నాకు అందనప్పుడు, నేను ధైర్యమును కోల్పోకూడదు. ఇంకెవ్వరిని నేను సహాయం వేడుకోను, ఆ క్షణంలో నా మనోబలం క్షీణించనివ్వను. ఓ ప్రభూ! అత్యంత కఠినమైన పరిస్థితులనుగాని, ఆపదలనుగాని, సమస్యలనుగాని ఎదుర్కొనగలిగే దృఢత్వమును, శక్తిని నాకు ప్రసాదించు. ప్రతిక్షణం నన్ను వెన్నంటి ఉండి, విపత్కర పరిస్థితులన్నింటిని ఒక ఆటగా భావించి హృదయాన్ని తేలికగా ఉంచుకొనగలిగే ధైర్యమును నాకు అందించు. నేను కోరుకునేది ఇంతమాత్రమే స్వామీ!’

ఎంతటి ప్రతికూల పరిస్థితులు ఎదురైనా, దైనందిన వ్యవహారంలో ఎంతటి నష్టం కలిగినా నాకేమీ పర్వాలేదు. కానీ ముందర వచ్చిపడిన కష్టమును చూసి ధైర్యమును కోల్పోయి, ‘ఇప్పుడేం చేయాలి? నా సర్వస్వం పోగొట్టుకున్నానే!’ అని ఏడుస్తూ కూర్చునే బలహీనతను మాత్రం నానుండి దూరం చెయ్యి స్వామీ!’

‘స్వామీ! కేవలం నీపట్ల దృఢ విశ్వాసాన్ని కలిగి ఉండటం వల్ల మాత్రమే ఎంతోమంది అత్యంత ఉన్నతస్థాయి వరాలను అందుకొనగలిగారు. మీపైన విశ్వాసం నాకు యాచనగా కాక, శక్తిగా మారాలి. నా మనస్సు బలహీనతకు గురికాకుండా శక్తివంతం కావాలి’.


పత్రిక అందనివారు ఈ క్రింది నంబరును సంప్రదించగలరు.
**9949111175**

పత్రికకు సూచనలు, సలహాలు ఇవ్వదలచినవారు క్రింది నంబర్‌ను సంప్రదించగలరు. **9989659905**


బద్ధకస్తునికి ఇష్టమైన పదం ‘రేపు’

# విషయ సూచిక


1. **సంపాదకీయం :**
నాకు ధైర్యాన్ని ప్రసాదించండి 1
2. **విషయసూచిక-సద్గురు వచనామృతం :**
సంవేదనా శక్తిని వికసింపచేసుకోండి 2
3. **వేదమంత్రం :** సద్గుణాలతో జీవితాన్ని
మలచుకోవడమే ఈశ్వరీయ సాధన 3
4. **గాయత్రీ విద్య-17 :** అన్నమయకోశం - దాని సాధన 4
5. **ధారావాహిక ప్రశ్నోపనిషద్ : ప్రథమకాండే పంచమోధ్యాయః :** మొదటి ప్రకరణం 6
6. **సూర్య విజ్ఞానం - 16 :**
సర్వాంగపూర్ణ చికిత్సలో దేవాధిదేవుడైన
సూర్యుని మహత్వపూర్ణ భూమిక 8
7. **పూజ్య గురుదేవుల శతసూత్ర కార్యక్రమం : 21-30**
అజ్ఞానాంధకారాన్ని అంతం చేద్దాం 10
8. **తత్వజ్ఞానం-4 :** కొన్ని రకాలైన భౌతిక కర్మలు 12
9. **సంతోషం** 13
10. **వసంత పంచమి ప్రత్యేకం :** ఆయన పృథ్వి యొక్క
భాగ్యాన్ని, భవిష్యత్తుని మార్చడానికి వచ్చారు 15
11. **స్వామి వివేకానంద జయంతి ప్రత్యేకం :**
ఈనాటికి ప్రేరణలందించే అలనాటి సన్యాసి 17
12. **రంగుల విజ్ఞానం :** రంగుల రూపంలో
సూక్ష్మశరీరంలో ఉన్న శక్తి భాండారం 19
13. **సాధనా విజ్ఞానం :**
వీరభద్రుల స్వరూపం మరియు సాధనక్రమం 21
14. **ఆదిశక్తి లీలా కథలు-19 :**
తత్సవితుర్వరేణ్యం యొక్క మర్మం 29
15. **ప్రపంచ వింతలు :** ఇప్పటికి మనం పిరమిడుల
రహస్యాన్ని తెలుసుకొనలేకపోయాం 31
16. **హిమాలయాలు - విభూతి గనులు** 34
17. **బ్రహ్మవర్చస్ : పరిశోధనా సారాంశం-7**
కిశోరావస్థలో ఉన్న పిల్లల సున్నితమైన
మనస్సును అర్థం చేసుకోండి 36
18. **పూజ్య గురుదేవుల అమృత వాణి :**
ఆధ్యాత్మికత అనగా భావనల ఆట-1 39
19. **నావారితో నా మాట:** మనలను అత్యంత
సమర్థవంతులుగా తయారు చేసేందుకు
పరీక్షా సమయం వచ్చేసింది 42
20. **ఆరోగ్యమే మహాభాగ్యం-14 :** హోమియో వైద్య సేవ 44
21. **సుభాషితాలలో సుధారస బిందువులు - 3** 45
22. **పుష్యమాస ప్రాశస్త్యం** 47
23. **నిత్యస్మరణీయులు - 3 :**
ఆదర్శానికి ఆనవాలు అబ్దుల్ కలామ్-2 49
24. **ఆణిముత్యాల శోధన - 2** 52




## సద్గురు వచనామృతం

## సంవేదన శక్తిని వికసింపజేసుకోండి

ఇతరుల దుఃఖానికి స్పందించుటయే దయ. దుఃఖిత జీవుల పట్ల కలిగే ప్రేమభావనయే దయ. ఈ దయా ప్రవృత్తి వల్ల సంవేదన శక్తి పెరుగుతుంది. దయా ప్రవృత్తికి, భక్తికి, ప్రేమకు సన్నిహిత సంబంధమున్నది. అంతఃకరణయే భగవంతుని నివాసమని నమ్మే వ్యక్తి అందరిని ప్రేమించగలుగుతాడు. అతడు ఇతరుల దుఃఖాన్ని చూడలేడు. ఇతరుల బాధను చూచినప్పుడు అతని అంతఃకరణంలో దుఃఖం కలుగుతుంది, హృదయం ద్రవిస్తుంది. తన దుఃఖ నివృత్తికై అతడు దుఃఖితుల సహాయంలో నిమగ్నుడవుతాడు. ఆ ఫలితంగా-భక్తి పెంపొందుతుంది. దయా ప్రవృత్తి పెరుగుతుంది. ప్రేమభావన జనించినప్పుడు మనిషిలో భక్తి, దయ కలుగుతాయి. ఎపుడు దయ కలుగుతుందో అపుడే భక్తి మరియు ప్రేమ స్వభావం పెరుగుతాయి. ఇలా ఈ మూడు స్వభావాలకు పరస్పర సంబంధం ఉన్నది. కనుక - సజ్జనులు, వివేకులు దయార్ద్ర హృదయులు అవుతారు.

మనకు మన జీవితం పట్ల ప్రేమ ఎలా ఉంటుందో అలాగే ఇతర ప్రాణులకు కూడ ఉంటుంది. కనుక-ఇతరులను ఆత్మ సమానులుగా పరిగణించి సజ్జనులు సదా దయాసముద్రులు అవుతారు.

పరోపకారం ద్వారా దయాగుణం వికసించిన మేరకు సుఖశాంతులు పెంపొందుతాయి.

*- అఖండజ్యోతి, అక్టోబరు, 1950*
*అనువాదం: సత్యనారాయణ గుప్తా*

## పండుగలు

**జనవరి 2012**

| | |
|---|---|
| 05-01-2012 | వైకుంఠ ఏకాదశి |
| 12-01-2012 | స్వామి వివేకానంద జయంతి |
| 14-01-2012 | మకర సంక్రాంతి |
| 26-01-2012 | రిపబ్లిక్ దినోత్సవం |
| 27-01-2012 | వసంత పంచమి |
| 30-01-2012 | రథ సప్తమి |

**ఫిబ్రవరి 2012**

| | |
|---|---|
| 20-02-2012 | మహాశివరాత్రి |
| 23-02-2012 | శ్రీరామకృష్ణ పరమహంస జయంతి |

**అడిగిన దానికంటే ఎక్కువ ఇవ్వడం ఔదార్యం.**

వేద మంత్రం

# సద్గుణాలతో జీవితాన్ని మలచుకోవడమే ఈశ్వరీయ సాధన

**ఇన్ద్రం మిత్రం వరుణమగ్నిమాహురథో**
**దివ్యః స సుపర్ణో గరుత్మాన్ ।**
**ఏకం సద్విప్రా బహుధా వదన్తి**
**అగ్నియమం మాతరిశ్వాన మాహుః ॥**

**– ఋగ్వేదం 1/164/46**

**భావార్థం :** పరమాత్మ యొక్క విభిన్న శక్తులే అనేక దేవతలుగా పిలువబడుచున్నవి. కానీ ఉన్నది అతడొక్కడే. గుణకర్మ స్వభావములుగా పరమాత్మను ఉపాసించాలి.

**సందేశం :** పరమపిత పరమేశ్వరుడు అంతటా వ్యాపించి ఉన్నాడు. ఈ విశాల ప్రపంచము, అంతరిక్షము, బ్రహ్మాండము – వీటన్నింటి కణకణములో ఈశ్వరుని అనంతశక్తి వ్యాపించి ఉన్నది. అతడే వీటన్నింటి నియంత, నియామకుడు. **"ఈశావాస్యమిదం సర్వమ్"** – ప్రతి వస్తువులో, జడములో చైతన్యములో మన రోమరోమము లో ఈశ్వరుడు నివాసమున్నాడు. నిరాకార పరమేశ్వరుడు కనిపించ నప్పటికి మన ప్రాణశక్తి అతడే. నిద్రించేటప్పుడు, మేల్కొని ఉన్నప్పుడు ప్రతిక్షణం అతడు మనతోనే మనలోపల – బయట, నలువైపులా ఉన్నాడు – రబ్బరు బెలూన్‌లో గాలి నిండి ఉంటుంది. బెలూన్ లోపల, బయట, నలువైపులా గాలి ఉన్నది – కానీ అది మనకు కనపడుట లేదు. ఎలాగైతే పాలలోని ప్రతి బిందువులో నెయ్యి యొక్క అంశ దాగి ఉంటుందో అలాగే ఈశ్వరుడు సర్వవ్యాపియై ఉన్నాడు. ప్రపంచములోని మూలమూలలో, అన్ని జీవ జంతువులలో పరమేశ్వరుని శక్తి నిండి ఉన్నది. ఈ సర్వ వ్యాపియైన పరమేశ్వరుని అనేకానేక శక్తులను ప్రపంచములోని విభిన్న మతాలవారు వేరు వేరు పేర్లతో పిలుస్తున్నారు.

మనుష్యులందరి యొక్క తండ్రి పరమేశ్వరుడొక్కడే. అతడే ఇంద్ర, మిత్ర, వరుణ, అగ్ని, యమ అన్నీను. అతడిని రాముడని, కృష్ణుడని, దుర్గ అని, కాళీ అని, శివశంకరుడని, జీసస్ అని లేక అల్లా లేక గాడ్ అనవచ్చు. పేరులో కాదు, ఈశ్వరుని గుణాలలో గొప్పతనమున్నది. ఆయన గుణాలను జీవితంలో తెచ్చుకోవాలి. ఆచరించాలి. జీవితంలో అలా వ్యవహరించుటనే పరమాత్మను ఉపాసించుట అని అంటారు. ఈ విధంగా ఉపాసించుట చేత, అతడు ఉత్తరోత్తరా శ్రేష్ఠత్వాన్ని ప్రాప్తించుకొని, దేవత్వము వైపు సాగుతాడు.

**"ఏకం సద్విప్రా బహుధావదన్తి"** ఒకే పరమేశ్వరుని విద్వాంసులు వేరు వేరు పేర్లతో పిలుస్తున్నారు. ఏ పేరైనా ఫరవాలేదు, కాని అతని గుణాలను మన కర్మ, స్వభావములలో అభిన్న అంగాలుగా చేసుకొనేందుకు నిరంతరం ప్రయత్నం చేయాలి.

నేడు ఎక్కువ మంది జనం ఈశ్వరుని గుణాల గురించి ఆలోచించడం లేదు. వాటిని తమ ఆచరణలోనికి తెచ్చుకొనే ప్రయత్నమే చెయ్యరు. భగవానుడు కేవలం మందిరంలోనే ఉన్నాడని బయట ఏ పాపకర్మ చేసినా భగవంతుడు చూడడని వారనుకుంటారు. ఆయన సర్వవ్యాపక రూపాన్ని మరచారు. ఆయన అనేక రూపాలలో అంతటా వ్యాపించి ప్రతిక్షణం మన వెంబడే ఉన్నాడు. ప్రపంచములోని మూల మూలల్లో ఆయన సార్వభౌమశక్తి ఉన్నది. వాస్తవాన్ని ఎల్లవేళలా గుర్తుంచుకోవటం అత్యావశ్యకం.

భగవంతుని నామంతోపాటు గుణాల చింతన చేస్తూ ఉందాము.

★★★

## సహకారం వలననే ఉన్నతుడైన రూజ్‌వెల్ట్

*అమెరికా రాష్ట్రపతి రూజ్‌వెల్ట్, తన సాఫల్య రహస్యాన్ని తెలుపుతూ నన్ను నేను అదృష్టవంతుడిగా భావించటమేగాక ఈ భావనను ఇతరులతో అంటుంటాను, సమర్థులకు, యోగ్యులకు, సాఫల్యాన్ని పొంది తీరుతామని ఖచ్చితంగా భావించే వారికి మాత్రమే ఈ లోకంలో సహకారమనేది లభిస్తుంది. అసమర్థులకు, అయోగ్యులకు లభించేది కేవలం చౌకబారు సానుభూతి మాత్రమే. విశ్వంలో గొప్ప గొప్ప సాఫల్యాలు పొందిన వారంతా ఇతరుల సహకారాన్ని పొందటానికి అనుక్షణం అప్రమత్తంగా ఉండేవారు. మనిషి ఎంత గొప్పవాడైనా ఆ గొప్ప పనులు ఒంటరి ప్రయత్నంతో చేయజాలడు. కాబట్టి ప్రతి సాఫల్యం వెనుక సహకారం అనేది దాగి ఉంటుందని, మరల దీనివెనుక సాఫల్యం పొంది తీరుతామన్న భావన తప్పనిసరిగా ఉంటుందని ఆయన తెలియజేశాడు.*

*– ప్రజ్ఞాపురాణం నుండి*

**తప్పులు, పొరపాట్లతో ఓటమి రాదు. ఆ అనుభవాల నుంచి గుణపాఠం నేర్చుకోకపోవడం వల్ల వస్తుంది.**

గాయత్రీ విద్య-17

# అన్నమయకోశం - దాని సాధన



గాయత్రి యొక్క పంచముఖములలో ఆత్మ యొక్క పంచకోశములలో అన్నమయ కోశం మొదటిది. అన్నం యొక్క సాత్విక అర్థం పృథ్వి యొక్క రసం. పృథ్వి నుండి ధాన్యం, జలం, ఫలములు, కూరగాయలు, గడ్డి మొదలైనవి ఉత్పన్నం అవుతాయి. వీటితోపాటు, నెయ్యి, మాంసం మొదలైనవి తయారవుతాయి. వీటన్నింటిని అన్నం అంటున్నాము. వీటి ద్వారా రజస్సు, వీర్యం తయారయి తద్వారా శరీర నిర్మాణం జరుగుతుంది. అన్నం ద్వారా దేహం పెరుగుతుంది. పుష్టి లభిస్తుంది. చివరకు మట్టిలో కలసిపోతుంది.

ఇక్కడ ఒక విషయం గుర్తుంచుకోవాలి. **ఎముకలు మాంసంతో కనిపించే ఈ దేహం అన్నమయ కోశ ఆధీనంలో ఉంటుంది. ఈ దేహాన్నే అన్నమయ కోశం అని అర్థం చేసుకోకూడదు.** మృత్యువు సంభవించినపుడు దేహం నశిస్తుంది కాని అన్నమయ కోశం జీవునితోనే ఉంటుంది. శరీరం లేకపోయినప్పటికి జీవుడు భూతయోనుల యందు, స్వర్గనరకముల యందు ఆకలిదప్పులు, శీతోష్ణములు, నొప్పులు, బాధలు ఈ అన్నమయ కోశం ద్వారానే అనుభవిస్తాడు. ఇదే విధంగా శరీరం ద్వారా లభించే ఇంద్రియ భోగాలను కోరుకుంటాడు. భూతముల కోరికలు, ఆహార విహారాలు శరీరధారికి వలెనే ఉంటాయి. అందువలన **అన్నమయ కోశం శరీరం యొక్క కారణం, ఉత్పాదకం. కాని దీనికన్నా వేరైనది. దీనినే సూక్ష్మ శరీరం అని కూడా అంటారు.**

శరీరానికి రోగం వస్తే మందులు, ఇంజెక్షన్ లేదా శస్త్ర చికిత్స ద్వారా డాక్టరు నయం చేస్తాడు. కాని చికిత్సా పద్ధతులు స్థూల శరీరం వరకే పరిమితం. అందువల్ల ఎముకలు, కండరాలు, చర్మం వాటి వికారాల వల్ల ఉత్పన్నమైన రోగాలను మాత్రమే డాక్టర్లు నయం చేయగలుగుతారు. కాని అన్నమయకోశ వికృతి వల్ల వచ్చే రోగాలను నయం చేయడంలో ఈ శరీర చికిత్సకులు అసమర్థులే.

అన్నమయకోశ స్థితిని అనుసరించి శరీరం యొక్క రూపు, రంగు తయారవుతాయి. దానిని అనుసరించి ఇంద్రియాల శక్తి ఉంటుంది. పిల్లలు జన్మతోనే శారీరిక లోపాలతో, వికృతులతో లేదా విశేషతలతో పుడతారు. కొందరు పుట్టుకతోనే లావుగా ఉంటారు. కొందరు పీలగా ఉంటారు. కంటి దృష్టి, వాక్కు, మెదడు చురుకుగా ఉండటమో లేదా మందబుద్ధి కావడమో; ఏదైనా అంగం లేకపోవడమో లేక బలహీనంగా ఉండటమో అనేది అన్నమయకోశ స్థితిపై ఆధారపడి ఉంటుంది. మాతాపితల రజవీర్యముల ప్రభావం కొంతవరకు ఉంటుంది కాని ఎక్కువగా అన్నమయ కోశం మీదే ఆధారపడి ఉంటుంది. ఎంతో మంది పిల్లలు తల్లిదండ్రులకు భిన్నంగా స్వరూప స్వభావాలను కలిగి ఉంటారు.

శరీరం అన్నంతోనే తయారవుతుంది, పెరుగుతుంది. అన్నం లోపల సూక్ష్మజీవన తత్వం ఉంటుంది. అది అన్నమయకోశాన్ని తయారుచేస్తుంది. **జీవునికి పంచకోశములు ఉన్నట్లే అన్నమునకు మూడు శరీరాలు - స్థూల, సూక్ష్మ, కారణము ఉంటాయి.** స్థూలంలో రుచి, బరువు; సూక్ష్మంలో ప్రభావం, గుణం; కారణంలో అన్నం యొక్క సంస్కారం ఉంటాయి. జిహ్వాకు అన్నం యొక్క రుచి మాత్రమే తెలుస్తుంది. పొట్టకు దాని బరువు తెలుస్తుంది. సూక్ష్మమందు దాని మత్తు, ఉష్ణత మొదలైనవి తెలుస్తాయి. అన్నమయ కోశంలో దాని సంస్కారం పడుతుంది. మాంసం మొదలైన అనేక అభక్ష్యా (తినకూడనివి) పదార్థములు ఎలా ఉంటాయంటే నాలుకకు రుచికరంగాను, దేహం పెరిగేందుకు ఉపయోగపడేవిగాను ఉంటాయి. కాని వాటి సూక్ష్మ సంస్కారములు అన్నమయకోశాన్ని వికృతం చేస్తాయి. వాటి పరిణామములు ఆకస్మిక రోగంగాను, జన్మజన్మాంతరముల వరకు కురూపతకు, అంగవైకల్యానికి కారణమవుతాయి. అందువల్లనే ఆత్మవిద్య తెలిసిన వారు సాత్విక, సంస్కారవంతమైన అన్నమునకు ప్రాముఖ్యత ఇస్తారు. దీనివల్ల శరీరంలో రోగం రాకుండా, బలహీనత లేకుండా, వికృతం కాకుండా ఉంటుంది. తినకూడని పదార్థములు తినేవారు ఈనాడు కాకపోయినా భవిష్యత్తులో ఆంతరిక వికృతినొంది. శారీరిక సుఖాలకు దూరం అవుతాడు. ఇదేవిధంగా **అవినీతితో పొందిన సంపాదన, పాపం చేసి పొందిన సంపాదన మొదట్లో ఆకర్షణీయంగా ఉన్నప్పటికి అన్నమయ కోశాన్ని పాడు చేస్తుంది.** చివరకు శరీరాన్ని దీర్ఘకాల రోగాలు బాధిస్తాయి. ధన సంపన్నులయినప్పటికి ఇలాంటి దుర్దశ అనుభవిస్తున్న అనేక ఉదాహరణలు మనకు కనిపిస్తూనే ఉంటాయి.

ఎన్నో శారీరిక వికారాలకు మూలం అన్నమయకోశంలో ఉంటుంది. వాటి నివారణ మందులతో కాక యోగిక సాధనలతో

సమస్త విజయాలకు సహనమే సాధనం.

జరుగుతుంది. సంయమం, వ్యాయామం, మాలిష్, విశ్రాంతి, ఉత్తమమైన ఆహారవిహారాలు, జలం, వాయువు మొదలైన వాటితో శరీరంలో మంచి మార్పులు తెచ్చుకోవచ్చు. అదేవిధంగా **అన్నమయకోశ శుద్ధికి, పుష్టికి కొన్ని ప్రక్రియలు ఇవ్వబడ్డాయి. వీటి ద్వారా శారీరిక లోపాలను సరిచేసుకోవచ్చు. అవి 1) ఉపవాసం 2) ఆసనం 3) తత్వశుద్ధి 4) తపశ్చర్య**

**1) ఉపవాసం :** ఉపవాసం గురించి డిశంబరు 2011 సంచికలో (పేజి నెం.10) "ఆదివారం ఉపవాసం ఎందుకు చేయాలి?" అనే శీర్షికలో విపులంగా చర్చించబడింది.

**2) ఆసనము :** స్థూలంగా ఆసనములను శారీరిక వ్యాయామముల క్రిందనే భావించాలి. వ్యాయామం ద్వారా కలిగే అనేక లాభములు ఆసనముల ద్వారా లభిస్తాయి. సాధారణ కసరత్తుల ద్వారా లోపలి అంగాలకు వ్యాయామం జరుగకపోవచ్చు. కాని ఆసనములలో ఆ అంగముల వ్యాయామం కూడా జరుగుతుంది.

ఋషులు యోగసాధనలో ఆసనములకు పెద్దపీట వేశారు. శారీరిక ఆరోగ్య సంరక్షణకే కాక శరీరంలోని మర్మ (రహస్య) స్థానములలో ఉన్న హవ్యవాహ, కవ్యవాహ అనే శక్తులను క్రియాన్వితం (activate) చేస్తాయి. మర్మ స్థానములు అత్యంత కోమలంగా ఉన్నందున వాటి మీద బాహ్య ప్రభావములు పడకుండా ప్రకృతి వాటిని సురక్షితంగా ఉంచింది.

ఈ మర్మస్థానముల సంరక్షణలో ఎటువంటి ఇబ్బంది కలిగినా జీవితం సంకటంలో పడుతుంది. ఈ మర్మస్థానములు ఛాతిలోను, కడుపులోను ఎక్కువగా ఉంటాయి. కంఠం, భుజములు, వీపు, వెన్నెముక, బ్రహ్మరంధ్రమునకు సంబంధించిన 33 మర్మ స్థానములున్నాయి. వీటికి దెబ్బ తగిలితే వికృతి చెందుతాయి. రోగముల వలన కూడా ఇవి ప్రభావితం అవుతాయి. ఇందువల్ల రక్తశుద్ధి సక్రమంగా జరగక మాలిన్యాలు శరీరంలో ఉండి పోతాయి. శరీరం లోలోపలే కృశించిపోతుంది. బయట ఈ రోగం ప్రత్యక్షంగా కనిపించదు. కాని దేహం లోపల తీవ్ర ఏర్పడుతుంది. జ్వరం కనిపించదు. కాని నోరు చేదుగా ఉంటుంది. శరీరంలో గగుర్పాటు కలుగుతుంది. బరువుగా ఉంటుంది. ఉదాసీనత, తలనొప్పి, తల బరువుగా ఉండటం, దాహం మొదలైన జ్వర లక్షణాలు కనిపిస్తాయి. వైద్యులు పరిస్థితి అర్థం చేసుకోలేరు. మందుల వల్ల లాభం కనిపించదు.

మర్మస్థానాలకు దెబ్బ బలంగా తగలడం వల్ల ఆకస్మిక మృత్యువు సంభవిస్తుంది. అభిచారులు మారణ ప్రయోగాలను ఈ మర్మస్థానములపై చేస్తారు. హాని, శోకం, అవమానం మొదలైన మానసిక దెబ్బలు మర్మస్థానములకు తగిలితే ప్రాణ సంకటంలో పడవచ్చు. మర్మస్థానములు శక్తివిహీనమైనప్పుడు కీళ్ళ నొప్పులు, బొల్లి, కిడ్నీలలో రాళ్ళు, చర్మం ఎండిపోవడం, అతిమూత్రం, మొలలు మొదలైన మొండి రోగాలు కలుగుతాయి.

శిరస్సులో మొండెంలో ఉన్న మర్మస్థానములలో "హవ్య వాహ" అనే ధన విద్యుత్ (Positive) ఉంటుంది. కాళ్ళు చేతులలో "కవ్యవాహ" అనే ఋణ (Negative) విద్యుత్ ఉంటుంది. ఈ రెండింటి సంతులనం కోల్పోతే పక్షవాతం వంటి ఉపద్రవాలు వాటిల్లుతాయి.

అనేకసార్లు లావుగా, బలంగా కనిపించే వారు కూడా రోగములబారిన పడవచ్చు. ఈ మర్మస్థానముల గడబిడవల్ల స్థూల శరీరం రోగగ్రస్తమవుతుంది. **సాధారణ ఎక్సర్‌సైజ్, వ్యాయామాల వల్ల ఈ మర్మస్థానముల వ్యాయామం జరుగదు.** మందుల ప్రభావం అక్కడి దాకా వెళ్ళలేదు. ఆపరేషన్లు, సూదిమందులు (ఇంజెక్షన్లు) వాటిని ప్రభావితం చేయలేవు. **ఈ మర్మస్థానములను సరిచెయ్యడం యోగాసనాలకు మాత్రమే సాధ్యము.**

మంచి ఆహార విహారాలు ఉన్నప్పటికి, విశ్రాంతి, వ్యాయామం సముచిత రీతిలో ఉన్నప్పటికి అనేకసార్లు అజ్ఞాత సూక్ష్మకారణాల వల్ల మర్మస్థానములు వికృతమయి, వాటిలో ఉన్న హవ్యవాహ, కవ్యవాహ శక్తులు సంతులనం కోల్పోతాయి. రోగములు బలహీనతలు చుట్టుముడతాయి. అందువల్ల యోగసాధనలో ఇబ్బందులు కలుగుతాయి. వీటిని నివారించేందుకు ఋషులు అనేక ప్రయోగాలు చేసి ఆసన ప్రక్రియలను ఆవిష్కరించారు.

ఆసనాల ప్రభావం సరాసరి మర్మస్థానములపై పడుతుంది. వాటిలో ఉన్న వికారాలు తొలగిపోతాయి. **మర్మస్థానముల శుద్ధత, స్థిరత, పరిపుష్టి కొరకు ఆసనములను అత్యుత్తమ పద్ధతిగా చెప్పబడ్డాయి.**

ఆసనములు అనేకం (84). కాని ఎనిమిది ఆసనములు అన్ని మర్మస్థానములపై మంచి ప్రభావాన్ని చూపిస్తాయి. వీటిలో మీకు అనుకూలంగా ఉన్నవి 4-5 చెయ్యవచ్చు. ఆసనములు ఏమి తినకముందు చెయ్యాలి. వీటి ఉపయోగం, సరళత ఇతర ఆసనముల కన్నా ఎక్కువ. ఇవేకాక ముఖ్యమైనది ఏమంటే వీటిని ఉపాసన కార్యక్రమం తరువాత చేయాలి ఎందుకంటే ఈ ఆసనముల వల్ల రక్తవేగం పెరుగుతుంది. అలాంటి పరిస్థితి ధ్యానమునకు అనుకూలం కాదు. అందువలన ధ్యానం, ఉపాసన మొదలైన కార్యక్రమముల తరువాత ఆసనములు అభ్యాసం చెయ్యాలి. (సశేషం)

**ఎప్పుడు నవ్వుతూ ఉండు. అప్పుడు ఈ ప్రపంచంలో ఎవరూ నీకన్నా అందంగా ఉండరు.**

ధారావాహిక ప్రజ్ఞోపనిషద్ : ప్రథమకాండే పంచమోఽధ్యాయః

# మొదటి ప్రకరణం

**స సమస్త విశ్వస్య వైభవాదతి రిచ్యతే ।**
**ఆనందదాయకత్వే నామృతం, లబ్ధంతు తేనరైః ॥ 60**

పరిపూర్ణత్వాన్ని పొందిన మానవులు లోకకల్యాణం కొరకు తపిస్తూ లోక వైభవం కొరకు పరిశ్రమిస్తారు. ఆనందదాయకత అనే లక్ష్యంతో పయనిస్తూ, అనిర్వచనీయమైన అమృతాన్ని ఆస్వాదిస్తారు. ఆ అమృతధారలలో తాము పులకితులౌతూ, అందరినీ పరవశింపచేస్తారు.

**ఉదార మనసా భక్త జనానాం జీవనం మునేః ।**
**విప్రా ఽపరిగ్రహిత్వేన స్వభావేన యుతం భవేత్ ॥ 61**

ఉదారగుణం గల భక్తులు కేవలం తమ స్వార్థ ప్రయోజనం కొరకు మాత్రమే కాకుండా, లోకకల్యాణం కొరకు, సమాజ శ్రేయస్సు కొరకు తమ వృత్తి, ప్రవృత్తులను మలుచుకుంటారు. అంటే ముని జనులు, ఋషి వరేణ్యులు కేవలం తమ పుణ్యం కొరకు మాత్రమే కాకుండా, వర్షాల కోసం, అనావృష్టి తొలగి పోవడం కొరకు, రాక్షసుల పీడ తొలగిపోవడం కొరకు దైవప్రార్థన, యజ్ఞయాగాదులను నిర్వహించడం జరిగేది.

వశిష్ఠుడు, విశ్వామిత్రుడు వంటి బ్రహ్మర్షులు, రాజ గురువులుగా ధర్మోపదేశం చేస్తూ, లోకకంటకులైన రాక్షస సంహారానికి రాజులను ప్రేరేపించారు. తాము తపశ్శక్తిమంతులైనా, తమ తపోబలం ఉపయోగించకుండా, క్షేత్ర ధర్మప్రకారం రాజ్య రక్షణ బాధ్యతను స్వీకరించారు.

విశ్వామిత్రుడు, రాముని తన వెంట తీసుకునివెళ్ళి, తాటకిని, సుబాహువులను రాముని చేత వధింపచేసి, అహల్య శాపాన్ని తొలగింపచేసి, సీతారాముల కల్యాణం ద్వారా, రావణ సంహారానికి శ్రీకారం చుట్టాడు. ఆ విధంగా ఋషులు, మునులు, బ్రాహ్మణులు తమ మేధస్సు ద్వారా స్వార్థ చింతన లేకుండా పరార్థ చింతనతో లోకకల్యాణం కొరకు ప్రయత్నించాలి. అటువంటి ధర్మ గురువులకు ఎటువంటి ఆటంకం, అవరోధం లేకుండా చూసుకో వలసిన బాధ్యత సమాజానిదే. వారికి కావలసిన యజ్ఞ యాగాదులకు అవసరమైన సరంజామాను, సంబారాలను సమాజమే సమకూర్చాలి.

సగరపుత్రులు ఆగ్రహంతో, ఆవేశంతో కపిలమహర్షిపై తెగబడినప్పుడు, ఆయన ఆగ్రహానికి గురియై దహించబడడం, తదనంతరం గంగానది ముల్లోకాలను పవిత్రం చేయడానికి కారణమైంది. ఆ విధంగా ఋషులు / మునుల ఆగ్రహం కూడా లోకపావనం చేయడానికి దోహదపడింది. ఈ విధంగా 'నిష్కామ కర్మ' తో కూడిన మునుల ప్రవృత్తి లోక కల్యాణాన్ని కోరుతుంది.

**పరాయణం పరార్థేచ సాధునామివ జాయతే ।**
**న భవంతి ధనాధ్యక్షా యద్యప్యేతే తథాపి తు ॥ 62**

సజ్జన ప్రవృత్తి గల మునులు పరోపకారమే, పరాయణత్వంగా భావిస్తూ, లౌకిక ప్రయోజనాలకు, ధనకాంక్షకు అతీతులుగా ఉంటారు. నదులు, సూర్యచంద్రులవలే తమ జీవితాలు లోక కల్యాణం కొరకు మాత్రమే నిర్దేశించబడినవని, పరోపకారమే పరమార్థం (పరమధనము) గా భావిస్తూ, భగవంతుడు ఇచ్చిన మానవ జన్మకు సార్థకత కొరకు పరితపిస్తారు.

ధర్మవ్యాధుని కథ నుండి ధర్మప్రవృత్తిని పొందగోరిన కౌశికుడు కేవలం ధర్మానికి మాత్రమే ప్రాధాన్యతనిచ్చాడు. 'అర్థం' (ధనాన్ని) కోరుకోలేదు. ఋషులు, మునులు, ఆచార్యులు తమ తమ వృత్తులను ధార్మికంగా, లోకరక్షణ కొరకు, నిర్దేశించేవారే తప్ప లౌకికపరమైన సంపదలను ఆశించరు.

**ఆత్మికానాం, విభూతీనాం నిధింస్తే ప్రాప్యవంత్యలమ్ ।**
**కుబేరసంపదా యేభ్యో న్యూనామన్యేత నిశ్చితమ్ ॥ 63**

ఆత్మ తత్త్వాన్ని ఆశ్రయించేవారికి ఆధ్యాత్మికతయే మూల ధనం. కుబేరుని సంపదలు వీటి ముందు, గడ్డిపోచతో సమానము. మునిజనులు తాము ఆచరించు కర్మలయందు ఆత్మ సంతృప్తియే అసలైన ధనముగా భావిస్తారు. ఆ ఆత్మసంతృప్తిలోనే యదార్థ ఆనందాన్ని పొందుతారు.

**భక్తేరుదారభావస్య జాయతేత్వరుణోదయః ।**
**సహకారి ప్రవృత్తే, తత్ప్రయాసోఽత్ర విధీయతామ్ ॥ 64**

భక్తి యొక్క ఉదారతాగుణం, సహకార ప్రవృత్తి ద్వారా వికసిస్తుంది. ఎటువంటి ప్రలోభాలకు లొంగక, ఎటువంటి కోరికలు లేకుండా, సర్వం దైవానికి అర్పణం అన్నభావం సహకార గుణం ద్వారా వెలువడుతుంది. అటువంటి సహకార గుణాన్ని తమ ధర్మంగా భావిస్తూ నిశ్చలభక్తితో, నిర్మలశక్తితో ప్రయత్నం చేయాలి.

**ఇతరుల ఓటమి నీ గెలుపు కాదు. అలానే, ఇతరుల గెలుపు నీ ఓటమి కాదు.**

"ఓం నమో భగవతే వాసుదేవాయ" అనే ద్వాదశ అక్షర మంత్రాన్ని నారదుల వారి ఉపదేశంతో పొందిన ధృవుడు, విష్ణు అనుగ్రహాన్ని పొందిన తీరు, నిత్యం నారాయణ మంత్రజపంతో సార్థక్యం చెందిన ప్రహ్లాదుడు, పంచాక్షరి "ఓం నమశ్శివాయ" అన్న మంత్రబలంతో మార్కండేయుడు భక్తి సామ్రాజ్యాన్ని ఏలిన గాథలు ప్రతిభక్తుడు స్మరించుకుంటూ, సాధన చేయగలగాలి.

**వాసః పరస్పరాపేక్షి, విభాజాపేక్షి భోజనమ్ ।**
**స్థితిః ప్రమోదపూర్ణా చహ్యస్యా ఏ వోపలభ్యతే ॥ 65**

సహకార ప్రవృత్తి ముఖ్యంగా నివసించే పరిసరాలు, స్థితి గతులు, ఆరోగ్యకరమైన వాతావరణంపై ఆధారపడి ఉంటాయి. ఆవాసం సక్రమంగా ఆహ్లాదకర వాతావరణంలో ఉంటే, ఆహారపు అలవాట్లు కూడా వాటికి సహకరిస్తాయి. రజోగుణం, తమో గుణాలు ప్రవృద్ధి కాకుండా తినే ఆహారం, వ్యక్తి, ఆలోచనలకు పదునుపెట్టే సాధనంగా ఉపయోగపడుతుంది. అందుకే సాత్త్వికమైన పౌష్టిక ఆహారం, సాధుజనులను సత్పథంలో నడిపిస్తుంది. సత్ప్రవృత్తికి, సదాశయాలు తోడై సమాజమే దేవాలయమన్న ఆలోచనలకు తోడుగా మంచి ఆరోగ్యం కావాలంటే చక్కటి ఉల్లాసకరమైన వాతావరణం ఉండాలి. ఛలోక్తులు, చమత్కారాలు (ఇతరులను విమర్శించేవి కాకుండా, నొప్పించని రీతిలో ఉండకుండా ఉండేవి). ఇందుకు దోహద పడతాయి.

**సహయోగేన పంథాః, సత్ప్రశస్తః ప్రగతేర్మతః ।**
**సంఘం బద్ధత్త్వమేవేదం, సామర్థ్యం పరమంస్మృతమ్ ॥ 66**

సహయోగం, సమభావం, సహవాసం అనే విషయాలు ఉదరతా భావనకు ఆలంబనగా నిలుస్తున్నాయి. అందరినీ కలుపుకుపోతూ, అందరి ఆలోచనలను అవగాహన చేసుకుంటూ, తాను ఒక్కడే భుజించకుండా, తాను సంపాదించిన ఆహార పదార్థాలను అందరితో కలిసి పంచుకుని తినడం వల్ల అసలైన ఆత్మానందం కలుగుతుంది. **"ఏకః స్వాధున భుంజీత"** అన్న ఆర్యోక్తిని సదాస్మరించుకోవాలి. "సంఘ జీవులం మనం" అనే ఆలోచన మనలోని అజ్ఞానపు చీకట్లను తొలగించి, సామర్థ్యాన్ని పెంచేసాధనంగా మారుతుంది.

**సంకీర్ణ స్వార్థభావం యే నరాః గృహ్ణంతి సర్వదా ।**
**దివ్యాభ్యో వంచితానూనమనుభూతిభి రేవ తే ॥ 67**

ఏ మానవులు స్వార్థంతో కూడిన సంకీర్ణ భావాలతో ఉంటారో, వారు వారికి చెందిన లౌకిక ప్రవృత్తులే దివ్య అనుభూతులు అన్న మాయలోపడి వంచనకు లోనవుతూ ఉంటారు. దీనివలన అసలైన ఉదారభావానికి, యదార్థభక్తి తత్త్వానికి దూరమై పోతారు. అంతేగాక పరస్పర సహకారతత్త్వం లేకపోవడం వల్ల అందరికి దూరమై, ఏకాకిలాగా దుర్భర జీవితాన్ని గడుపుతారు.

**భక్తి మాత్రాశ్రేయేణే మె లాభాః, ప్రాప్యంత ఏకదా ।**
**ఆత్మకల్యాణ మీశాప్తిర్విశ్వకల్యాణ మేవచ ॥ 68**

భక్తిని ఆత్మాశ్రయభక్తిగా తలచినపుడు, మానవజన్మ పరిపూర్ణమై ఆత్మకల్యాణం, విశ్వకల్యాణం మరియు ఈశ్వర ప్రాప్తి అనే ప్రయోజనాలు సిద్ధించే అవకాశాలు కలుగుతాయి. ఈ త్రివిధాత్మకమైన ప్రయోజనాలు వాటి స్వభావ స్వరూపాలను వచ్చే వ్యాసంలో చర్చించుకుందాం.

*– కథాకథన వ్యాఖ్యానం: సాధన నరసింహాచార్య*

## చిత్తరంజన్ దీక్ష

*దేశబంధు చిత్తరంజన్ ఆలీపూర్ కుట్ర కేసు విషయంలో క్షణం తీరిక లేకుండా ఉన్నాడు. శ్రీ అరవిందో మొదలైన దేశ భక్తులను రక్షించడానికి కావలసిన సాక్ష్యాధారాల సేకరణలో రాత్రింబవళ్ళు నిమగ్నమయి ఉన్నాడు.*

*ఈ పరిస్థితులకు ఏ మాత్రం స్పందించని ఒక వ్యాపారి తన దగ్గర తీసుకున్న రెండు లక్షల రూపాయలు తక్షణం ఇవ్వమని చిత్తరంజన్‌దాస్ గుమ్మం ముందు తిష్ఠ వేశాడు. ఆ డబ్బు జాతీయోద్యమం కొరకు అప్పు తీసుకోవడం జరిగింది. ఇంతలో మరొక పెద్దమనిషి వచ్చి చాలా చిక్కుల్లో ఉన్న తన కేసును వాదించమని ఐదు లక్షల రూపాయలు ఇస్తానని ప్రాధేయపడసాగేడు.*

*కాని చిత్తరంజన్ దాస్ దేశభక్తులను రక్షించవలసిన కేసు విచారణ అయితే తప్ప వేరొక కేసు చేపట్టనని తన దృఢ నిర్ణయాన్ని తెలియచేస్తాడు. ఐదు లక్షల ఫీజు చాలకపోతే ఎంత కావాలంటే అంత ఇస్తానని తక్షణం చేతిలో పెడతానని తన కేసుని వాదించమని ఒకవైపు ప్రాధేయపడుతున్నాడు. మరొకవైపు తన అప్పు తక్షణం తీర్చమని వ్యాపారి ఒత్తిడి చేస్తున్నాడు. కాని చిత్తరంజన్ దాస్ ప్రస్తుతం తాను రక్షించ వలసిన దేశభక్తుల జీవితాలు భారతదేశంలోని యావదాస్థి కంటే విలువైనవని, తన నిర్ణయం మారదని తెలియజేస్తాడు.*

– ప్రజ్ఞాపురాణం నుండి

**చేయవలసిన పనిని చేయకపోవడం, చేయకూడని పనిని చేయడం రెండూ తప్పే.**

## సూర్య విజ్ఞానం - 16

# సర్వాంగ పూర్ణ చికిత్సలో దేవాధిదేవుడైన సూర్యుని మహత్వపూర్ణ భూమిక

సౌరమండలం యొక్క ఊర్జా ప్రవాహాలు (శక్తి ప్రవాహాలు) జీవితం యొక్క అన్ని రంగాలను ప్రభావితం చేస్తాయి. కాని దీని యొక్క గొప్ప ఉపయోగం మానవుని స్వాస్థ్యం (ఆరోగ్యం) తో జోడింపబడి ఉన్నది. ఈ రహస్యాన్ని బాగా ఆకళింపు చేసుకున్నందువల్లనే ఆయుర్వేదం అన్ని రకాల వ్యాధులను పూర్తిగా నయం చేయగల సామర్థ్యం కలదిగా రూపొందింది. ఆ రోజులలో అసాధ్యమైన రోగం అంటూ ఉండేదిగాదు. రోగనివారణతో ఆరోగ్యాన్ని పెంపొందించుకొనుటయేగాక వృద్ధాప్యంలో కూడా యౌవ్వనం ప్రాప్తించే కాయకల్పం వంటి పద్ధతులు ఆయుర్వేదంలో దొరుకుతాయి.

ఆయుర్వేద చికిత్సా ప్రణాళిక, ఉపచార పద్ధతులు ఈనాటికి లభిస్తున్నాయి. దీనికి సంబంధించిన మహత్వపూర్ణ గ్రంథములు కూడా లభ్యమవుతున్నాయి. రోగోపచారమునకు కావలసిన మూలికలు కూడా తెలుసు. కాని ఈనాడు సామాన్యరోగాలకు కూడా నివారణ లభించటం లేదు. ఇక అసాధ్యరోగాల గురించి, కాయకల్పం గురించి చెప్పేదేముంది. అందువలన ఆయుర్వేదం లోతులలోకి వెళ్ళాలి. అలా చెయ్యటం వల్ల ఒక తథ్యం ముందుకు వస్తుంది. **ప్రాచీన ఆయుర్వేదంతో పాటు సౌరపరివార (Solar System) ఊర్జా ప్రవాహాల జ్ఞానం కలసి ఉండేది.** ఆయుర్వేదం యొక్క సఫలత ఈ విద్యపై కొంతవరకు ఆధారపడి ఉండేది.

ఆయుర్వేదంలో చరకుడు, శుశ్రుతుడు, వాగభట్టు పేర్లు ప్రముఖంగా వస్తాయి. వీరు చికిత్సా శాస్త్రంలోనేగాక జ్యోతిర్విజ్ఞాన రహస్యములు తెలిసినవారు. చరకుడు వనస్పతులు సంగ్రహానికి వనములకు కొండలకు కోనలకు వెళ్ళినపుడు అక్కడ ఉన్న వనౌషధులు తమ గుణములను ఆయనతో చెప్పేవని ఆ రోజులలో చెప్పుకునేవారు. అంతేగాక ఆ వనమూలికలను ఏ వాతావరణంలో ఎప్పుడు నాటితే ఏ విధమైన ప్రత్యేకతలు కలిగి ఉంటాయో, ఎటువంటి మనోభూమి కలిగి ఉన్న రోగులకు లాభాన్ని కలిగిస్తాయా కూడా చెప్పేవిట. ఈ కథలు సత్యమో అసత్యమో అనేది ముఖ్యం కాదు. **ముఖ్యమైనదేమిటంటే రోగనివారణ కొరకు ఔషధులు మాత్రమే సరిపోవు. అవి ఏ వాతావరణంలో ఎప్పుడు ఈ గ్రహనక్షత్ర యోగ స్థితిలో నాటితే ఎటువంటి ప్రభావం చూపిస్తాయో తెలుసుకోవడం కూడా అవసరమే.**

మానవుని ఆరోగ్యం అంతర్‌గ్రహ గతివిధులు (activities) పరివర్తనతో అసాధారణ రూపంలో ప్రభావింపబడుతుంది. ఈ విషయమును వెలుగులోనికి తీసుకువచ్చే అనేక సూత్రాలు ఆయుర్వేదంలో లభిస్తాయి. **జ్యోతిష సూత్రములలో "అష్టమి వ్యాధినాశిని" అంటే చంద్రుని 8వరోజు సంపూర్ణ వ్యాధులను అంతం చేసే రోజు. అంటే ఆ రోజు తీసుకునే ఏ మందైన చాలా లాభదాయకంగా ఉంటుంది.** అష్టమినాడు సూర్యుడు చంద్రుడు పరస్పరం ఒకరికొరకు $90^0$లలో ఉంటారు. అందువల్ల ఇద్దరు కూడా పృథ్వి మీద అన్ని ద్రవాల మీద తమ ఆకర్షణ తగ్గిస్తారు. మానవ శరీరంలో ఉన్న రక్తం, జలం మీద సూర్యుని చంద్రుని ఆకర్షణ తక్కువగా ఉండటం వల్ల ఈ అవధిలో ఇవ్వబడిన మందులు అధిక ప్రభావమును చూపుతాయి.

"భైషజిక జ్యోతిషం" అనుసరించి అనేక రోగములు ముఖ్యంగా చర్మరోగములు, పిచ్చి, అపస్మారకం, మానసిక వికృతులు శుక్లపక్షంలో తీవ్రంగా ఉంటాయి. ఆధునిక చికిత్సలో దీనికి సంబంధించిన వివరములు ఏమి లేవు. జ్యోతిష్య విజ్ఞానాన్ని అనుసరించి సూర్యుడు చంద్రుడు ఆకాశంలో దగ్గరగా ఉంటారు. ఈ రెండే పృథ్వి వాయు మండలంలో వ్యాపించియున్న వాయు కణములను అధికంగా ఆకర్షిస్తాయి. దీని ప్రభావం మనుష్యుల, పశువుల ఆరోగ్యంపై పడుతుంది. చతుర్దశినాడు సూర్యుడు చంద్రుడు పరస్పరం $180^0$లలో ఉంటారు. ఈ రోజులలో రోగముల తీవ్రత భావనాత్మక ఉద్వేగం చరమ బిందువుపై ఉంటాయి.

ఆయుర్వేదం యొక్క సుప్రసిద్ధ త్రిదోష సిద్ధాంతం కూడా సౌరమండల ఊర్జా ప్రవాహముల సూక్ష్మ రహస్యములతో నిండి ఉన్నాయి. వీటిని అర్థం చేసుకోగలిగితే రోగముల ఉపచారములలో చాలా ఉపయోగిస్తాయి. "వాతం" అనే శబ్దం "వా" ధాతువుతో ఉత్పత్తి అయింది. "పిత్త" శబ్ద ఉద్గమం "తప" తో జరిగింది. తపం అంటే "తాపసం తామే పిత్తం" అంటే ఉత్తేజన శక్తి. శ్లేష్మం అంటే ఆకర్షణ. టీకాకారుడైన చక్రపాణి ఈ మూడింటిపై సారగర్భితమైన వ్యాఖ్యానం చేశారు. వాతం గతికి (Speed, Direction), పిత్తం శక్తికి, కఫం ఆకర్షణకు ప్రతీకలు. కాని ఈ మంత్రం తెలుసుకుంటే సరిపోదు. ఎందుకంటే శరీరం యొక్క మూడు మూలమైన రసాయనిక ప్రకృతులతోపాటు వీటి సూక్ష్మ తత్వములు తెలుసుకొనుట కూడా అవసరమే.

**కుక్క మొరుగుతోందని సింహం వెనుదిరిగి చూడదు.**

ఆయుర్వేద ఆచార్యుడు శుశ్రుతుని అనుసారం ఏ విధంగా అయితే సూర్యుడు, చంద్రుడు వాయువుల శక్తులు ప్రపంచంలో అవసరమో అదేవిధంగా **వాత, పిత్త, కఫముల సంతులనం (balance) శారీరిక, మానసిక ఆరోగ్యమునకు అవసరము. ఈ ప్రకృతులపై సౌరమండలంలోని గ్రహములు, గతి, స్థితి మార్పులు ఎప్పుడెప్పుడు ఏ ప్రభావం చూపిస్తాయో తెలుసుకోవడం కూడా చాలా ముఖ్యం. రోగమును తగ్గించడం అప్పుడే సాధ్యపడుతుంది.**

జ్యోతిర్విజ్ఞానము అనుసరించి తారాపుంజముల మూడు సముదాయములకు ఆయుర్వేదంలోని త్రిదోష సిద్ధాంతముతో సంబంధం ఉన్నది. ఈ మూడు వాత పిత్త కఫముల స్థితులను కూడా తరచూ ప్రభావితం చేస్తాయి. ఇదేవిధముగా గ్రహముల ప్రభావము కూడా ఈ మూడు ధాతువులపై పడుతుంది. సూర్యుడు పిత్తంపై, చంద్రుడు వాతంపై ప్రభావం చూపిస్తాడు. చంద్రకళల స్థితి, పరిస్థితి సూర్యుని పరిస్థితి కారణంగా ఈ రెండు తత్వములలో ఎగుడు దిగుడులు ఉంటాయి. చంద్రుడు మనస్సును, సూర్యుడు ఆత్మను, బుధుడు చేతనత్వాన్ని ప్రభావితం చేస్తాయని జ్యోతిష్య శాస్త్రం చెబుతుంది. ఈ వ్యక్తుల జాతకాలలో సూర్యుడు చంద్రుడు అగ్నిరాశుల నక్షత్రములతో ఉంటారో – అటువంటి స్థితిలో వేడిగా ఎండగా ఉండే జలవాయు ప్రదేశాలలో ఉన్న వ్యక్తుల చేతనత్వంలో వికృతులు సంభవిస్తాయి. ఈ కారణాలు నేటి వైద్యులకు తెలియదు. అందువల్ల ఆ రోగాల చికిత్సలో మంచి ఫలితాలు రావడం లేదు.

శరీర విజ్ఞానం చికిత్సా శాస్త్రముల యొక్క నిగూఢ రహస్యములపై, సౌరమండల ఊర్జా (శక్తి) ప్రవాహం ప్రపంచమంతటా లోతైన పరిశోధనలు ప్రారంభమయ్యాయి. రోగముల ఉత్పత్తి, వాటి చికిత్స, శారీరిక మానసిక స్థితులపై అంతర్ గ్రహ ప్రభావం ఉంటుంది. ఈనాడు వైద్య శాస్త్రవేత్తలు దీనిని అంగీకరిస్తున్నారు. డా॥ ఎడ్‌సన్ అనేక ప్రయోగముల తరువాత రక్తస్రావములు 80% చంద్రుని మొదటి, మూడవ వారములలో జరుగుతాయని నిర్ధారించారు. ప్రొఫెసర్ రివిస్జ మానవశరీరంలో విద్యుతీయ శక్తి పౌర్ణిమ రాత్రి ఎక్కువగా ఉంటుందని అంటారు. ఈ విద్యుతీయ పరివర్తన మానవుని మానసిక పరిస్థితిని అల్లకల్లోలం చేస్తుంది. ఈ మానసిక అల్లకల్లోలం వల్ల ఈ రోజులలో అపరాధాలు కూడా ఎక్కువగా జరుగుతాయని డా॥ బేకర్ అభిప్రాయం రష్యాకు చెందిన సుప్రసిద్ధ వైజ్ఞానికుడు నికోల ససివుజ్ సూర్య కళంకాలు (Sun Spots) వృద్ధి అవడం వల్ల రక్తంలో రక్షణ ఇచ్చే తెల్ల కణాలు తగ్గుతాయని అంటాడు. ఫల స్వరూపంగా రోగాల బారినపడే అవకాశం ఎక్కువగా ఉంటుందని అంటాడు.

ప్రాచీన జ్యోతిర్విద్యలో కేవలం రోగాల ఉత్పత్తికి కారణాలేగాక వాటి చికిత్స గురించిన వివరాలు ఇవ్వబడ్డాయి. భేషజీయ జ్యోతిర్విజ్ఞానంలో రోగములను తగ్గించుకునే విధానాల విస్తృత వర్ణన ఇవ్వబడింది. వీటిలో ఔషధులతో పాటు అంతర్‌గ్రహ పరివర్తనలతో తినటం, త్రాగటంలో ఎలాంటి మార్పులు చేసుకోవాలో, ఉపవాసం, మంత్ర చికిత్స ప్రయోగాలు కూడా వర్ణించబడ్డాయి. “అరిష్ట యోగం” లో రోగులు కోల్పోయిన శక్తిని, నశించిన కోశికలను (కణ సముదాయం) మంత్ర చికిత్స ద్వారా తిరిగి పొందవచ్చని చెప్పబడింది.

సౌరమండలంలోని వివిధ ఊర్జా (శక్తి) ప్రవాహముల మూలం స్వయంగా సూర్యుడే. మిగిలినవన్నీ ఈ శక్తితో అనుసంధానమై కలసి సంచరిస్తుంటాయి. అందువల్లనే సూర్యుని గ్రహాధిపతిగా భావిస్తారు. సూర్యుని ఉపాసన అన్ని అంతరిక్షీయ శక్తి ప్రవాహములను సంతులనం చేసి గ్రహముల దుష్పరిణామములను నశింపజేస్తుంది. అధర్వణవేదంలో ఇలా చెప్పబడింది.

**అపచితః ప్ర పతత సుపర్ణో వసతేరివ**
**సూర్యః కృణోతు భేషజం చంద్రమా వాపోచ్ఛతు**
**– అధర్వ 6-83-1**

ఏ విధంగా సుపర్ణుడు (గరుడుడు) వసతి నుండి పరిగెత్తుతాడో అదే విధంగా అజీర్ణం మొదలైన వ్యాధులు దూరమవుతాయి. దీనికొరకు **సూర్యుడు ఔషధులు తయారుచేస్తే, చంద్రుడు తన ప్రకాశంతో వ్యాధులను నాశనం చేస్తాడు.**

సూర్యుడు ఔషధమును ప్రాణస్వరూపంలో తయారుచేసి తన కిరణముల ద్వారా ఆరోగ్యమును సరిచేస్తాడని పై మంత్రం చెప్తున్నది. పద్మ పురాణంలో కూడా ఇలా చెప్పబడింది. **“అస్యోపాసన మాత్రేణ సవరోగా ప్రముచ్యతే” (సృష్టి ఖ71/17)** సూర్య భగవానుని ఉపాసనతో అన్ని రోగాల నుంచి ముక్తి లభిస్తుంది.

సూర్యోపాసన ద్వారా రోగనివారణ రహస్యం తెలుసుకోవాలి. దీనితోనే బ్రహ్మాండంలోని ఊర్జా ప్రవాహముల సంతులన, అంతర్‌గ్రహ దుష్పరిణామముల నివారణ ముడిపడి ఉన్నాయి. మహత్వపూర్ణమైన సౌరమండల దైవీయ జ్ఞానం కూడా చికిత్సా విజ్ఞానంతో జోడింపబడితే రోగములకు కారణం, నివారణల ఆశ్చర్యకరమైన సూత్రం చేతికందుతుంది.

*– అఖండజ్యోతి, జూన్ 1993*

సాకులు చెప్పడం నేర్చినవాడు ఇంకేమీ నేర్చుకోలేడు.

పూజ్య గురుదేవుల శతసూత్ర కార్యక్రమం: 21-30

# అజ్ఞానాంధకారాన్ని అంతం చేద్దాం

జీవితాన్ని వికసింపచేయాలంటే మనసు వికసించాలి. అందుకోసం శిక్షణ (విద్య) అత్యవసరం. శిక్షణ పొందిన తర్వాత దానిని సద్వినియోగం చేయనివారు పలువురు ఉన్నమాట నిజమే. అయినా మానసిక వికాసానికి విద్య అవసరమని ఒప్పుకుని తీరాలి. విద్య ద్వారానే జ్ఞానజ్యోతి అంతరాత్మలో ప్రవేశిస్తుంది. భౌతిక వికాసానికి కూడా విద్య తప్పనిసరి. విచారకరమైన విషయం ఏమంటే మనదేశంలోని ప్రజలందరు విద్యావంతులు కారు. వయోజనులలో ఏ ఒక్కరు నిరక్షరాస్యులుగా ఉండకుండా చేయడం యుగపరివర్తనకు అత్యవసరం. ఇందుకోసం దిగువ పది కార్యక్రమాలు అమలు జరగాలి.

**పిల్లలను బడికి పంపాలి :** పాఠశాలలో చదివే వయసు వచ్చిన పిల్లలను బడికి పంపేందుకు వారి తల్లిదండ్రులను ఒప్పించాలి. చదువు ఆపేసిన వారిని తిరిగి బడిలో చేర్పించాలి లేదా వారు ప్రైవేటుగా చదువుకునేటట్లు చేయాలి. వయోజనులైతే వారిని వయోజన పాఠశాలలో చేర్పించాలి. కుటుంబంలోని చదువుకున్న వారు తమ ఇంటిలోని చదువుకోని వారికి విద్య ఎంత అవసరమో తెలియచెప్పాలి. వారు చదువుకునేటట్లు చేయాలి.

**విద్యావంతుల భార్యలు నిరక్షరాస్యులుగా ఉండకూడదు:** విద్యావంతులకు తమ ఇంటిలో ఉన్న నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేయవలసిందిగా నచ్చచెప్పాలి. వారిని చదివించేందుకు సమయాన్ని కేటాయించేందుకై వారికి ప్రేరణ ఇవ్వాలి. పెక్కు కుటుంబాలలో స్త్రీలకు చదువు రాదు. వచ్చినా కొద్దిగా వస్తుంది. భార్య నిజంగా అర్థాంగి కావాలంటే ఆమెకు చదువు చెప్పడం కాని చెప్పించడం కాని తమ పవిత్ర కర్తవ్యమని విద్యావంతులు గుర్తించాలి.

**వయోజన పాఠశాలల ఏర్పాటు :** సేవాభావం కలిగిన విద్యావంతులు కలసికట్టుగా గ్రామగ్రామంలో, పేటపేటలో రాత్రిపూట తీరిక సమయంలో తిరుగాడే (mobile) వయోజన పాఠశాలలు ఏర్పాటు చేయాలి. చదువురాని వారిని నచ్చచెప్పి ఆ పాఠశాలలో చేర్చి వారికి చదువు చెప్పడం సరస్వతీ పుత్రుల కర్తవ్యం. ఇతరులకు సాయపడే జీవితమే ధన్యమైనది. చదువు రాని వారికి చదువు చెప్పే విద్యయే ధన్యమైనది. ఇలా చదువు చెప్పడానికి సేవాభావం కలిగిన సహృదయులను తయారు చేయడం, వారిని ప్రోత్సహించడం ముఖ్యమైన పని.

**వయోజన మహిళలకు శిక్షణ ఏర్పాటు :** మహిళల కోసం వయోజన పాఠశాలలు నిర్వహించడానికి మధ్యాహ్నం అనుకూలంగా ఉంటుంది. ఇంటి పనులు ముగించుకున్న తర్వాత మధ్యాహ్నం 2 నుండి 4 గంటల వరకు వారికి తీరిక ఉంటుంది. వారి కోసం పాఠశాలను ఆ సమయంలో నిర్వహించాలి. చదువుకున్న మహిళలు వీటిని నిర్వహించడం మంచిది. అది సాధ్యపడకపోతే 15-16 సంవత్సరాలలోపు బాలురకు కాని, వయో వృద్ధులకు కాని ఆ పని అప్పగించవచ్చు.

**శిక్షణతోపాటు దీక్ష :** వయోజన విద్య కోసం సూత్రబద్ధమైన పాఠ్యప్రణాళికను తయారుచేయాలి. తగిన పుస్తకాలను అందుకు వినియోగించాలి. **అక్షరజ్ఞానంతోపాటు జీవిత సమస్యల విశ్లేషణ కూడా ఆ పుస్తకాల ద్వారా లభించాలి.** భావ విప్లవం, నైతిక అభ్యున్నతి, యుగనిర్మాణ సంకల్పాలు ఈ పాఠ్య పుస్తకాలలో ఉండాలి. ఉపాధ్యాయులు ఆ పాఠాలు బోధించేటప్పుడు ఆయా విషయాలపై చర్చలు జరపాలి. సమాచారశాస్త్రం, పౌరశాస్త్రం, ఆరోగ్యం, మతం-సదాచారం, రాజనీతి మున్నగు విషయాలలో స్థూలమైన పరిజ్ఞానం అందించాలి. అందువల్ల నేటి పరిస్థితుల గురించి, ఆధునిక యుగం గురించి, మానవజాతి ఎదుర్కొంటున్న సమస్యల గురించి తెలుసుకోగలుగుతారు.

**క్రొత్త పాఠశాలల స్థాపన :** క్రొత్త పాఠశాలలు అవసరమైన స్థలాలలో వాటి స్థాపనకు ప్రయత్నం జరగాలి. ప్రజల సహకారంతో క్రొత్త పాఠశాలలను స్థాపించి, ఆ తర్వాత వాటిని ప్రభుత్వానికి అప్పగించడం మంచి పద్ధతి. పాఠశాలల కోసం ఖాళీ స్థలాన్ని కాని, గృహాన్ని కాని ఉచితంగా ఇచ్చే దాతలు ఉంటారు. ఫీజు వసూలు చేసి అధ్యాపకులకు వేతనాలు ఇవ్వ వచ్చు. ధనవంతులు ఈ కృషికి సహకరించేలా తగు ప్రయత్నాలు చేయవలసి ఉంటుంది.

**రాత్రి పాఠశాలల నిర్వహణ :** కొద్దిగా చదువుకుని పనులు చేసుకుంటూ తమ విద్యార్హతలను పెంచుకోవాలని కోరేవారి కోసం రాత్రి పాఠశాలలు నిర్వహించాలి. రాత్రిపూట సుమారు రెండు గంటల పాటు చదువుకుని వీరు జీవితంలో ఉన్నతిని సాధించ గలుగుతారు. ప్రైవేటుగా చదువుకుని పరీక్షలు వ్రాసే సౌకర్యం పెక్కు ప్రభుత్వ సంస్థలలోను, ప్రభుత్వేతర సంస్థలలోను ఉంటుంది.

ఎప్పుడు కింద పడకపోవడం కాదు. పడిన ప్రతిసారీ తిరిగి లేవడమే గొప్ప.

ఎక్కడ ఎలాంటి సౌకర్యం ఉంటే ఆ ప్రకారం ఈ పాఠశాలలను నడపాలి. ఈ పాఠశాల నిర్వహణకయ్యే ధనాన్ని విద్యార్థుల నుండి ఫీజు వసూలు చేయడం ద్వారా సమకూర్చు కోవచ్చు.

**విద్యావంతులు జ్ఞాన ఋణాన్ని తీర్చుకోవాలి :** ఐదుగురికి చదువు చెప్పి తమ జ్ఞాన ఋణాన్ని తీర్చుకుంటామని విద్యావంతులు ప్రతిజ్ఞ చేయాలి. ధనవంతులు ధనాన్ని దానంచేసి పుణ్యం సంపాదిస్తారు. అలాగే విద్యావంతులు విద్యాదానం చేసి పుణ్యం సంపాదించే సంప్రదాయాన్ని ప్రారంభించాలి.

తీర్థయాత్రలు చేసి తిరిగి వచ్చిన తర్వాత దానం చేయడం, విందు భోజనాలు ఏర్పాటు చేయడం ఒక సాంప్రదాయం. అలా చేస్తేనే కాని తీర్థయాత్ర సఫలం కాదన్న నమ్మకం ప్రజలలో ఉంది. అలాగే జ్ఞాన ఋణాన్ని తీర్చుకోనిదే విద్య సఫలము, సార్థకము కాదన్న నమ్మకాన్ని ప్రజలలో కలిగించాలి. ప్రభుత్వానికి పన్నులు కట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత. చేసిన అప్పులు తీర్చడం కూడా బాధ్యతే. అలాగే విద్యావంతులు కనీసం ఐదుగురికి చదువు చెప్పడం కూడా బాధ్యతే. ఇందుకు సమయదానం చేయవచ్చు. అది వీలుకాకపోతే ధనసహాయం చేసి అధ్యాపకులకు వేతనాలు సమకూర్చవచ్చు.

**గ్రంథాలయం, పఠనాలయం :** గ్రంథాలయాలను, పఠనాలయాలను స్థాపించాలి. జీవితానికి కొత్త దిశను ఇచ్చే గ్రంథాలను, పత్రికలను మాత్రమే వాటిలో ఉంచాలి. అశ్లీల సాహిత్యాన్ని, కాలక్షేప సాహిత్యాన్ని ఎట్టి పరిస్థితిలోను వాటిలో ఉంచకూడదు. **భోజనంలో విషపదార్థాలు ఎలాంటివో గ్రంథాలయాలలో చెత్త సాహిత్యం అలాంటిది.** చదువుకునే వారి నుంచి కొద్ది రుసుము వసూలు చేసి కాని, చందాలు వసూలు చేసి కాని గ్రంథాలయాలను నిర్వహించాలి. మంచి పుస్తకాలను, పత్రికలను వ్యక్తుల నుండి సేకరించి గ్రంథాలయాలలో ఉండవచ్చు.

**చదివే అభిరుచిని కలిగించాలి :** చదివే అభిరుచిని కలిగించడం యుగ నిర్మాణం దృష్టిలో అత్యవసరం. సాధారణంగా విద్యాలయాలలో చదువు పూర్తి కాగానే జనం పుస్తకాలకు నమస్కారం పెట్టేస్తారు. తమ వృత్తి ఉద్యోగాలలో మునిగిపోతారు. పుస్తకాలు ఇంకా చదవడం ఎందుకని అని అనుకుంటుంటారు. ఈ అభిప్రాయాన్ని ప్రజల మనస్సుల నుండి తొలగించాలి. **కడుపుకు భోజనం ఎంత అవసరమో బుద్ధికి జ్ఞానాన్ని పెంచే సాహిత్యం అంత అవసరమనే సత్యాన్ని జనమానసంలో బలంగా నాటాలి.**

**ఇంటింటికి వెళ్లి ప్రజలలో చదివే అభిరుచిని కలిగించాలి. వారికి మంచి పుస్తకాలను అందించాలి.** ఇదొక పెద్దపని. సంచార గ్రంథాలయాలను నిర్వహించాలి. జ్ఞాన ప్రచారకులు తమ సంచీలలో కొన్ని పుస్తకాలలో తీసుకుని బయలుదేరాలి. ఇంటింటికి వెళ్లి గ్రంథపఠనం పట్ల అభిరుచిని పెంచాలి, చదవడానికి కొన్ని పుస్తకాలు ఇవ్వాలి. రెండో రోజూ వెళ్ళి ఆ పుస్తకం తీసుకుని వేరే పుస్తకం ఇవ్వాలి. ఇంటింటికి వెళ్లి ఉచితంగా టీ ఇచ్చి గతంలో టీని ప్రచారం చేశారు. ఇప్పుడు ప్రజలకు టీ త్రాగడం బాగా అలవాటయిపోయింది. అదేవిధంగా ప్రజలలో మంచి సాహిత్యాన్ని చదివే అభిరుచిని కలిగించాలి. స్వాధ్యాయాన్ని దినచర్యలో అంతర్భాగం చేసుకునేలా ప్రజల మనసులను మలచాలి. యుగనిర్మాణ యోజన సాఫల్యం ఈ అభిరుచిని పెంచడంపై చాలావరకు ఆధారపడి ఉంది.

విద్యా ప్రసారం అవసరం. మానసిక వికాసానికి ఇది తప్పనిసరి. విద్యా విస్తరణ జరగనిదే దేశం ముందడుగు వేయలేదు. భావ విప్లవ లక్ష్యం పూర్తి కావడం అనేది ప్రజాశిక్షణపై ఆధారపడి ఉంది. కనుక ఇందుకోసం ప్రాణాలు ఒడ్డి కృషి చేయాలి.

★★★

## శ్రీ గాయత్రీ శతకం

**65.** *అలవికాని కౌటుంబిక కలహములను*
*నీచమైనట్టి పలుదురాలోచనలను*
*శాశ్వతమ్ముగ తొలగించి శాంతినిచ్చు*
*విశ్వ జనయిత్రి గాయత్రి వేదమాత*


*తా:- పరిష్కారం కానటువంటి కుటుంబ కలహాలను, నీచాతి నీచమైన అనేక చెడు ఆలోచనలను శాశ్వతముగా పోగొట్టి పరమ ప్రశాంతతను చేకూరుస్తుంది గాయత్రీ మాత తనను నమ్మి నిత్యం జపిస్తే.*

**66.** *ఎవరు ఆ యమ్మ ననునిత్య మెదను దాల్చి*
*అమిత భక్తితో నార్తితో నడుగగలరొ*
*వారి కొసగు సత్ సంతాన భాగ్యఫలము*
*విశ్వ జనయిత్రి గాయత్రి వేదమాత*

*తా:- ఏ సాధకుడైతే సంతానం కోరి ఆ మహాతల్లిని, ఆ వేదమాతను, ఆ ఆదిమాతను హృదయంలో నిలుపుకొని ప్రతినిత్యం అత్యంత భక్తితో ఆవేదనతో అడుగుతాడో అతనికి చక్కని సంతాన భాగ్యాన్ని కలిగిస్తుంది నోము ఫలముగా.*

*రచన : సహజ కవి, సాహిత్య రత్న,*
*శతక చతురానన, పద్య కవితాసుధానిధి*
*శ్రీ అయినాల మల్లేశ్వర రావు*

మంచివాళ్ళతో స్నేహం చెయ్యి. నిన్ను వాళ్ళలోనే లెక్కిస్తారు.



తత్వజ్ఞానం-4

# కొన్ని రకాలైన భౌతిక కర్మలు

**గత సంచిక తరువాయి...**

ఇంకొక రకం భౌతిక కర్మను ఆర్గనిస్మిక్ (organismic) కర్మ అంటారు ఎడ్గర్ కేసీ. ఈ రకం కర్మలో ఒక జన్మలో ఏదైనా ఒక అవయవాన్ని దుర్వినియోగం చేస్తే మరుజన్మలో ఆ అవయవం ద్వారానే దుర్వినియోగ ఫలితాన్ని పొందుతాడు. ఉదాహరణకు ఒక 35 సంవత్సరాల వయస్సు గల వ్యక్తికి చిన్నప్పటి నుండి జీర్ణశక్తి తక్కువ. అనేక రకాల పదార్థాలను జీర్ణం చేసుకోలేడు. కొన్ని రకాల పదార్థాలను కలిపి తింటే జీర్ణం అవుతాయి. జీర్ణ ప్రక్రియకు అనేక గంటల సమయం పట్టేది. ఎడ్గర్ కేసీ ఇతని బాధకు కారణం ఇలా చెప్పాడు. ఈ వ్యక్తి ఫ్రెంచి చక్రవర్తి లూయి XIII కోర్టులో ఆయన అంగరక్షకుడిగా, దుస్తుల విషయంలో సలహాదారుగా ఉండేవాడు. తన బాధ్యతలు సక్రమంగానే నిర్వహించేవాడు. కాని ఇతనికి తిండి మీద యావ. పరమ తిండిబోతుగా ఉండేవాడు. తర్వాత జన్మలో పర్షియా దేశపు రాజుగారికి వైద్యుడుగా ఉండేవాడు. అప్పుడు అదే యావ. రాజ భవనాలలో లభించే భోజనాలు తెగ తినేవాడు. ఈ రెండు జన్మలలో తిండి విషయంలో అతిగా పోయాడు. దానిని సవరించుకోవడానికి తిండి తగ్గించుకోవలసిన పరిస్థితి ఏర్పడి ఈ జన్మలో అజీర్ణవ్యాధిని సంతరించుకున్నాడు.

ఇంకొక రకం భౌతిక కర్మకు సింబాలిక్ కర్మ (symbolic karma) అనే పేరు పెట్టారు. భౌతిక కర్మలలో ఇది ఆసక్తికరమైనది, విస్మయకరమైనది. ఒక వ్యక్తి చిన్నతనం నుండే ఎనీమియా (రక్తహీనత) తో బాధపడుతుండేవాడు. అతని తండ్రి ఒక డాక్టరు. ఎన్నో రకాల వైద్యాలు చేయించిన ఫలితం కనిపించలేదు. ఇతని గురించి ఎడ్గర్‌కేసీ ఇలా చెప్పాడు – "ఈ వ్యక్తి ఐదు జన్మల క్రితం పెరూ దేశంలో ఎంతో రక్తాన్ని చిందించి అధికారాన్ని హస్తగతం చేసుకున్నాడు. ఆ కారణంగా ఈ జన్మలో రక్తహీనతతో బాధపడుతున్నాడు. ఇది జీవితాంతం అనుభవించే వ్యాధి. జీవితంలో ఒక గుణపాఠం నేర్చుకునే అవకాశం, అవసరం ఈవిధంగా లభించింది."

ఇంకా కొన్ని ఉదాహరణలు. విపరీతమైన ఉబ్బసంతో బాధపడుతున్న వ్యక్తికి ఇలా చెప్పాడు. – నీవు ఇతరులకు ఊపిరి ఆడకుండా చేసి చంపావు. అందుకే నీకు ఇలా దాదాపు ఊపిరి ఆడక చచ్చిపోయేంత పరిస్థితి (ఉబ్బసం) వచ్చింది అని.

ఒక చెవిటి వానికి ఇలా చెప్పాడు. సహాయం కోరేవారి మాటలను పెడచెవినబెడితే ఇలాగే జరుగుతుంది. ఇతరుల ఆర్తనాదాలను వినిపించుకోకపోతే, అప్పుడు చెవులు ఉపయోగించుకోలేదు కాబట్టి ఇప్పుడు చెవులు పనిచేయడం లేదు.

ఇంకొక కేసు – 11 సంవత్సరముల బాలుడు – రెండో సంవత్సరం నుంచి ప్రక్క తడిపే అలవాటు (bed wetting) ప్రతి రోజు ప్రక్క తడుపుతూనే ఉంటాడు. అనేక మంది వైద్యుల వద్ద, తెలిసిన ప్రతి స్పెషలిస్టు వద్ద, మానసికవైద్యులవద్ద (Psychiatrist) వైద్యం చేయించారు. ఏమి ఉపయోగం లేకపోయింది. కుర్రవాడికి 11వ సంవత్సరం జరుగుతున్నప్పుడు అతని తండ్రి కేసీ గురించి విన్నాడు. కేసీ దగ్గరకు కుర్రవాడిని తీసుకువెళ్ళాడు. కుర్రవాడి గురించి కేసీ ఇలా చెప్పాడు – "ఈ జన్మకి ముందు జన్మలో ఈ పిల్లవాడు ఒక చర్చిలో మినిష్టరుగా ఉండేవాడు. ఆ రోజులలో విచ్‌క్రాఫ్టు (చేతబడుల వంటివి) జరుగుతుండేవి. అనుమానంతో ఆ మంత్రగత్తెలను ఒక స్టూలుకు కట్టేసి ఒక చెరువులో ముంచుతుండేవాడు. ముంచడం, తీయడం ఈ విధంగా వారిని శిక్షించేవాడు. అందువల్ల ఈ జన్మలో ఇతనికి ఈ వ్యాధి సంతరించింది.

ప్రక్క తడవడానికి కారణం చెప్తూ ఏమి చేస్తే ఈ సమస్య పరిష్కారం అవుతుందో కూడా కేసి సూచించాడు. ప్రతి రోజు రాత్రి ఆ కుర్రవాడు నిద్రపోయే ముందు ఒక విధంగా సజెషన్ (suggestion) ఇవ్వాలని చెప్పాడు. అతని తల్లి రాత్రి అతను పడుకునే ముందు ప్రక్కనే కూర్చునేది. అతను నిద్రలోకి ఒరిగిపోతుండగా ఈ విధంగా అనేది. "నీవు మంచివాడివి, దయగలవాడివి. నీవు ఇతరులను సంతోషపెట్టబోతున్నావు. నీతో పరిచయం ఉన్న అందరికి సహాయం చేయబోతున్నావు" ఇలా పది నిమిషాలు ఇవే పదాలను తిరిగి తిరిగి చెప్పేది. ఆ రాత్రి దాదాపు తొమ్మిది సంవత్సరాలలో మొదటిసారి అతను ప్రక్క తడపలేదు. చాలా నెలలు ఆమె ఈ విధంగా చెప్తూ ఉండేది. ఒక్కరోజు కూడా ఆ సమస్య మరల రాలేదు. తరువాత వారమునకు ఒక్కసారి చెప్పేది. తరువాత పూర్తిగా మానివేసింది. ఈ విధంగా ఆ పిల్లవాడి ప్రక్క తడపడం అనే వ్యాధి పూర్తిగా నయమయింది.

– ఎడ్గర్‌కేసీ – "మెని మాన్షన్స్" పుస్తకం నుండి

**ఇతరుల కంటే మెరుగ్గా ఉండాలనుకోవడం కాదు, ఎప్పుడు నీ కంటే నువ్వు మెరుగ్గా ఉండటానికి ప్రయత్నించు.**

# సంతోషం

సంతోషంగా ఉండాలని అందరికి ఉంటుంది. కాని ఎందుకు ఉండలేకపోతున్నారు? సుఖంగా సంతోషంగా ఉండాలని అనేక సుఖసాధనాలు టివి, ఫ్రిజ్, ఎ.సి., నగలు ఇంకా ఎన్నో వస్తువులు సమకూర్చుకుంటుంటారు. కాని ఆ సంతోషం క్షణం మాత్రమే. అనేకమంది జీవితాలలో అన్నీ ఉంటాయి సంతోషం తప్ప? కొంతమంది ఎప్పుడు సంతోషంగా నవ్వుతూ కనిపిస్తారు. సంతోషం అనేది కొద్దిమంది స్వంతమా? ఎందుకు ఇలా జరుగుతున్నది?

జీవితంలో బాధలు కష్టాలను ఎదుర్కొంటున్నప్పుడు జీవితంలో సంతోషం లేదనిపిస్తుంది. కాని తరచి చూచుకుంటే నిజమైన సంతోషం మన అంతరంగంలోనే ఉన్నదని తెలుస్తుంది. ఈ సంతోషం బాహ్య పరిస్థితులపై ఆధారపడదు. అది మన లోలోపల పుష్కలంగా ఉన్నది. ఇది అందరికి అందుబాటులోనే ఉన్నది. కాని కోపం, ద్వేషం, అసూయ, భయం మొదలైన నకారాత్మక (negative) కారణాల వల్ల సంతోషాన్ని కోల్పోతున్నాము. మనిషిగా పుట్టినందుకు అనేక రకాల పరిస్థితులను ఎదుర్కోవలసి వస్తుంది.



ద్వందములతో కూడిన ఈ ప్రపంచంలో నకారాత్మకమైన (negative) ద్వేషం, కోపం, దౌర్జన్యం, అసూయతో పాటు సకారాత్మకమైన (positive) ప్రేమ, జాలి, దయ, కరుణ, ఉదారత కూడా ఉన్నాయి. మనం నకారాత్మకమైనవి ఎన్నుకుంటామా లేక సకారాత్మకమైనవి ఎన్నుకుంటామా అనే దానిమీద మన సంతోషం ఆధారపడి ఉంటుంది.

**సంతోషం కావాలంటే దౌర్జన్యాన్ని వదలి శాంతిని చేపట్టాలి, ద్వేషాన్ని వదలి ప్రేమను, దయను పట్టుకోవాలి, భయాన్ని వదలి విశ్వాసాన్ని పెంపొందించుకోవాలి.** అనేక గందరగోళాల మధ్య నిశ్చలమైన మనస్సును పెంపొందించుకోవాలి. సముద్రంపై ఎన్ని ఆటుపోట్లు ఉన్నా సముద్ర లోతులలో ప్రశాంతంగానే ఉంటుంది. మనం కూడా అలా ఉండగలగాలి. ఇది ప్రతి ఒక్కరు సాధించ వచ్చు. ప్రయత్నంతో అన్ని సాధించగలుగుతారు. మనుష్యులు బాధలలో ఉన్నప్పుడు పరిస్థితులను, ఇతరులను, ప్రభుత్వాన్ని, కర్మను, గ్రహాలను నిందిస్తుంటారు. భగవంతుడా! నాకే ఇన్ని కష్టాలు ఎందుకిచ్చావు అని ఆక్రోశిస్తుంటారు. "నా కర్మ ఎలా రాసిపెట్టిందో అలాగే జరుగుతున్నదని" అని ఇక తను చేయగలిగేది ఏమి లేదని వగరుస్తుంటారు. కాని మనిషి తన శక్తి సామర్థ్యాలను గుర్తించి ఉపయోగించుకుంటే ఎటువంటి పరిస్థితులనయినా అనుకూలంగా మార్చుకోవచ్చు.

మనం ఉన్న సమాజంలో సంతృప్తి లేకపోవడం, సంతులన లేకపోవడం సర్వసామాన్యమైన విషయం. ప్రతి ఒక్కరు జీవితంలో ఎదగాలని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అనుకుంటారు. చదువులలో, ఆటలలో ఉత్తమ శ్రేణి రావాలని, వాక్ చాతుర్యం సంపాయించుకోవాలని, సమాజంలో పెద్దవారితో సంబంధాలు పెట్టుకోవాలని, ఉద్యోగ వ్యాపారాలలో సుఖంగా జీవించడానికి తగిన ధనం సంపాయించాలని కోరుతుంటారు. ఆర్థిక స్వతంత్రత కొరకు అనేక పనులు చేస్తుంటాము, కాని మానసికంగా, భావనాత్మకంగా స్వతంత్ర ఎలా సాధించుకోవాలనేది నేర్చుకోవడం లేదు.

"మన సంతోషం బాహ్యమైన పరిస్థితులపై ఆధారపడి ఉన్నది" అని అనుకుంటుంటారు ఇది తప్పు. పెద్ద బ్యాంక్ బ్యాలెన్స్‌మీద, బంగారంమీద, నగలమీద, విలువైన వస్తువులమీద మానసికంగా, భావనాత్మకంగా సంతోషం కొరకు ఆధారపడుతుంటాము. ఏదైనా కారణం వల్ల అవిపోతే మనలో చాతకానితనం, భయం, తొట్రుపాటు కలుగుతాయి. సంతోషం మాయమైపోతుంది.

ఈ రోజు సంతోషాన్ని ఇచ్చినది రేపు బాధించవచ్చు. ఈ రోజు సంతోషం కలిగించిన వ్యక్తి రేపు బాధ కలిగించవచ్చు. ఇతరులు మనం కోరుకున్నట్లుగా ఉంటే మనకు సుఖంగా, సంతోషంగా ఉంటుంది. కాని ఇతరులు అలా చేయకపోతే కోపం, విసుగు, చిరాకుకు లోనవుతాము. పరిస్థితులు మనం అనుకున్నట్లు జరుగకపోతే దుఃఖం, బాధ అనే బరువులు మననెత్తికెక్కుతాయి. అందువల్ల మనస్సులో 24 గంటలు నెత్తిమీద 100 కిలోల బరువు పెట్టుకున్నట్టే ఉంటుంది. మరి వారికి కాళ్ళ నెప్పులు రాక ఏమవుతుంది?

జీవితంలో నచ్చనిది జరిగినపుడు ఎవరిని నిందించాలా, ఎవరి మీద ఈ తప్పును రుద్దాలా, ఎవరిని ఈ సంఘటనకు బాధ్యులను చెయ్యాలా అని చూస్తుంటాము. తల్లితండ్రులు, భార్య/భర్త, స్నేహితులు, ప్రక్కింటివాళ్ళు, గవర్నమెంటు, పుట్టిన పరిస్థితులు – వీరిలో ఒకరో, ఇద్దరో అందరో మన బాధలకు

**ఈ రోజు చెయ్యాల్సిన పనిని రేపటికి వాయిదా వేసేవారు నిన్న కూడా అదే పని చేసి ఉంటారు.**

కారణమంటుంటాము. **కాని మనం చేసిన తప్పులు మాత్రం మనకు కనిపించవు.**

కొంతమంది మనం బాధపడుతుంటే, ఇతరులు ఎందుకు సుఖంగా ఉండాలని వారిని బాధపెడుతుంటారు. కోపం, ద్వేషం పెంచుకుని ఇతరులకు ఇవ్వవలసినవి ఇవ్వకుండా ఏడిపిస్తుంటారు. ఈ రకంగా పరిస్థితులను సరిచేసుకునేందుకు ఉపయోగించవలసిన శక్తిని దురుపయోగం చేస్తుంటారు. అంతేనా? మనం ఎవరిని నిందిస్తున్నామో, ఎవరిని బాధ పెడ్తున్నామో వారిని దూరం చేసుకుంటున్నాము. ఆఫీసులో సహ ఉద్యోగికి (కొలీగ్) ప్రమోషన్ వస్తే మన సంతోషం మాయం, స్నేహితుడు ఇల్లు కట్టుకున్నాడు. ఇక మనకు బాధే బాధ. వాళ్ళమ్మాయికి పెళ్ళి అయింది మా అమ్మాయికి ఇంకా పెళ్ళికాలేదు బాధే బాధ. ఆ అమ్మాయికి కూడా పెళ్ళి కాకపోతే మనకు ఏ బాధ లేదు. మన మనస్సును, భావాలను కంట్రోలులో ఉంచుకోవాలి. **ఇతరులు సంతోషంగా ఉన్నప్పుడు ఆ సంతోషాన్ని పంచుకోవాలి. శాంతి, సుఖ సంతోషాలు కావాలంటే ఇలా చేసుకోవడం తప్పనిసరి.**

జీవితంలో ఎగుడు దిగుడులు వస్తుంటాయి. ఎప్పుడు ఒకే రకంగా ఉంటుందని చెప్పలేము. అనుకున్న పనులు జరగకపోతే క్రుంగిపోయి, పనులు సవ్యంగా జరుగుతుంటే "నా అంతవాడు లేడు" అని మిడిసిపడుతుంటే ఎలా? మన మనస్సు ఎప్పుడు సంతులనంగా (Balanced) ఉండాలి. అలా పొంగిపోకూడదు, ఇలా క్రుంగిపోకూడదు. జీవితంలో మార్పులు వస్తుంటాయి. కాలంతోపాటు అనేకం మారుతుంటాయి. మార్పుకు ఒప్పుకోను అంటే కుదరదు. **కాలానికి ఎదురీదితే, ప్రకృతి నియమాలకు, విరుద్ధంగా నడిస్తే సంతోషం ఎలా లభిస్తుంది?**

ప్రకృతిలో ప్రతి ఒక్కరు భాగమే. మనలోని ప్రకృతి, బాహ్య ప్రకృతి నిరంతరం మారుతూనే ఉంటుంది. ప్రకృతి నియమాలు మన అదుపులో లేవు. ఋతువులు మారుతుంటాయి. మనుష్యులు మారుతుంటారు. ఆలోచించే విధానం మారుతుంటుంది. భావములు మారుతుంటాయి. ప్రపంచంలో మారకుండా ఉన్నది ఏమి లేదు. ఈ మార్పులతోపాటు మనం మారకపోతే కష్టాలు బాధలు తప్పవు. మారుతున్న పరిస్థితులలో మనం మారితే సంతోషదాయకమవుతుంది.

మార్పు అనేది ప్రకృతిలో సహజం. ప్రకృతిలో ఇలా ఎందుకు జరుగుతున్నదో తెలియకపోవచ్చు. మనం అనుకున్నది ఎందుకు జరుగలేదో, అనుకోనిది ఎందుకు జరిగిందో తరువాత తెలియవచ్చు, తెలియకపోవచ్చు. కాని జాగ్రత్తగా ఆలోచిస్తే ఇవి అన్ని ఒక పెద్ద దైవీ ప్రణాళికలో ఒదిగి ఉంటాయని తెలుస్తుంది.

ఏదైనా పోగొట్టుకుంటే అది అవాంఛనీయమైనదిగా భావిస్తాము. ఒకటిపోతే ఇంకోకటి లభిస్తూనే ఉంటుంది. రాత్రి పోతే పగలు వస్తుంది. సూర్యుడు అస్తమిస్తే చంద్రుడు వస్తాడు. విశ్రాంతి, నిద్రతో కొత్త శక్తి, ఉత్సాహం పుంజుకుంటాయి. ఒక తలుపు మూసుకుని ఉంటే ఇంకొక తలుపు తెరచుకునే ఉంటుంది.

మనం మూసిన తలుపులనే చూస్తున్నామా లేక ప్రక్కనే వేరే మార్గాలు ఉన్నాయా అని వెదకుతున్నామా? అటు ఇటూ చూస్తే కొత్త అవకాశాలు కనుపిస్తాయి.

అనుభవాలు మంచివి కాదు, చెడువి కాదు. అవి మంచివా, చెడువా అని మనం నిర్ణయిస్తాం. ఉదాహరణకు మంచి వర్షం పడుతున్నది. అది వ్యవసాయదారునికి మంచి, స్కూలు పిల్లలకు ఒక సెలవు రోజు ఆనందంగా గడపడానికి దొరకవచ్చు, రోడ్డు ప్రక్కన పడుకున్న వ్యక్తికి నిద్రలేని రాత్రి కావచ్చు. టీ దుకాణాలకు వ్యాపారం పెరగవచ్చు. కూల్ డ్రింక్స్ వాడికి అమ్మకాలు తగ్గవచ్చు. జరిగిన సంఘటన ఒక్కటే అయినా వారి వారి భావాలు, ప్రతి స్పందనలు వేరుగా ఉంటాయి.

**ప్రపంచంలో అనంతమైన అందం, ప్రేమ, ఆనందాలు ఉన్నాయి. సూర్యోదయంలోని సూర్యకిరణాలను చూడండి. ఎంత అందంగా ఉంటాయో! ఉదయం పక్షుల కిలకిలరావాలు వినండి ఎంత బాగుంటుందో! (పట్టణాలలో ఇవి అనుమానమే) ఉదయం పచ్చని గడ్డిమీద మెరుస్తున్న మంచు బిందువులను చూడండి. వెన్నెల రాత్రి ఆ చందమామ ఇచ్చే అమృతాన్ని ఆస్వాదించండి.**

**చల్లగా మెల్లగా వీస్తున్న ఆ పిల్ల తెమ్మెర్ల ఇచ్చే ఆనందాన్ని అనుభవించండి. పసిపాప చిరునవ్వు చూడండి. ఘుమఘుమ లాడుతున్న ఆహారాన్ని ఆస్వాదించండి. మీ హృదయంలో ఈ విధమైన ఆనందాలను నింపుకోండి. ఇలా చేయడంవల్ల నకారాత్మకమైన భావములు (negative emotions) వాటంతట అవే పోతాయి.**

నాకు ప్రామోషన్ వస్తే సంతోషంగా ఉంటాను. నేను ఇల్లు కట్టుకుంటే సంతోషంగా ఉంటాను. నాకు పట్టుచీర ఇస్తే సంతోషంగా ఉంటాను. మా అమ్మాయి పెళ్ళయితే సంతోషంగా ఉంటాను. మా మనువడికి మెడిసిన్‌లో సీటు వస్తే సంతోషంగా ఉంటాను ఇలా అనుకోవడం వల్ల ఉపయోగం లేదు. **సంతోషంగా ఉంటే మీ పనులన్నీ వాటంతట అవే సవ్యంగా అవుతాయని రోండా బిర్నే (Rhonda Byrne) "The Power" అనే పుస్తకంలో వ్రాశారు.**

సంతోషాన్ని కోరుకోండి. సంతోషంగా ఉండటానికి ప్రయత్నించండి. సంతోషం మీ స్వంతమవుతుంది. **"సంతోషం సగం బలం" అని ఊరికే అన్నారా మన పెద్దలు?**

★★★

**తన పొరపాట్ల నుంచే కాదు, ఇతరుల వైఫల్యాల నుంచి కూడా పాఠాలు నేర్చుకోవడం వివేకవంతుల లక్షణం.**

వసంత పంచమి ప్రత్యేకం

# ఆయన పృథ్వీ యొక్క భాగ్యాన్ని, భవిష్యత్తుని మార్చడానికి వచ్చారు

ముందు రోజు వర్షం పడడం వల్ల చలి కాస్త ఎక్కువనిపిస్తోంది. నిజానికి వాతావరణం చాలా పొడిగా ఉంది, ఆకాశంలో మబ్బులే లేవు. ప్రాతఃకాల అరుణ కిరణాలు గగనతలాన్ని నింపి వేశాయి. మనోహరమైన ఉదయం. క్రితం రోజు పడ్డ వాన వల్ల పరిసరాలన్నీ శుభ్రపడినట్టుగా అనిపిస్తోంది. చలికాలంలో అడుగు పెడుతూనే వసంతం గుబాళిస్తోంది. సుమనోహర వసంత సుగంధాలు అంతరాళాల్లో కొత్త అనుభూతులను రేకెత్తిస్తున్నాయి. అనురాగ వైరాగ్యాలు సమానంగా కలగలిసే అద్భుత సమయమిది. సాంసారిక కోరికల్లో, వాసనల్లో చిక్కుకున్న వారికి వసంతం మత్తుగొలిపే అనురాగాన్ని కలుగజేస్తుంది. పూల బాణాలతో మన్మథుడు వారి మనస్సులను మథించి అనురాగ కల్పనలను, కోరికలను చిత్రీకరిస్తాడు. ఆధ్యాత్మిక వాదులకు వసంతం మనస్సులో త్యాగాన్ని, వైరాగ్యాన్ని, బలిదానాన్ని నింపుతుంది.

రతీ మన్మథుల సంయోగ శృంగారాలతో అలంకరించుకున్న వసంతకాలాన్ని కవులు అత్యద్భుతమైన కల్పనలతో వర్ణించారు. నిరంతరం అమోఘ మహాతపస్సు చేసే సదాశివుని వైరాగ్య గీతం కూడా ఈ వసంతంలోనే హిమాలయాల్లో ప్రతిధ్వనిస్తుంది. హిమాలయ ఋషుల సుగంధం కూడా ఈ సమయంలోనే గుబాళిస్తుంది. చాలా కొద్ది మందికి మాత్రమే ఈ సత్యం తెలుసు. సంపూర్ణ ఋషిసత్తాకు ప్రాతినిధ్యం వహిస్తూ ఆ పార్వతీ పరమేశ్వరులు శాంతికుంజ్‌లో ఉంటున్న రోజులవి. గురువుగారు, మాతాజీల సశరీర దర్శనం ఈ అనుభూతినే కలిగిస్తుంది. వారి నివాసం వల్ల శాంతికుంజ్ కైలాసంగా మారింది. వారి సాన్నిధ్యంలో నివసించి, వారితో సహచర్యం చేసిన వారు ప్రమథ గణాలుగా అనుభూతి చెందడం సబబేగా. వారితో సన్నిహితంగా ఉన్న ఆధ్యాత్మిక సాధకులందరు నిర్భయంగా ఉండేవారు. ఒక్క చూపుతో మన్మథుడ్ని భస్మం చేసిన మహాశివుడి పక్కనున్న వారిని రతీ మన్మథులేం చేయగలరు!

శాంతికుంజ్‌లోని వసంతం ఎప్పుడూ ఉదయిస్తున్న సూర్యుడిలా నిత్యప్రకాశమానంగా, పవిత్ర ప్రేరణలకు కేంద్రముగా ఉంటుంది. ఈ రోజు సూర్యుడు కూడా అలాగే దర్శనమిస్తున్నాడు. సాధకుల మనస్సుల్లో, చైతన్యంలో గాయత్రీ మాత తేజస్సు వర్షిస్తోంది. అపూర్వమైన ఉల్లాసంతో మనస్సు ఉప్పొంగుతోంది. ఒకవైపు వసంతం పరుగులుపెడుతూ వస్తూంటే, మరో వైపు గురువుగారిని దర్శించుకునే ఘడియ దగ్గరపడుతోంది. ప్రాతః సూర్యుడి తేజస్సు తీవ్రతరమైంది, మధ్యాహ్న సూర్యుడి వెలుగు భూమి మీద ముఖమలు తివాచీలా పరుచుకుంది. అప్పట్లో గురువుగారు ఈ మధ్యాహ్న వేళల్లోనే సాహిత్య రచనా కళకు శిక్షణనిచ్చేవారు. కాబట్టి చాలా కొద్దిమంది మాత్రమే వారిని కలుసుకోగలిగేవారు. ఎవరు ఎప్పుడు, ఏ రోజు కలుసుకోవాలి అనేది ముందే నిర్ణయించబడేది.

గురువుగారి దగ్గరకు వెళ్ళంగానే, "వచ్చారా నాయనా! రండి, కూర్చోండి." అనే వారు. గురువుగారి గది ఇప్పటిలాగే అప్పుడూ ఉండేది. కాకపోతే మాతాజీ పరుపు మాత్రం రాత్రికే పరిచేవారు, పగలంతా చాప పరిచి ఉండేది. గురువుగారిని కలవడానికి వచ్చిన వారు అక్కడ కూర్చునేవారు.

ఆ రోజు కూడా సమస్యలతో వచ్చిన వారు గురువుగారిని కలిసి సమాధానాలు తీసుకుందామని వేచి ఉన్నారు. చాలామంది మధ్య మధ్యలో వచ్చి వారి కష్టాలను గురువుగారి దగ్గర చెప్పుకునే వారు. వారిలో ప్రతి ఒక్కరికి గురువుగారు తమ తపస్సులోని కొంత భాగాన్నిచ్చి కృతార్థులను చేసేవారు. ఎంతో మంది భక్తుల తపస్సుకు మెచ్చి వారడిగిన వరాలకు సదాశివుడు 'తథాస్తు' అని దీవించిన సందర్భాలెన్నో పురాణాల్లో చదువుతాం. అలాంటి దృశ్యాలు ప్రత్యక్షంగా గురువుగారి దగ్గర చూడవచ్చు.

ఆ వేళ భోలేనాథుడైన శివునికి కూడా కోపం తెప్పించిన ఒక వ్యక్తి వచ్చాడు. సుమారు నలభై ఏళ్ళ వయసు గల ఈ మనిషి అత్యాసతో, కళ్ళల్లో కపటాన్ని దాచుకుని గురువుగారి దగ్గరకొచ్చాడు. అతని మాటల్లో అహంకారం ఉట్టిపడుతోంది. వస్తూనే తన ఐశ్వర్యం గురించి, సంపదల గురించి గొప్పలు చెప్పడం మొదలెట్టాడు. గురువుగారు తనకు మరింత ఐశ్వర్యం వచ్చేట్టుగా ఆశీర్వదించి, తనను సమాజంలో గొప్పవాడిగా చేస్తే పెద్ద మొత్తంలో శాంతికుంజ్‌కు దానం ఇవ్వగలనని చెప్పుకొస్తున్నాడు. ఆ మాటల్లోనే అతని నీచత్వం బైటపడుతోంది. ఎవరి ముందు నిలబడి ఏం మాట్లాడుతున్నాడో అతనికి అర్థం కావట్లేదు. త్రిలోకాధిపతికి చిల్లర దానం చేస్తాననే దుస్సాహసమా! ఎంతటి మూర్ఖత్వం! అయినా గురువుగారు విసుక్కోలేదు. పక్క నుంచి చూసి మందహాసం చేసి ఊరుకున్నారు.

**తెలివిలేని నిజాయితి, బలహీనం, నిరుపయోగం. నిజాయితీ లేని తెలివి, భయానకం, ప్రమాదకరం.**

అప్పటికి అతనికేమీ అర్థం కాలేదు. ఇక గురువుగారు స్పష్టంగా చెప్పారు, "నాయన! అసలు నువ్వు నా దగ్గర నుండి తీసుకోవడానికొచ్చావా, ఇవ్వడానికొచ్చావా, ఆలోచించుకో!" జవాబులో అతను ఇంకా పొగరుగా, తాను గొప్పవాడిని కావాలని వచ్చానన్నాడు. అప్పుడు గురువుగారు, "నాయన! గొప్ప పనులు చేసే వాళ్ళు గొప్పవాళ్ళవుతారు. దొంగతనం, మోసం, ఎగవేయడం వల్ల ఎవరూ గొప్పవారు కారు. ముందు నువ్వు మారు, నీ స్మగ్లింగ్ వ్యాపారం మానుకుని, మంచిగా బ్రతకడం నేర్చుకుని తరువాత నా దగ్గరకు రా." అన్నారు. అతను అవాక్కయ్యాడు. పొగరెక్కడికి పారిపోయిందో, మొహం ముడుచుకుని చూస్తున్నాడు. అతని నిజస్వరూపం తెలిసిపోయిందని విని భయపడ్డట్టున్నాడు. ఆ మనిషిని తీసుకుని వచ్చినాయన్ని చూసి గురువుగారు, 'ఇతన్ని తీసుకెళ్ళు' అని సైగ చేసారు.

తరువాత మందహాసంతో తన పిల్లలకి (శిష్యులకి) అర్థమయ్యే విధంగా చెప్పడం మొదలు పెట్టారు, "మనుషులు మొత్తం ప్రపంచాన్ని మోసం చేసి, చివరికి నన్ను కూడా మోసం చేయడానికి ప్రయత్నిస్తారు. స్వార్థపరులు, దురాశాపరులు, అహంకారులు వాళ్ళ స్వార్థం, దురాశలు, కోరికలు తీర్చే యంత్రంగా నన్ను చూస్తున్నారు. అసలు ఈ ప్రపంచానికి నేనెందు కొచ్చానో వీళ్ళకి తెలియదు." వారి మాటల్లో తీక్షణత పెరిగింది.

తరువాత కొంత సేపు మౌనం వహించారు. అక్కడున్న వారు కూడా మౌనంగా చూస్తూ ఉన్నారు. తమ దైవం అత్యంత కరుణామయుడు అని తెలిసిన ఒక సాధకుడు మాత్రం, "మీరు పృథ్వి మీద ఎందుకు అవతరించారు" అని అడిగాడు. ముందు కాసేపు ఏమీ మాట్లాడకపోయినా, తరువాత జవాబిచ్చారు. "నాయన! నేను ఈ భూమాత భాగ్యాన్ని, భవిష్యత్తును మార్చడానికి వచ్చాను." వారు మెల్లిగా చెప్పినా, ఆ మాటల్లోని గాంభీర్యం లోకాలన్నిటిలోనూ ప్రతిధ్వనించింది. సర్వేశ్వరుడు స్వయంగా తన లీలాకార్యాన్ని పరిచయం చేస్తున్నాడు. ఆయన స్వయంగా చెప్పకపోతే ఎవరికి మాత్రం ఈ విషయాలు తెలుస్తాయి. ఊపిరి బిగపెట్టుకుని అందరూ వింటున్నారు. ఏ ప్రయోజనానికి గురువు గారు అమోఘమైన మహాతపస్సు చేసారో వారికిప్పుడు అర్థమవుతోంది.

గురువుగారు తమ మాటల రూపంలో మరింత కృపను వర్షిస్తున్నారు. చాలా స్పష్టంగా చెప్పారు, "నేను శరీరం వదిలిన 25 సంవత్సరాలకు నేను చేసిన పని ప్రపంచానికి కనిపిస్తుంది. శాంతికుంజ్ అనే గంగోత్రి నుండి 21వ శతాబ్దమనే గంగ పొంగి పొర్లుతుంది. యుగనిర్మాణ విప్లవం అనే సూర్యుడు నాలుగు గోడల మధ్య పరిమితమవడు. ఆ కిరణాలు ప్రపంచంలోని అన్ని దేశాలనీ, ప్రతి మూలనీ ప్రకాశింపజేస్తాయి. మీరు మీ కర్తవ్యాన్ని చేస్తూ ఉండండి. మిగిలినదంతా ఈశ్వరీయ సత్తా చేసుకుంటూ పోతుంది." వారి మాటలతో వసంతం మరింత సుగంధ భరితమైంది. వారి స్మరణని, వారి యందు సమర్పణని సాధనగా మార్చుకున్న పరిజనుల చేతుల మీదుగా వారే స్వయంగా అద్భుతమైన, ఆశ్చర్యకరమైన పనులు చేయించుకుంటారు.

*– అఖండజ్యోతి, జనవరి 2009*

*అనువాదం : శ్రీమతి జయలక్ష్మి*

## కదిలించే కళ్ళు

63 సీ॥ *మూడవసారిగా ముదముతో పిలువంగ*
*మంచుకొండకు చేరి మహితుగాంచి*
*కర్తవ్యమడుగగా కనికరించుచువారు*
*రుషి పరంపర నింక రుజువు సేయ*
*పూర్వారుషుల కోర్కె పూర్తిగా నెరవేర్చ*
*నడుముకట్టుచు నీవు తడుముకొనక*
*రుషుల కార్యములన్ని రూఢిగా తలపోసి*
*ఒక్కటొకటి చూచి చక్క చేసి*

తే॥ చూపవలెగాన నీవింక చురుకుగాను
సాగుచుండుమని తెలుపు సరణినంత
మానవాళికి దెలుపుట మరువకనుచు
కవిని కదిలించె గురుదేవు కంటిచూపు

64 సీ॥ *నీ 'ఉపాసన' నీకు నీడగ నిలుచుండు*
*ఆత్మబలముగూర్చునండగాను*
*'సాధన'ంబున నీవు సాగిపోవు కొరకు*
*భగవానుదరిజేరి భయము వీడి*
*'ఆరాధన'ంబున ఆత్మబలముతోడ*
*జపము సేయవలము చక్కగాను*
*ఈ 'త్రివేణి'యె నీకు నీడేర్చుకార్యంబు*
*శ్రీరామ! నీకింక రుషుల రక్ష!*

తే॥ శాంతికుంజుకు నీవేగి సమరరీతి
సాగిపొమ్మన్న గురుదేవుసరణినంత
మానవాళికి దెలుపుట మరువకనుచు
కవిని కదిలించె గురుదేవు కంటిచూపు

రచన–మధుర కవయిత్రి
పొన్నూరు హైమవతీ శాస్త్రి

**వనరులు, వసతులు కాదు. ఎవరి విజయానికైనా ఆలోచనా విధానమే మూలం.**

స్వామి వివేకానంద జయంతి ప్రత్యేకం

# ఈనాటికి ప్రేరణలందించే అలనాటి సన్యాసి



12 జనవరి 1883 సంవత్సరపు ఉదయం భారతదేశపు యువతకు ఒక ప్రేరణాత్మకమైన ఉషోదయమును అందించింది. ఈ దేశ యువతకు ఈశ్వరుని సందేశమును అందించుటకు ఈరోజునే స్వామి వివేకానందులు జన్మించారు. తమ సమాధి చేతనావస్థలో శ్రీరామకృష్ణపరమహంస ఈ దైవీ అవతరణను అనుభూతిచెందారు. తరువాత ఆయన ఒకనాడు మాటల మధ్యలో తమ శిష్యులతో ఇలా అన్నారు. 'ఒకనాడు సమాధిస్థితిలో మనస్సు జ్యోతిర్మయపథంలో ఉచ్చతలాలకు వెళుతున్నప్పుడు ఈ అవతరణను నేను ఇలా దర్శించాను. సూర్య, చంద్ర, నక్షత్ర యుక్తమైన స్థూలజగత్తును సరళంగానే అధిగమిస్తూ మనస్సు ముందుగా సూక్ష్మభావజగత్తులోకి ప్రవేశించినది. ఆ సూక్ష్మ రాజ్యాల ఉన్నత తలాలలో మనస్సు ఎంతగా పైపైకి వెళుతుంటే అంతగా అనేకానేక దేవీ-దేవతా పథములు ఇరువైపులా దృగ్గోచరమౌతున్నాయి. మనస్సు క్రమంగా ఆ రాజ్యపు సరిహద్దునకు చేరుకున్నది. అక్కడ ఒక జ్యోతిర్మయమైన పరదా ద్వారా ఖండ-అఖండ రాజ్యాల విభజన చెయ్యబడి ఉండుట గోచరించినది. ఆ పరదాకూడా అధిగమించి మనస్సు క్రమంగా అఖండరాజ్యంలోకి కాలుమోపినది.'

'అక్కడ ఏ దేవతామూర్తీ లేదు. దివ్యదేహధారులైన దేవీ-దేవతలు సైతం అక్కడికి ప్రవేశించే ధైర్యం చెయ్యరు. ఎందుకంటే అక్కడి నుండి బహుదూరంగా క్రిందనున్న తలాలలో వారు నివసిస్తుంటారు. కాని మరుక్షణంలోనే ఆ అఖండరాజ్యంలో దివ్యజ్యోతిర్మయ దేహధారులైన ప్రాచీనులైన సప్తఋషులు సమాధిరతులై ఆసీనులై ఉండుట కనిపించినది. జ్ఞానం-పుణ్యములో, త్యాగం-ప్రేమలో వీరు మనుష్యులనేమిటి, దేవీ-దేవతల కంటే అధికులు అని నా అంతర్చేతన అవగతం చేసుకున్నది. ఆశ్చర్యపడుతూ వీరిని గురించి ఆలోచించసాగాను. ఇంతలోనే ప్రక్కన ఒక దృశ్యం గోచరించినది. అఖండ జ్యోతిర్మండలం యొక్క ఒక అంశ ఘనీభవించి ఒక దివ్య శిశువుగా రూపుదాల్చినది.

ఆ దివ్యశిశువు ఒక ఋషిని సమీపించి తన సుకోమల హస్తాలతో ఆయనను ఆలింగనం కావించుకుని తన అమృత మయ వాక్కులతో ఆ ఋషిని సమాధిస్థితి నుండి బహిర్గతం చేసేందుకు ప్రయత్నిస్తున్నాడు. శిశువు యొక్క కోమల స్పర్శతో ఋషి సమాధి నుండి బహిర్ముఖుడై అర్ధనిమీలిత నేత్రాలతో ఆ అపూర్వ బాలకుని చూడసాగారు. ఆయన ముఖమండలం మీద నాట్యమాడుతున్న ప్రసన్నోజ్జ్వల భావమును వీక్షించినప్పుడు ఆ దివ్య బాలకుడు ఆయనకు చాలాకాలం నుండి సుపరిచితుడైన వాడు అన్న విషయము తెలిసినది. ఆ అద్భుత దేవశిశువు అమితానందముతో ఋషితో ఇలా చెప్పసాగాడు. 'నేను వెళుతున్నాను. నీవుకూడా రావాల్సి ఉంటుంది.' శిశువు విన్నపమును ఆలకించిన మీదట ఋషి వాచా ఏమీ చెప్పకపోయి నప్పటికి ఆయన ప్రేమపూర్ణమైన నేత్రముల గుండా ఆయన సమ్మతి ప్రకటితమౌతున్నది. తదుపరాంతము ఋషి బాలుని వైపు ప్రేమభరితమైన దృష్టిని సారిస్తూ తిరిగి సమాధిస్థితిలోకి జారుకున్నారు. ఆ సమయంలో ఆ దివ్య శిశువు మనశ్శరీరాలలోని ఒక అంశ ఉజ్జ్వల జ్యోతిరూపంగా మారి అధోమార్గం గుండా ధరాతలంలో అవతరించుటను నేను దర్శించాను. నరేంద్రుని చూడగానే ఆ శిశువే ఇతను అని నాకు తెలిసినది.' శ్రీరామకృష్ణ పరమహంసదేవుని ఈ నరేంద్రుడే తరువాత 'స్వామి వివేకా నందుడు' అన్న పేరున విశ్వవిఖ్యాతుడయ్యాడు.

ఒకవేళ మనం మన ఆలోచనాశక్తిని-దృష్టిని కొంచెం సూక్ష్మబుద్ధితో తీక్షణం కావించుకుంటే 'స్వామీజీ చేతన ఎల్లప్పుడూ ఈ దేశ యువత హృదయాలలో ధ్రువతారగా మెరుస్తూ ఉంటుంది' అన్న విషయం సహజంగానే స్పష్టమౌతుంది. శ్రీఅరవిందులు, నేతాజీ, గాంధీ, నెహ్రూ మొదలగువారందరు తమ యౌవనావస్థలో స్వామీజీ ఆలోచనాధార, ఆధ్యాత్మిక చేతనతో ప్రేరితులు, ప్రభావితులు అయినారు. ఈనాడు కూడా అటువంటి పరిస్థితే ఉంది. ఆదర్శనిష్ఠుడైన ప్రతి వ్యక్తికి ప్రేరణకు మూలం ఒక్క స్వామీ వివేకానందులు తప్ప మరెవ్వరు కాదు. ఆయన సుందరవదనం కూడా మనలను ఆకర్షిస్తుంది. ప్రేరణను సైతం కలిగిస్తుంది. ఆయన కనుదోయినుండి వ్యక్తమౌతున్న లోతైన తీక్షణ జ్ఞానంతోపాటు ఆయన సాహసం మరియు నిర్భయమైన ఆలోచనలు ప్రాణులపట్ల కరుణా వీక్షణాలను ప్రసరింపజేస్తూ కనిపిస్తాయి.

స్వామీజీ వాక్కులోను, హృదయంలోను అశిక్షితులు, అణగారిన మరియు నిరుపేదలైన మానవుల పట్ల అపారమైన ప్రేమ, బాధ రెండూ ఉన్నాయి. ఆయన స్వరంలో సింహగర్జన కూడా తొంగిచూస్తు ఉంటుంది. దానితోపాటు మధుర సంగీత స్వరాలు కూడా జాలువారుతూ ఉంటాయి. ఆయన హృదయం

**ఒక్కోసారి సమాధానం చెప్పకపోవడం కూడా ఒక సమాధానమే.**

నుండి ఎగసిపడిన భావాలు, ఆలోచనలు ఈనాడు కూడా వివిధ పుస్తకాల పుటలలో ముద్రించబడుతున్నాయి. వాటిని కనుక మనం పఠించినట్లయితే స్వామీ వివేకానందులు తమ మనోగతమును, తమ హృదయ వేదనను మన ముందుంచుతున్నారన్న అనుభూతి కలుగుతుంది. ఆయన వాక్కులు ఇలా అనిపిస్తాయి. ఆయన హృదయంలో భారతదేశపు నేటి యువత పట్ల అనంతమైన ప్రేమ మరియు దృఢ విశ్వాసము ఉంది. బహుశా ఇందువల్లనే ఆయన ప్రతిమాట యువత మనస్సులో ప్రతిధ్వనిస్తూ ఉంటుంది. యువతకు ముఖ్యంగా నవయువకులకు ఆయన స్నేహం, విశ్వాసములే ప్రేరకశక్తిగా పనిచేస్తాయి. నవయువకుల మీద ఆయన వాక్ ప్రభావం సైతం విద్యుత్తరంగాల వలె పడుతుంది. స్వామీజీ యొక్క ఈ ఉపన్యాసాలు ఆయన జీవితం వలెనే బహు ఆయామములు కలిగినవి.

ఈనాడు ఏ యువకుడైనా తన లక్ష్యమును సాధించు కునేందుకు పరిశ్రమిస్తున్నప్పుడు ఒకవేళ అతను అపజయం పాలైతే అతని మనస్సు వికలమౌతుంది. నిరాశ అనే అంధకారము అతనిని చుట్టుముడుతుంది. ఆ స్థితిలో లక్ష్యమును మధ్యలోనే వదిలివేయవచ్చు, ఇంకా కొందరు ఆత్మహత్యకు పాల్పడవచ్చు.

స్వామీ వివేకానంద ఇటువంటి విపత్కర పరిస్థితులకు పరిష్కార మార్గమును ఇలా సూచించారు. 'అసఫలత జీవన సౌందర్యము. **నీవు వేయిసార్లు ఓడిపోయినప్పటికి తిరిగి ఒక్కమారు విజయుడవయ్యేందుకు ప్రయత్నించు!'** యువకులనుద్దేశించి ఆయన అన్న ఈ మాటలు భయంకరమైన నిరాశ అను అంధకారములో కూడా ఆశాకిరణాలతోపాటు జీవన సంగ్రామంలో పోరాడేదిశగా వారిని ప్రేరేపిస్తాయి. అంతేకాక సూక్ష్మదృష్టితో అవలోకించినప్పుడు జీవితంలో నిరంతర సంఘర్షణ ఉన్న వ్యక్తి జీవితమే సౌందర్యమయమైనదిగా గోచరిస్తుంది. మానవ జీవిత సంగ్రామం ఎటువంటి ఒక యుద్ధమంటే దానినెవ్వరూ ఆయుధాలతో గెలువలేరు. మానవుడు తన హృదయపు లోతులలో దాగివున్న శక్తిని ప్రకటీకృతం చేసుకున్నప్పుడే దానిని గెలువగలడు. ఇందువల్లనే స్వామీజీ సింహగర్జన చేస్తూ ఇలా అనేవారు. 'శక్తియే జీవితము, దుర్బలతే మరణం అన్నది తిరుగులేని సత్యము. శక్తియే అనంత సుఖము, చిరపురాతన శాశ్వత జీవనము. బలహీనతయే మృత్యువు. దుర్బలుడైన వ్యక్తికి ఈ ప్రపంచంలోనూ, పరలోకం లోనూ రెండిటా ఏ స్థానమూ ఉండదు. దుర్బలత్వమే మనలను అన్ని రకాలైన అలవాట్లకు బానిసలుగా మారే దిశగా తీసికెళుతుంది. దుర్బలత్వమే శారీరిక మరియు మానసిక ఒత్తిడికి కారణము. ఆ బలహీనతే మానవ దేహమునకే కాదు, చేతనకు కూడా మృత్యువు వంటిది. ఇందువలన నాకు దుర్బలురు మరియు బలహీనులు అవసరం లేదు అని అంటాను. నాకు నాడులు లోహసదృశం గానూ, కండరాలు ఉక్కు వలె దృఢంగానూ ఉండే నవయువకులు కావాలి. మరియు వారి ప్రవృత్తి లోభం, స్వార్థములకు అతీతంగా ఉండాలి.' స్వామీజీ తమ దివ్యమైన వాక్కులతో యువకులను ఇలా హెచ్చరిస్తున్నారు. 'మానవుని అంతరంగంలో శక్తిసంచారం జరుగుతున్నప్పుడు అతను అన్ని అపజయాలను విజయాలుగా మార్చుకుంటాడు అన్న విషయమును గుర్తుంచుకోండి. శక్తి లేని కారణంగా మృతప్రాయమైన జీవనం, తిరిగి జీవించేందుకు కావల్సినటువంటి జీవన సంఘర్షణలో మునిగిపోతుంది. ఆత్మశక్తి బలుడైన మనిషి అపజయాన్ని ఒక్క విదిలింపుతో పారద్రోలతాడు. అంతేకాక సింహగర్జన చేసి తన జీవితాన్ని ప్రగతి దిశగా ముమ్ముందుకు నడిపిస్తాడు.

స్వామీజీ నవయువకులలో సంవేదనల భావప్రవాహాన్ని ప్రవహింపజేయుటకు ఇలా అంటారు. 'యువకులారా! మీ హృదయంలో అందరిపట్లా వ్యథ ఉండాలి! నిరుపేదలు, మూర్ఖులు, అణగారిన మనుష్యుల దుఃఖమును మీరు అనుభూతిచెందండి. సంవేదనతో మీ హృదయ స్పందన పెరగాలి. బుద్ధి విస్మయం చెందాలి. మీరు పిచ్చివారవుతున్నారేమోనన్న భ్రాంతి కలగాలి. అటువంటి సమయంలో మీరు ఈశ్వరుని చరణాల వద్ద మీ హృదయ వేదనను వెలిబుచ్చండి. అప్పుడే శక్తి, సహాయం మరియు అంతులేని ఉత్సాహం మీకు ప్రసాదించబడతాయి.' ఈనాడు నేను మీకు కూడా నా జీవన మూలమంత్రాన్ని చెపుతాను. అదేమిటంటే **'మీరు ప్రయత్నిస్తూ ఉండండి, మీ నలుచెరగులా గాఢాంధకారము అలుముకున్నప్పుడు కూడా మీరు ప్రయత్నరతులై ఉండండి అని నేను సూచిస్తున్నాను. ఎట్టి పరిస్థితులలోనూ మీరు ఓడిపోవద్దు, ప్రయత్నిస్తూ ఉండండి చాలు! మీరు తప్పక లక్ష్యమును చేరుకుంటారు. ఇందులో ఇసుమంతైనా సందేహం లేదు.'**

12 జనవరి 1863 వ సంవత్సరంలో దివ్య చేతన దేహధారణ చేసి జన్మించినది. ఆ దివ్యదేహం ప్రస్తుతం లేకపోయినప్పటికి ఆయన చేతనత్వము ఈనాడు కూడా అంతే తీక్షణంగా, తేజోవంతంగా ఉంది. మనం కోరుకున్నట్లయితే ఈ క్షణంలో కూడా మన హృదయంలో ఆయనను ప్రఖరత మరియు తేజస్విత రూపంలో దర్శించవచ్చును. స్వామీజీ ఆలోచనాధారను అనుసరించి నేడు కూడా ఆయనను పొందగలము అన్నది సునిశ్చితమైన తథ్యము. స్వామీజీ తమ ఆలోచనల రూపంలో సజీవంగా ఉండి నేడు కూడా భారతీయ యువకులకు ప్రేరణనిచ్చి వారిని మార్చి రూపాంతరం కావించుటకు ఆతృతతో ఉన్నారు.

*– అఖండజ్యోతి, జనవరి 2002*

*అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

**ఓటమిని అంగీకరించనివాడు ఎప్పటికైనా విజయానికి దగ్గరవుతాడు.**

రంగుల విజ్ఞానం

# రంగుల రూపంలో సూక్ష్మశరీరంలో ఉన్న శక్తి భాండారం

మానవ శరీరమును సురదుర్లభము అని ఎందుకు అంటారంటే సృష్టికర్త దీనిలో అణువు నుండి విభువు, మనిషి నుండి దేవత, నరుని నుండి నారాయణునిగా మారే అనంత అవకాశాలను ఇబ్బడి ముబ్బడిగా నింపిపెట్టాడు. ప్రకాశపుంజ రూపంలో భగవంతుడు స్వయంగా మన హృదయకమలంలో విరాజమానుడై ఉన్నాడు. ఆత్మ విషయమును గురించి చర్చిస్తూ ధ్యానబిందూపనిషత్తులోని 93/1వ మంత్రంలో **'హృది స్థానే అష్టదళపదమ్ వర్తతే। తన్మధ్యే రేఖావలయం కృత్వా జీవాత్మరూపం జ్యోతీరూపమణు మాత్రం వర్తతే'** అనగా హృదయకేంద్రంలో నెలకొని ఉన్న అష్టదళకమలంలో జీవాత్మ జ్యోతిరూపంగా మారి అణుమాత్ర రూపంలో వెలుగొందుతూ ఉన్నది. శరీరం యొక్క సమస్త క్రియాకలాపముల నిర్వహణ కేంద్రబిందువు కూడా అదే. ఈ అష్టదళపద్మమునకు తూర్పు వైపు ఉన్న దళము ధవళవర్ణము కలది. అందులో జీవాత్మ నివాసముంటే అటువంటి వ్యక్తులు ధర్మ పరాయణులై భక్తిభావంతో ఓలలాడుతూ ఉంటారు. ఏ వ్యక్తి అయినా ఆగ్నేయదిశలో ఉన్న రక్తవర్ణ దళము వైపు వెళితే అతను సోమరితనం, పొరపాటులు చేయటమనే బలహీనతలకు లోనై భయంతో నరకప్రాయమైన జీవితమును గడుపవలసివస్తుంది. దక్షిణదిక్కున ఉన్న నల్లని దళంలో నివాసముంటే దానర్థం విద్వేషం, ఆక్రమణ ప్రవృత్తులను అనుసరించుట. నైఋతిదిశలో ఉండే నీలవర్ణదళంలో జీవాత్మ నివాసముండుట వలన పాపకర్మలు, హింసా ప్రవృత్తుల మనఃస్థితి ఉంటుంది.

ఇదేవిధంగా పశ్చిమదిశలో ఉండే స్ఫటిక వర్ణదళంలో జీవాత్మ ఆవాసముంటే హర్షోల్లాసములు, ఆటలు, మనోరంజనంలో అభిరుచి ఉత్పన్నమౌతుంది. వాయవ్యకోణంలో ఉండే మాణిక్యవర్ణ దళంలో జీవాత్మ స్థితమై ఉంటే తిరుగుట, యాత్రాటనం, వైరాగ్య భావనల వైపు ప్రవృత్తమౌతాడు. ఉత్తరదిశ వైపు ఉండే పసుపువన్నె దళములో జీవాత్మ నివాసమున్నప్పుడు సుఖసాధనములు, అందం, అలంకరణముల పట్ల ఎక్కువ అభిరుచి ఉంటుంది. ఈశాన్య కోణమునకు చెందిన వైఢూర్యవర్ణదళంలో జీవాత్మ నెలవైవుంటే దానం, పుణ్యం, అనుగ్రహం చూపుటలో రుచి జాగృతమౌతుంది. ఈవిధంగా ఆటగాళ్ళ ద్వారా ఇటునుండి అటువైపుకు విసిరే బంతి వలె జీవాత్మ కూడా ప్రాణాపానాది వాయువుల ద్వారా నిరంతరం గతిశీలమై (active) ఉంటుంది. ఇందువలన సాధనా గ్రంథాలలో మనో ప్రాణాల మీద నియంత్రణను సాధించమని ప్రప్రథమంగా చెపుతారు. గాయత్రి ప్రాణములను ధారణ చేసే ప్రాణవిద్య, మహావిద్య. అది కుండలినీ మహాశక్తి నుండి ఉద్భవిస్తుంది. గాయత్రి సాధనతోనే ప్రాణము నియంత్రించబడుతుంది. చివరికి సాధకుడిని మనోభీష్టమనే సత్పరిణామం వరకు చేరుస్తుంది.

యోగచూడామణ్యుపనిషత్తు ఆరంభంలోనే యోగసాధనల మహత్యం, ఆవశ్యకతలను బలపరుస్తూ 'మానవ శరీరంలో సప్తశక్తి కేంద్రాలు ఉన్నాయి, వాటిని చక్రాలు అనే పేరుతో పిలుస్తాము' అని చెప్పబడినది. యోగసాధకులు కుండలినీశక్తి సాధన ద్వారా చక్రబేధన చేస్తారు. తాళంచెవితో ఇంటి ద్వారమును తెరచిన విధంగానే యోగులు ముక్తిద్వారమును తెరుస్తారు. ఈ గ్రంథంలోని 9/90వ మంత్రంలో నాభికి సరిగ్గా వెనుకనే సూర్య చక్రం నెలకొని ఉంటుంది అని చెప్పబడింది. దాన్ని మణిపూరక చక్రం అని కూడా అంటారు. అది తపించబడిన స్వర్ణంతో సమానంగా కాంతులీనే విద్యుద్ధారవలె చక్కగా ప్రకాశిస్తూ ఉంటుంది. సమాధి స్థితిలో ఆ స్థానంలో ఒక పరమజ్యోతి కానవస్తుంది. దాని వర్ణ ప్రకాశం బంగారువన్నెవలె ఉంటుంది. ఆ పరమజ్యోతిని దర్శనం చేసుకున్నవారు జనన - మరణాల చక్రం నుండి విముక్తులౌతారు.

ప్రాణము స్వాధిస్థాన చక్రంలో ఆవాసముంటుందని చెప్తారు. థియోసాఫికల్ సొసైటీ లండన్‌కు చెందిన ప్రసిద్ధ గుహ్య వైజ్ఞానికుడు లెడ్ బీటర్ 'ది చక్రాస్' అనే పేరు గల పుస్తకంలో ప్రాణం గొప్పతనమును వర్ణిస్తూ ఇలా వ్రాశాడు. ఈ పరమతత్త్వము సమస్త విశ్వ-బ్రహ్మాండంలో వ్యాపించి ఉంటుంది. దాని ఉద్గమ స్థానం సూర్యుడు. గాయత్రీ మహావిద్యలో దీనినే సవిత అని చెప్తారు. ఆయన ఈ ప్రాణతత్త్వమును 'వైటాలిటీ గ్లోబ్యూల్' అనే పేరుతో సంబోధించాడు. స్వాధిష్ఠాన చక్రంలో ఈ తత్త్వమును పీల్చుకునే శక్తి ఉంటుంది. ప్రాణశక్తి నివాస స్థానం కూడా ఇదే. స్వాధిష్ఠానచక్రం ప్రకాశరూపంలో ఈ జీవనీశక్తిని గ్రహిస్తుంది. రంగుల రూపంలో ఆ శక్తి భండారమును సమస్త శరీరంలోని ఇతర శక్తికేంద్రాలకు వితరణ (distribution) చేస్తూ ఉంటుంది. ఎరుపు, నీలం, పసుపు, ఆకుపచ్చ, వంకాయ, నారింజ, గులాబి అనునవి ఆ రంగులు. రంగులీనే ఈ ప్రకాశధారలు అన్ని

**మురికి నీళ్ళయినా సరే మంటలను ఆర్పగలవు.**

చక్రాలలోను సమానంగా ప్రవహిస్తూ ఉంటాయి. అక్కడినుండి శరీరంలోని విభిన్న అంగ అవయవములన్నింటికి జీవనశక్తి పూర్తి స్థాయిలో లభ్యమవుతూ ఉంటుంది. ఈ సప్తవర్ణ కాంతుల ప్రకాశ కిరణములను ప్రాథమిక శక్తిస్రోతం రూపంలో క్రింది విధంగా ప్రకటీకరించబడినవి.

వంకాయ-నీలివర్ణ ప్రకాశధారలు కంఠం నుండి ప్రవహిస్తూ రెండు భాగాలుగా విభజించబడతాయి. వీటిలోనుండి కాంతులీనే నీలిరంగు కంఠ ప్రాంతంలో ప్రాణసంచారం కావిస్తుంది. రెండవదైన ముదురు నీలం-వంకాయ వర్ణ ప్రకాశతరంగాలు మస్తిష్కం వైపుగా వ్యాపిస్తూ సాగిపోతాయి. మస్తిష్క ప్రదేశం చేరుకుని ఈ ముదురు నీలివర్ణ తరంగాలు విలీనమైపోతాయి. ఆకుపచ్చరంగు కిరణాలు సూర్యచక్రంలోకి అధికంగా ప్రవేశిస్తాయి. అవి ఉదరంలోకి ప్రవేశించి కాలేయం, మూత్ర పిండాలు, ప్రేగులు మరియు జీర్ణవ్యవస్థలో జీవశక్తిని సంచరింప జేస్తాయి. దీని ఫలితంగా ఈ అంగ అవయవములన్నీ ఆరోగ్యం గాను, సక్రియంగాను ఉండి తమకు ఇవ్వబడిన కర్తవ్యములను చక్కని రీతిలో నిర్వహిస్తూ ఉంటాయి. పసుపువన్నె ప్రకాశ కిరణాల ఉద్గమస్థానం మస్తిష్కం యొక్క సర్వోచ్చ శక్తికేంద్రమైన సహస్రార చక్రంగా భావించబడుతుంది. గులాబీవన్నె ప్రకాశతరంగాలు శరీరంలోని సంపూర్ణ నాడీవ్యవస్థ మీద ప్రభావాన్ని చూపుతాయి. ఈ ప్రకాశతరంగాల మూలభూతమైన విశేషతలు ఏమిటంటే వీటి ద్వారా ఒక వ్యక్తిలోని ప్రకాశం, ప్రాణశక్తిని మరో వ్యక్తిలోకి ప్రవేశ పెట్టవచ్చును. ఒక ఆరోగ్యవంతుడైన వ్యక్తి తన గులాబీ వర్ణమును ఆవశ్యకతను అనుసరించి రోగగ్రస్థుడైన మరో వ్యక్తిలోకి ప్రవేశింపజేసి అతనిని కూడా తనవలెనే ఆరోగ్య వంతునిగా చేయవచ్చును. ఆరోగ్యవంతుడైన వ్యక్తి సాన్నిధ్యముతో అనారోగ్యవంతుడైన వ్యక్తి కూడా అకస్మాత్తుగా ఆరోగ్యలాభమును పొందుటను అప్పుడప్పుడు మనం చూస్తూ ఉంటాము.

నారింజ-ఎరుపు వర్ణ ప్రకాశ కిరణాల ముఖ్య కార్యము మేరుదండం క్రింది భాగం నుండి వెలువడి మొత్తం శరీరంలో వేడి తీవ్రతను తగుపాళ్ళలో ఉంచుతాయి. తద్వారా వ్యక్తిలో అవసరమైన వ్యాధి నిరోధక శక్తి (ఇమ్యూనిటి) చక్కని బలంతో, శక్తివంతంగా ఉంటుంది. త్రివిధ ప్రకాశధారలు మస్తిష్కం వైపుగా పయనిస్తాయి. నారింజ, ఎరుపు, వంకాయ రంగుగా వాటిని అనుభూతి చెందవచ్చును. సాధకుడు బుద్ధిమంతుడై, దూరదృష్టిని వికసింపజేసుకున్నప్పుడు నారింజవన్నె ప్రకాశ కిరణాలు బంగారుపసుపు వర్ణంలోకి పరివర్తన చెందుట అన్నది సునిశ్చితంగా జరుగుతుంది అని లెడ్‌బీటర్ అన్నారు. పారమార్థిక భావనలు ఉదయించినపుడు ముదురు ఎరుపురంగు పలక రంగుగా మారుతుంది. ఆధ్యాత్మిక ప్రవృత్తులు బాగా వికసించినప్పుడు ముదురు వంగ రంగు-పసుపుతో కూడిన వంకాయ రంగులోకి పరిణామం చెందుతుంది. ఈ ప్రకాశకిరణాల సమ్మేళనంతో ఆత్మబల సంపన్నులైన వ్యక్తుల ఆభామండలం (Aura) నిర్మించ బడుతుంది. ఆ వర్ణ తీవ్రతను అనుసరించే వ్యక్తి గొప్పతనం సుస్పష్టంగా గోచరిస్తుంది.

*- అఖండజ్యోతి, జూన్ 2008*

*అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

## గృహస్థాశ్రమం ధన్యమైనది

***ధన్యోగృహస్థాశ్రమః*** *గృహస్థాశ్రమం చక్కని పౌరులను అందించే గని వంటిది. మహాభక్తులు, గొప్ప జ్ఞానులు, సత్పురుషులు, సంస్కర్తలు, విద్వాంసులు, పండితులు వీరందరూ కూడ గృహస్థాశ్రమం నుండి ఉద్భవించినవారే. వీరి జన్మేగాక, శిక్షణ, దీక్ష, పాలన, పోషణ, జ్ఞానాభివృద్ధి - అన్నీ గృహస్థాశ్రమం ద్వారానే జరుగుతాయి. కుటుంబాన్ని మించిన విద్యాలయంలేదు. అక్కడ లభించే సర్వోత్కృష్టమైన శిక్షణకు మించినది మరెక్కడ లభించదు. సమాజంయొక్క సువ్యవస్థితమైన స్వరూపంయొక్క మూలాధారం గృహస్థాశ్రమమే, గృహస్థధర్మం మానవ జీవితంయొక్క పవిత్రమైన, ఉపయోగరమైన అనుష్ఠానం. ఆత్మోన్నతికి అన్నిటికంటె ఉత్కృష్టమైన ప్రదేశం, ఆశ్రమ స్థలం - గృహమే. అందుచేతనే మిగిలిన ధర్మాలన్నిటికంటే గృహస్థ ధర్మానికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వబడింది. మహర్షి వ్యాసుడు ఏమన్నాడంటే* ***"గార్హ స్థ్యైవహి ధర్మాణాం సర్వేషాం మూలముచ్యతే"*** *అనగా గృహస్థాశ్రమమే సర్వధర్మాలకు ఆధారం. గృహస్థాశ్రమం ధన్యమైనది. ఏవిధంగా అయితే సమస్త ప్రాణులకు తల్లి ఆధారమో, అదే విధంగా సమస్థ ధర్మాలకు గృహస్థాశ్రమం ఆధారమైయున్నది. సర్వ సాధారణంగా కనిపించే అతి మహత్తరమైన ఈ గృహస్థయోగ సాధన వికసించినపుడు ఆత్మ పరమాత్మగా మారినట్లు పూర్ణత్వాన్ని పొందుతుంది.*

*- ప్రజ్ఞాపురాణం నుండి*

**మనం వెతకవలసింది చెప్పేవారి కులగోత్రాలు కాదు, చెప్పినదానిలోని మంచి చెడులు.**

సాధనా విజ్ఞానం

# వీరభద్రుల స్వరూపం మరియు సాధనక్రమం

పంచ జ్ఞానేంద్రియములు, పంచకర్మేంద్రియములు, మనో, బుద్ధి, చిత్త, అహంకారములనే అంతఃకరణ చతుష్టయములతో కూడిన స్థూల శరీరము మాత్రమే మన కంటికి కనిపిస్తుంది. దీని అధిష్ఠాతను ప్రాణము అని పిలుస్తారు. స్థూలశరీరము సక్రియముగా ఉన్నంతవరకు ప్రాణి జీవించి ఉంటుంది. సామాన్యంగా జరిగే వ్యవహారములన్నీ దీని ద్వారానే నడుపబడుతు ఉంటాయి. **నిత్యము జరిగే జీవన వ్యవహారములను నడిపించే శరీరము కాక ఇంకా మనకు నాలుగు శరీరాలుంటాయి. అవి ఆధ్యాత్మిక ప్రయోజనములకు ఉపయోగపడతాయి.** ఒక్కోసారి ఇవి మూడు అని, కొన్నిచోట్ల ఐదు అని చెప్తూ ఉంటారు. బ్రహ్మగ్రంధి, విష్ణుగ్రంధి, రుద్రగ్రంధి అనేవి మూడు గ్రంధులు. వీటిని ఆధారంగా చేసుకొని ఋషులు స్థూల, సూక్ష్మ, కారణ శరీరములను వివరించారు. కానీ కొందరు పంచకోశములకు ప్రాధాన్యతనిచ్చారు. అంతేకాదు ప్రతి కోశము ఒక స్వతంత్ర శరీరమని కూడా చెప్తారు. అవి 1. అన్నమయకోశము, 2. ప్రాణమయకోశము, 3. మనోమయకోశము, 4. విజ్ఞానమయ కోశము, 5. ఆనందమయకోశము. ఈ విధంగా ఐదు శరీరాలు తయారౌతాయి. ఇవి పంచతత్వములకు భిన్నముగా ఉంటాయి, పంచప్రాణములు వీటిలో ఉంటాయి. ఈ ఐదు కోశాలు ఐదు దేవశక్తులతో నిండి ఉంటాయి. సూర్యుడు, ఇంద్రుడు, అగ్ని, వాయువు, వరుణుడు ఈ ఐదు కోశములకు అధిష్ఠాతలు.

సూక్ష్మీకరణసాధనలో ఈ కోశములను ఒక విశేషపద్ధతి ద్వారా జాగృతము చేయడం జరుగుతుంది. **6 చక్రములలో ఐదు చక్రాలు కోశములతో కలిసిపోయి ఉంటాయి. ఇలా పెనవేసుకున్న శరీరాలను వీరభద్రులు అని పిలుస్తారు.** థియోసఫీ ప్రకారము ఈ ఐదింటికీ ఒక్కో స్వతంత్ర శరీరము ఉంటుంది. అవి 1. ఫిజికల్ బాడీ (భౌతికశరీరము), 2. ఈథరిక్‌బాడీ (ఈథరిక్ డబల్), 3. ఆస్ట్రల్‌బాడీ, 4. మెంటల్ బాడీ, 5. కాజల్‌బాడీ (Casual Body) వీటిని ఐదు లోకములుగా కూడా పిలుస్తారు. వీటి ఆత్మ సూక్ష్మశరీరము యొక్క ఏ స్థితిలో తాను బలంగా, సమర్థవంతంగా ఉన్నానని అనుకుంటుందో ఆ లోకంలో నివశిస్తుందని చెప్తారు. ప్రతి లోకము యొక్క శక్తులు, సిద్ధులు, వాటి చమత్కారములు, వాటివాటి ఫలశృతులు వేరువేరుగా ఉంటాయి. కొన్నికొన్నిసార్లు సందర్భవశాత్తు ఈ శక్తులు పరస్పరము ఒకదానితో ఒకటి కలిసి ఒక కొత్త సామర్థ్యమును సృష్టిస్తాయి. ఎప్పుడు ఏ కోశమునకు విశిష్ట ప్రయత్నము చేయవలసి వస్తుందో ఆ సమయములో అవి ముడిపడుతూ, విడిపోతూ ఉంటాయి. వీటి విధానాలు కూడా ప్రకృతి యొక్క విధివిధానాలతో సమానంగా ఉంటాయి. వీటిలో శక్తి స్థిరంగా, నాశరహితంగా ఉంటూనే పరిస్థితులకనుగుణముగా ఒక్కోసారి విభిన్న రూపాలలోను, ఒక్కోసారి సముచ్చయ రూపములలోను కలసి కనిపిస్తూ ఉంటుంది.

ఈ వీరభద్రుల కార్యక్షేత్రము చాలా విస్తృతంగా, సార్వజనీనమై (అంతటా వ్యాపించి) ఉంటుంది. అతీంద్రియ సామర్థ్యాలనేవి వ్యక్తిగత చమత్కారాలతో నిండి ఉంటాయి. కానీ **కోశముల సామర్థ్యము ఒకే సమయములో ప్రకృతిలోని వేలాది మంది వ్యక్తులను, వారి పాత్రతకు అనురూపంగా ప్రభావితం చేస్తూ ఉంటుంది. వారందరికి ఒకే రకమైన ప్రేరణనిచ్చి ఒకే దిశలో, ఒకే మార్గంలో నడిపిస్తుంది. ఎవరు వీరభద్రునితో సంపర్కము సాధించుటలో సమర్థులౌతారో వారికితాము ఒక విశేష ప్రయోజనము కొరకు ఏదో ఒక విశేషమైన బలప్రయోగము ద్వారా తోయబడుతున్నామని అర్థమౌతుంది.** సాధారణంగా శిక్షణ, ప్రవచనములు, సలహాలు, ఒత్తిడి, ప్రలోభములు లేదా బల ప్రయోగము ద్వారా వ్యక్తుల ఆలోచనలలో మార్పు తీసుకు రాబడుతుంది. అలాంటివారికి అంతకుముందు అభ్యాసము లేకపోయినా అది వారి స్వభావము కాకపోయినా శక్తివంతులైన వారు చేసే పనులు చేసి చూపిస్తారు.

ఇందుకొరకు పనిచేసే స్థూలశరీరములోని ఐదు శక్తులు స్థూల శరీరములో సామాన్యంగానే ఉంటాయి. కానీ సూక్ష్మస్థితిలో తమ విశిష్టతలను చాటుకుంటాయి. వీటి ప్రభావములో కొంతభాగం స్థూలశరీరము చుట్టూ ఉంటుంది. ఎప్పుడైతే సూక్ష్మశరీరములో వాటి అవసరం అధికంగా ఏర్పడుతుందో అప్పుడు అవి ప్రచండ రూపం దాలుస్తాయి. పంచవీరభద్రుల యొక్క ఐదు స్వతంత్రశక్తులు ఈ విధంగా వుంటాయి. 1. బయో ఎలక్ట్రిసిటి (జీవవిద్యుత్) 2) బయోమాగ్నటిజమ్ (జీవ అయస్కాంతశక్తి) 3. రేడియేషన్ (వికిరణము) 4. క్రియేషన్ - రిప్రొడక్షన్ (ప్రజననము అనగా సృష్టి-నవనిర్మాణము) 5. ఇమ్యూనిటి (ప్రతిరోధక సామర్థ్యము).

**ఓడిపోతామేమోనన్న భయం గెలుపును దూరం చేస్తుంది.**

ఇవి సక్రియము (active) కాగానే సూక్ష్మ శరీరము ద్వారా ఈ ఐదు శక్తులను ప్రయోగించి ప్రభావితము చేసేందుకై వినియోగింపబడతాయి. యుగపరివర్తన యొక్క ఈ ప్రక్రియలో మహత్తరమైన పాత్రను నిర్వహించగలిగే ప్రాణవంతులైన వ్యక్తిత్వములలో ఆంతరిక, పరివర్తన తీసుకు రావాలి. వారి యొక్క గుణ, కర్మ, స్వభావములలో మహత్తర ఉద్దేశ్యములను నెరవేర్చ గలిగేందుకు అవసరమైన తత్వములను వారికి అభ్యాసములో లేకపోయినా సరే ప్రవేశపెట్టాలి. పరివర్తనలనేవి ఈ విధంగానే ప్రవేశపెట్టబడతాయి.

తేలికపాటి ఒత్తిడి తీసుకురావడం ద్వారా స్వభావములలో మార్పు తీసుకురావచ్చు. కానీ అత్యున్నత స్థాయిలో యుద్ధ ప్రాతిపదికన తలపడవలసివచ్చినపుడు ప్రాణవంతులైన వారి నరములకు సూక్ష్మమైన, వినూత్నమైన ఇంజక్షన్ ఒకటి ఇవ్వాలి. ఈ ప్రక్రియ మొత్తం జరిగేందుకు సూక్ష్మశరీరములో నాడీగుచ్ఛకములున్న ప్రాంతం అనుకూలమైన ప్రదేశమని చెప్పాలి. ఈ గుచ్ఛకములనే (ప్లెక్సెస్) చక్రములని కూడా అంటారు. వాస్తవానికి అవి విడివిడిగా ఉండే శక్తులు. గుచ్ఛకములు కంటికి కనిపిస్తాయి కానీ సూక్ష్మవిద్యుత్ప్రవాహము కంటికి కనిపించదు. కొన్నిచోట్ల సైనికులను యుద్ధరంగంలో పోరాటానికి పంపేముందు సారాయి తాగిస్తారు. అప్పుడు సూక్ష్మశక్తి చూపే పరాక్రమ ప్రభావమువల్ల మనిషికి తాను చనిపోతున్నానా, బ్రతికున్నానా అనే విషయము కూడా గుర్తుండదు. అదే విధంగా హనుమంతుడు, జాంబవంతుడు, జటాయువు మొదలైనవారు ఆవేశపూరితమైన పనిచేసేందుకై వారి నాడీగుచ్ఛకములను (ప్లెక్సెస్) ఈ వీరభద్రుల సామర్థ్యము ద్వారానే ఉత్తేజితము చేసుకున్నారు. ప్లెక్సెస్ యొక్క సామర్థ్యములు, పద్ధతులు వేరువేరుగా ఉంటాయి. అందుచేత ఎవరిద్వారా ఏ పని చేయించాలి అనే సత్యమును దృష్టిలో ఉంచుకొని ఒక్కోదాని గురించి విడివిడిగా ఇప్పుడు చర్చించుకుందాము. ఈ ప్లెక్సెస్ ఐదు రకాలు, అవి 1. సెక్రెల్ 2. సోలార్ 3. కార్డియాక్ 4. ఫెరెన్జియల్ 5. కైవర్నస్. వీటిని కనుక సూక్ష్మ చక్రాలైన ఉపత్యకలతో కలిపితే ఇడ–సుషుమ్న–పింగళలకు రెండు ప్రక్కలా ఉంటాయి. అందుచేత ఇవి మూలాధారము, మణి పూరకము, అనాహతము, విశుద్ధి, ఆజ్ఞలకు సంబంధించినవిగా చెప్తారు. ఈ ఐదు సూక్ష్మశరీరములో పనిచేస్తాయి. కానీ స్థూలంగా వీటి చిహ్నములు మాత్రమే మనకు కనపడతాయి. అవి ఎంతటి మహత్వపూర్ణ కార్యములు చేస్తున్నాయో మాత్రం కంటికి కనిపించదు. ఎప్పుడైనా ఎవరైనా మహామానవులు చూపించ గలిగేంత పరాక్రమము చూపించినప్పుడు ఆ శక్తులు అతనిలో ఉత్తేజితమై పనిచేయిస్తున్నాయని గ్రహించాలి. మహా పురుషుల యొక్క మార్గంలో ఎవరిని, ఎలా నడిపించాలి, అందుకు ఏ ప్లెక్సెస్‌ని ఎంత ఎంత మోతాదులో ఏ విధంగా ఉత్తేజపరచాలి అనే విషయములపై నియంత్రణ సాధించాలంటే వీరభద్రుల ప్రణాళిక తెలిసిన విశేషజ్ఞుల వద్ద చాలా వివరంగా నేర్చుకోవచ్చు.

ప్రతిభాశాలురైన వ్యక్తులు ప్రతిపనిలోను తమ విశిష్టతను నిరూపించుకుంటారు. శారీరిక బలహీనత, బరువు తక్కువగా సన్నగా ఉన్న వ్యక్తులు కూడా ప్రతిభావంతులు కావచ్చు. ఒక్కోసారి బలిష్టమైన కండలు పెంచిన వ్యక్తి అయినా ప్రతిభాశాలి కాకపోవచ్చు. అతనికి ఏదైనా కఠినతరమైన కార్యమును అప్పగిస్తే ఏం చెయ్యాలో అర్థముకానీ అయోమయంలో పడిపోతాడు. ప్రతిభా వంతుడు కావడానికి ఆరోగ్యవంతమైన, బలమైన శరీరము ఉండాల్సిన అవసరమేమీ లేదు. ఈ విషయంలో సూక్ష్మ శరీరములో ఉండే ఎంజైములు చాలా ప్రధానపాత్ర పోషిస్తాయి. ఎంజైములలో చాలా రకాలు ఉన్నాయి. కానీ మనము ఇక్కడ చెప్పుకునేది మస్తిష్కము నుండి స్రవించే న్యూరోహార్మోనల్ స్రావాల గురించే. డోపామిన్, ఎండార్ఫిన్, ఎన్‌కెఫెలిన్ మరియు హిస్టమిన్ వీటిలో ముఖ్యమైనవి. ఇవి నేరుగా మనసుతో సంబంధము కలిగి ఉంటాయి. ఆలోచనా విధానాన్ని ఉత్తేజితం చేసి మనిషిని తేజస్విగా, మనస్విగా తయారుచేస్తాయి. ఈ ప్రక్రియ మొత్తం జరిగే మనోక్షేత్రమును విశిష్టముగా తయారుచేసే ఐదు న్యూరోలాజికల్ సిస్టమ్స్ ఉన్నాయి. 1) రెటిక్యులర్ యాక్టివేటింగ్ సిస్టమ్ 2) బ్రెయిన్ న్యూక్లియై 3) థెలామస్ 4) హైపోథలామస్, 5) మెడుల్లా–స్పైనల్‌కార్డ్. ఇవి స్థూలశరీరములోనే ఉంటాయి. కానీ స్థూలమైన ప్రయత్నముల ద్వారా వీటిని మనం పనిచేయించ లేము. కానీ సూక్ష్మసామర్థ్యము యొక్క స్పర్శ తగలగానే వీటిలో కదలికలు పెరిగిపోయి నిద్రాణంగా ఉన్నవన్నీ జాగృతమౌతాయి. వెంటనే మానవుడు ఆధ్యాత్మిక క్షేత్రములో తన బలమును చూపించడం మొదలుపెడతాడు.

ఈ ప్రయోగము ద్వారా వ్యక్తి అందరికి ప్రయోజనమును, హితమును కలిగించే మహత్వపూర్ణమైన కార్యములు చేసి చూపిస్తాడు. ఈ గుహ్యశక్తులను తట్టిలేపి విశిష్టవ్యక్తులను తయారు చేసేందుకు మహాబలశాలురైన వీరభద్రుల ఆవశ్యకత చాలా ఉన్నది. ఈ ప్రయోగము ద్వారా పాత్రత కలిగిన నిష్ఠావంతులు బలహీన స్థితిలో ఉన్నప్పటికి బలవంతులవలె పనిచేయగలరు.

**మురికి నీటితో ఉతికిన దుస్తులు పూలతోటలో ఆరేసినంత మాత్రాన శుభ్రపడవు.**

పూర్వము వీటి ప్రయోగమును సంక్షిప్తంగా, స్వల్పంగా పరిమిత పరిధిలోనే చేసేవారు. సమయము యొక్క ఆవశ్యకత కారణంగా ఈనాడు వరిష్ఠులైన వ్యక్తుల తలుపులు తట్టవలసిన అవసరం ఏర్పడింది.

ఇతిహాసంలో మనకు ఇటువంటి సంఘటనలు ఎన్నో కనిపిస్తాయి. ఒక పక్క శక్తిసాధనల అవసరమేర్పడిన ఆయా సందర్భాల్లో వ్యక్తులు ఆదర్శవంతులైనప్పటికి తమ పరాక్రమమునకు పరీక్ష పెట్టబడినప్పుడు తికమకపడిపోతారు. మరోపక్క సామాన్యమైన స్థితిలో ఉన్నవారు కూడా తమ శారీరిక, మానసిక స్ఫూర్తిని, తెలివితేటలను ఉపయోగించి పనులు చక్కపెట్టిన సందర్భాలు చూసేవారిని ఆశ్చర్యచకితులను చేస్తాయి. బుద్ధుడు, గాంధీలిరువురు ఈ రకమైన వ్యక్తిత్వాలే. వీరు తమకు ఎటువంటి తోడ్పాటు లేనప్పటికి అసామాన్య కార్యములను చేసి చూపించారు. ఈ తేడా అనేది బాహ్యంగా లేదు, అంతరంగములో ఉన్నది. ఇటువంటి అంతరంగములను ఇతరుల ద్వారా కూడా తయారు చేయవచ్చు. యుగపరివర్తన చేయాలంటే ఇటువంటి విశిష్ట వ్యక్తుల అవసరం చాలా ఎక్కువగా ఉంటుంది.

సమయానుసారంగా వచ్చే పరివర్తన ఒక పని. ఇదికాక స్వభావములో స్థిరమైన పరివర్తన తీసుకురావడమనేది వేరుగా చేయాల్సినపని. వాల్మీకి, అంగులీమాలుడు, అజామిళుడు, మొదలైనవారు జన్మతః దుష్టప్రవృత్తి కలవారు కానీ వారిలో అసాధారణమైన ఆశ్చర్యకరమైన పరివర్తన వచ్చింది. ఇటువంటి పరివర్తన బ్రాహ్మీచేతన ప్రేరణవలననే సాధ్యమౌతుంది. ఆ చేతనత్వం నేరుగా మానవుని సూక్ష్మవిద్యుత్ ధారలపై ప్రభావమును చూపించి వారిలో అసాధారణ మార్పును తీసుకు వస్తుంది. వైజ్ఞానిక దృష్టితో చూస్తే ఇది బయోఎలక్ట్రిసిటీకి సంబంధించినది. ఐదు విద్యుత్‌క్షేత్రాలలో ఇటువంటి క్రియాశీలక పరివర్తనలు మనం చూడవచ్చు. అవి **1. ప్లెక్సెస్ ఎలక్ట్రిసిటి, 2. న్యూరోనల్ ఎలక్ట్రిసిటి, 3. సెల్యులర్ ఎలక్ట్రిసిటి, 4. కండక్షన్ ఎలక్ట్రిసిటి, 5. ఫేషియల్ ఆక్యులర్ ఎలక్ట్రిసిటి.** సాధారణ భాషలో అర్థము చేసుకోవాలంటే ఇవి చక్ర-ఉపత్యికల సంబంధిత విద్యుత్, నాడీసంస్థానాలన్నింటిలోను నిరంతరము ప్రవహిస్తూ జీవ కోశములలో సక్రియంగా ఉండే విద్యుత్, హృదయము యొక్క ముఖ్యమైన కోశములలో లేదా పేస్‌మేకర్‌లలో క్రియశీలక విద్యుత్‌ను, ముఖము కళ్ళల్లో నిరంతరము ప్రవహించే విద్యుత్ప్రవాహాలుగా చెప్పుకోవచ్చు. కొన్ని విశేష ఉపకరణాల ద్వారా వీటిని తయారుచేసుకోవచ్చు. ఈ ప్రవాహాలనే ఎనర్జీలు అని అంటారు. వీటినే ఆధ్యాత్మిక క్షేత్రములో ఓజస్సు, తేజస్సు, వర్చస్సులనే పేర్లతో పిలుస్తాము. మన శరీరములో రక్తమాంసముల కన్నా వీటి ఉనికి చాలా విలువైనది, మహత్వ పూర్ణమైనది. ఇవి క్షీణిస్తే వ్యక్తి ప్రభావహీనుడై, దుర్బలుడై, నిస్తేజుడైపోతాడు.

మనిషి సద్గుణములు, సత్ప్రవృత్తులతో కూడి సన్మార్గములో నడిచేందుకు కావలసిన పరాక్రమమును పెంపొందించుకోవచ్చు. అదే విధంగా దుర్గుణముల పట్ల పెరుగుతున్న ఉత్సాహమును కూడా తగ్గించి, శాంతపరచి తీసివేయవచ్చు. ఇందుకొరకు హార్మోన్లు ఒక తాళంచెవి వలె పనిచేస్తాయి. ఇవి గ్రంధులనుండి నేరుగా రక్తములోనికి స్రవించే స్రావాలు కావడంవల్ల తమ ప్రభావాన్ని త్వరగా చూపించగలుగుతాయి. ఇవి పెంచుట, తగ్గించుట అనే రెండు రకాల పనులనూ చేయగలవు. శరీరములో వుండే హార్మోన్లను ప్రభావితము చేసే ప్రధానగ్రంధులు, వాటినుండి స్రవించే రస-ద్రవ్యాలు ఇలా ఉన్నాయి. 1. పీనియల్ - మెలటోనన్, 2. పిట్యుటరీ - సోమెటోట్రాపిక్ హార్మోన్, 3. థైరాయిడ్ - థైరాక్సిన్, 4. ఎడ్రినల్ - ఎ.సి.టి.ఎచ్, 5. గొనెడ్స్ - టెస్టోస్టిరాన్, ఈస్ట్రోజెన్. ఈ ఐదవ దానిలో మొదటిది పురుషులకు సంబంధించినది (టెస్టోస్టిరాన్), రెండవది స్త్రీలకు సంబంధించినది (ఈస్ట్రోజెన్). ఈ హార్మోన్లు తగ్గిపోతే ఆ వ్యక్తి శారీరికంగా, మానసికంగా, ప్రజననపరంగా శక్తిహీనుడౌతాడు. అతనికి ఏ పనిలోను ఉత్సాహము ఉండదు. మిగిలిన హార్మోన్లకు కూడా ఈ పరిస్థితే వర్తిస్తుంది. అవి ముఖ్యంగా మానవుని కర్మనిష్ఠునిగా, ఓజోవంతునిగా, స్ఫూర్తివంతునిగా మార్చి పరిపక్వ స్థితికి చేర్చేందుకే పనిచేస్తూ ఉంటాయి. వ్యక్తిలోని దుష్ప్రవృత్తులలో దేనిని నాశనము చేసేందుకు ఏ హార్మోను, ఏవిధంగా ప్రయోగించాలో అనుభవజ్ఞులైనవారు మాత్రమే చేయగలరు. **ఆత్మచేతన యొక్క స్థితికి అనుగుణంగా, పాత్రతను చూసి కావలసిన పరివర్తన తీసుకురాబడుతుంది.**

ముందుగా చెప్పినట్లు మానవునిలో కనిపించే శక్తి అతని రక్తమాంసాలు, నాడీ సంస్థానాల వల్ల వచ్చింది కాదు, ఈ ఐదు రకాల జీవవిద్యుత్ సూక్ష్మప్రవాహాల వల్ల వచ్చింది. ఈ ఐదు విద్యుత్ప్రవాహాల మీదనే మానవుని ప్రతిభ, వ్యక్తిత్వము యొక్క నిర్మాణము జరుగుతుంది. తాంత్రిక ప్రయోగములలో ఈ శక్తిధారలను నీరసింపజేస్తారు.

**ఎవరి వంశపరంపరనైనా సమర్థవంతంగా చేయాలన్నా బలహీనపరచాలన్నా జీన్స్‌ను ప్రభావితం చేయాలి.** జీన్స్‌లో ఐదు పొరలున్నాయి. 1) ఎండోస్పియర్, 2) ట్రోపోస్పియర్,

ప్రపంచం బాగాలేదని నిందించడం కాదు. ఆ బాగేదో ముందు నీలో వస్తే అంతా బాగున్నట్టే.

3) స్ట్రాటోస్ఫియర్, 4) అయనోస్ఫియర్, 5) ఎక్సోస్ఫియర్. మేఘాలు, ధూళికణాలు, జెట్ స్ట్రీమ్ మొదలైనవన్నీ స్ట్రాటోస్ఫియర్, పృథ్వి మధ్యలో ఉంటాయి. ఓజోన్‌పొర, రేడియోకిరణాలు, కాస్మిక్ తరంగాలు, సూక్ష్మకిరణాలు, కణాలు మరియు తరంగాలు ఎక్సోస్ఫియర్‌లో ఉంటాయి. ఖగోళశాస్త్ర విజ్ఞాన పద్ధతుల ద్వారా చిన్న చిన్న పొరలను మార్చడం సంభవమౌతుంది. కానీ ప్రళయము, ఖండప్రళయము వంటి ఆకస్మికవిపత్తులు, అణు ఆయుధముల వల్ల ఏర్పడే విషమసంకటముల వల్ల ఈ పొరలలో విపరీతమైన అలజడి కలిగి భయోత్పాతమును కలుగచేస్తాయి. వాటిని సరిదిద్దడం ఆధ్యాత్మిక విజ్ఞానము వల్లనే సాధ్యపడుతుంది. ఆ పనిచేసే శక్తినే వైజ్ఞానిక వీరభద్రుడని పిలుస్తాము. వీరిని చేతనా జగత్తు యొక్క శక్తివంతమైన సామర్థ్యములుగా గుర్తించాలి.

మానవశరీరము ఒక చిన్న పిండము. ఇందులో బ్రహ్మాండము యొక్క సంక్షిప్తసారమంతా ఇమిడి ఉన్నది. ఇంతకుముందు వర్ణించిన విధముగా శరీరము యొక్క ఐదు సామర్థ్యములను బ్రహ్మాండమంతా వ్యాపించిన సమిష్టిగత శక్తుల సంక్షిప్త సంస్కరణలుగా అర్థము చేసుకోవాలి. అవే జీవవిద్యుత్, జీవ అయస్కాంతము, సృజనాత్మకశక్తి, వికిరణములు, నిరోధకశక్తి. ఈ శక్తులన్నింటినీ జీర్ణించుకోగలిగే యోగ్యులైన, సామర్థ్యము కలిగిన వ్యక్తుల పాత్రతను, మొత్తము సముదాయమంతటి పాత్రతను వికసింపచేసేందుకై గురుదేవులు సూక్ష్మీకరణసాధన చేస్తున్నారు. ఈ ఐదు శక్తులను ఆయన ఒక సంవత్సరములోనే వికసింపచేసుకొని పంచవీరభద్రులని నామకరణము చేశారు. ఇవి ఎంత పరిమాణములో జాగృతమై సశక్తమౌతుంటాయో అదే అనుపాతములో పాత్రత కలిగిన వ్యక్తులు ఆయనకు లభిస్తూనే ఉంటారు. అదే నిష్పత్తిలో యుగపరివర్తనకు కావలసిన అనేక ప్రయోజనాలలో వీరిని చక్కగా నియోగిస్తారు. ఆ విధంగా వారు ఆయనకు ఉపయోగపడతారు.

**దేవమానవులను సృష్టించడం, వాతావరణాన్ని సంశోధించడం, కల్మషాలను నిర్మూలించడం, నవసృజనకు ఉపయోగపడే సాధనాలను ఉత్పన్నము చేయడము, ఆవరించి ఉన్న సంకటములనే కారుమబ్బులను చెదరగొట్టడం వంటి ఎన్నో పనులను సమయానుసారముగా, ఆవశ్యకతలననుసరించి వీరభద్రుల ద్వారా చేయించడం జరుగుతుంది.** ఎప్పుడు ఏ ప్రయోజనము కొరకు ఎంత పనిచేయాలో సమయమే మనకు చెప్తుంది.

ప్రస్తుతము వీటి జాగరణ సాధన జరుగుతున్నది. ఒకటిని ఐదుగా విభజించడం జరుగుతున్నది. ఇది చాలా కఠినతరమైన కార్యము. ఇందుకొరకు అన్నివైపుల నుండి దృష్టిని లోపలికి కేంద్రీకరించి మౌనంగా ఉండడమనే ప్రక్రియ జరుగుతున్నది. రాబోయే వసంతపంచమికి ఈ వీరభద్రుల సహాయముతో కావలసిన లక్ష్యములను పూర్తిచేయగలిగే దిశగా ముందడుగు వేస్తామని ఆశిస్తున్నాము.

*– అఖండజ్యోతి, డిసెంబరు 1984*

*అనువాదం: శ్రీమతి వల్లీశ్రీనివాస్*

## ఇద్దరం కలసి నడుద్దాం

*సుభద్రాకుమారి చౌహాన్ ప్రయాగలో ఒక రాజపుత్రుల వంశంలో జన్మించింది. అప్పటి ఆచారం ప్రకారం ఆమె వివాహం ఖాండవకు చెందిన లక్ష్మణ్‌సింహతో జరిగింది. ఆమె బాల్యం నుండి విద్యాభిమాని. వివాహం తరువాత కూడా ఆమె తన చదువును కొనసాగిస్తానని భర్తను కోరింది. ఆనందంగా ఆయన ఆమెను కళాశాలలో చేర్పించాడు. ఈ వ్యవధిలోనే ఆయన తన వకీలువిద్యను పూర్తిచేశాడు. విద్యాధ్యయనం తరువాత ఇద్దరు బాగా ఆలోచించి చదివిన చదువుకు సార్థకత లభించాలంటే, పొందిన జ్ఞానంతో దేశసేవచేయాలని నిర్ణయించుకున్నారు. కాంగ్రెస్ ఆందోళన తీవ్రంగా జరుగుతున్న ఆ రోజుల్లో ఇద్దరు జెండా సత్యాగ్రహంలో పాల్గొని ప్రప్రథమంగా జైలు జీవితం గడిపారు.*

*తరువాత ఖాండవాలోని 'కర్మవీర' అనే వారపత్రికకు ఆయన సంపాదకుడుగా పని ప్రారంభించారు. మాఖన్‌లాల్ చతుర్వేది ఆ పత్రికయొక్క సంచాలకుడు. భార్యాభర్తలిద్దరిలో ఒకరు పత్రిక సంపాదకత్వం ద్వారా లభించిన సొమ్ముతో ఇల్లు గడుపుతూ, రెండవవారు ఉద్యమాలలో పాల్గొంటూ కారాగారమునకు వెళ్తూ, వస్తూ ఉండేవారు. ఈవిధంగా చాలా సంవత్సరాలు గడిచాయి. ఈ వ్యవధిలో సుభద్రాకుమారి ప్రతిభ అనేకరెట్లు వికసించింది. ఉన్నతస్థాయికి చెందిన లెక్కలేనన్ని కవితలు, కథలు, వ్రాయసాగింది. అవి విశ్వ విఖ్యాతి గడించాయి.*

*"ఖూబ్‌డీ మర్దానీ వన్‌తో ఝాంసీవాలీ రాణీ థీ" అనే కవిత సుభద్రాకుమారి కలంనుండి వెలువడినదే. ఈ దంపతులు కలసి లెక్కలేనన్ని సమాజసేవా కార్యక్రమాలు నిర్వర్తించారు. కుటుంబధర్మ నిర్వహణతోపాటు దేశసేవ చేసిన అనుపమ దంపతుల అద్భుత ఉదాహరణ ఇది.*

– ప్రజ్ఞాపురాణం నుండి

**తెలియనిది అడిగితే బయటపడే అజ్ఞానం కొద్దిసేపే. అడగకపోతే జీవితాంతం అజ్ఞానమే.**

ఆదిశక్తి యొక్క లీలాకథలు - 19

# తత్సవితుర్వరేణ్యాం యొక్క మర్మం

ఆదిశక్తి లీలాకథ (శ్రీదుర్గాసప్తశతి) యొక్క ప్రథమచరిత్ర గాయత్రీ మంత్ర సాధన యొక్క మొదటి చరణము. తత్పరంగా ఈ కథాంశము త్రిపదా అయిన గాయత్రీ మంత్ర ప్రథమ చరణము 'తత్సవితుర్వరేణ్యాం' యొక్క విపుల వివరణయే. గాయత్రీ సాధనలో సాధకుని స్థితి ఎలా ఉంటుంది? పరిస్థితులు మరియు మనః స్థితి యొక్క ఏయే అవరోధములను సాధకుడు ఎదుర్కొనవలసి వస్తుంది? దీని యొక్క అత్యంత రమణీయమైన వర్ణన ఈ కావ్యకథలో చెయ్యబడినది. తన ఈ అవరోధముల నివారణకు, వాటి తొలగింపునకు ఆధ్యాత్మిక సాధకునకు సద్గురు ప్రాప్తి కలుగుతుంది. గురువే సాధకునకు మహామాయాతత్త్వమును – గాయత్రి యొక్క సత్యమును ప్రబోధించినప్పుడు శిష్యుని సాధన యొక్క ప్రథమ చరణము ప్రారంభమౌతుంది.

ఈ ప్రథమ చరణంలో సాధకుడిని తమస్సు నలుచెరగులా చుట్టుముడుతుంది. ఈ మహాంధకారం యొక్క సంతానము సాధకుని తీవ్ర అభిలాషను, ఆధ్యాత్మిక మనస్సును మ్రింగి వేయాలనుకుంటాయి. అప్పుడు అతని ఆధ్యాత్మిక మనస్సు గురు మంత్రమును స్మరిస్తుంది. అంతేకాక గాయత్రీమహామంత్ర ప్రథమ చరణ అధిష్ఠాత్రి యైన ఆదిజననిని, ఆ పరమాత్మను ఎలుగెత్తి పిలుస్తుంది. 'హేమాత! ఈ అంధకారము భయమును గొలుపుతున్నది, అంతా అగమ్యగోచరముగా ఉన్నది. స్వయంగా పరమేశ్వరుడు కూడా యోగనిద్రలో మునిగియున్నాడు. ఇటువంటి స్థితిలో సాధనకు అవరోధము కలిగించే అసురుల సంహారము ఎవరు చేస్తారు?' అని ఆర్తితో ప్రార్థిస్తాడు. సాధకులకు ఒక సత్యము ఎప్పుడూ చిరపరిచితమైనదే! వాక్కు ఒక్కొక్కసారి వినిపించకపోవచ్చు, కానీ ఆర్తితో కూడిన తీవ్ర ఇచ్ఛ మహాదేవికి వినిపించకపోవటమనేది ఎక్కడా ఉండదు. ఆదిశక్తి గాయత్రి మహామాయ, మహాకాళీ రూపు ధరించి కాళికయై తమస్సును పటాపంచలుచేస్తుంది.

అప్పుడు యోగనిద్రావశుడైన పరమేశ్వరుడు అట్టహాసం చేస్తూ అసురులతో సంవాదం చేస్తాడు. తమస్సు యొక్క ఈ సంతానము మహామాయ కృపతో స్వయంగా తమస్సునకు అధీనమై మోహితులౌతారు. ఈ స్థితిలో వారు వరదాత అయిన పరమేశ్వరుడినే వరము కోరుకోమని అంటారు. ఈ వరదానముతో అసుర సంహారం జరిగి సృష్టికి అంకురార్పణ ఆరంభమౌతుంది. ఈ సంపూర్ణ కథ శ్రీదుర్గాసప్తశతి యొక్క మంత్రకావ్య ప్రథమ చరిత్రలో గానం చెయ్యబడినది. ఇదే సూత్రరూపంలో తత్సవితుర్వ రేణ్యాంలో ఇవ్వబడింది. గాయత్రీ మహామంత్ర ప్రథమ చరణములో ఈ సత్యమును అన్వేషించినప్పుడు మంత్రకథా స్వరం స్వయంగానే సాధకుని చేతనలో ప్రతిధ్వనిస్తుంది.

గాయత్రీ మహామంత్ర ప్రథమచరణములో కేవలము మూడు శబ్దములే ఉన్నాయి. అవి 1) తత్ 2) సవితుః 3) వరేణ్యాం. వీటిలో మొదటి రెండు శబ్దములు పరమాత్మ యొక్క ద్వివిధావస్థలను గోచరింపజేస్తాయి. మూడవ శబ్దములో ఆధ్యాత్మిక సాధకుని తీవ్ర ఇచ్ఛ, శరణాగతుల భావనలు అంతర్లీనంగా ఉంటాయి. ఏ ఆధ్యాత్మిక సాధకుని జీవితంలోనైనా అతని ప్రాపంచిక సంపదతో అనుబంధం తెగిపోయినప్పుడు యోగదృష్టి పరంగా ఆ క్షణములు పుణ్యప్రదములై ఉంటాయి. బుద్ధికి ఎవరైనా సద్గురువు లభ్యమై, ఆ సద్గురువు వారికి గాయత్రీమంత్ర దీక్ష నిచ్చి, వారికి ఆదిశక్తి యొక్క తాత్త్విక రహస్యమును బోధించి నప్పుడే వారి సాధన ఆరంభమౌతుంది. ఈ సమస్త విషయములు గాయత్రీమంత్ర పృష్ఠభూమి రూపంలో ఈ ప్రథమ చరిత్రలో వర్ణించబడినవి.

గాయత్రీమంత్ర ప్రథమచరణంలో దీని తదుపరి విషయములను ఆధ్యాత్మిక సాధకుని ఆధ్యాత్మిక మనస్సు నెమ్మదిగా ఒక క్రమంలో సాక్షాత్కరింపజేసుకుంటుంది. ఈ క్రమంలో పరమాత్మ యొక్క దర్శనానుభూతిని సాధకుడు నిర్విశేష యోగనిద్రలో మునిగిన స్థితిగా అనుభవిస్తాడు. ఇదే 'తత్' శబ్ద యోగరహస్యం. ఈ స్థితిలో భగవంతుడు భక్తునకు సహాయపడడు. ఎందుకంటే సాధకునిలో అతని క్రియాశక్తి అంతర్లీనంగా ఉంది. సాధకుని ఆధ్యాత్మిక మనస్సు ఆదిశక్తిని ఎలుగెత్తి పిలుస్తూ, ఆమె శరణుజొచ్చినప్పుడే తమస్సు దూరమౌతుంది. వరేణ్యాం – శబ్దములో ఈ భావమే దాగివుంది. వరేణ్యాం యొక్క సాధనా ప్రభావం వలన పరమాత్మ రూపంలోనే తత్ నుండి సవితుః యొక్క సత్యం ప్రకటితమౌతుంది. భగవంతుని క్రియాశక్తి తమోగుణ వినాశకుడైన సవితాదేవుని రూపంలో ప్రత్యక్షమౌతుంది.

**కదలకుండా కూర్చుంటే కల కరిగిపోతుంది. ఆచరణకు పూనుకుంటే స్వప్నం సాకారమవుతుంది.**

సవిత యొక్క శక్తి సావిత్రి, ఆమెయే మహాకాళి, కాళరాత్రి. కాళీమాత కృపచేత కుండలినీ జాగరణ అనే మహత్కార్యం సంపూర్ణమౌతుంది. ఆమె గర్భం నుండే సృష్టి ఆవిర్భవిస్తుంది. యోగసాధకుని అంతఃకరణంలో ఆధ్యాత్మిక ఉషోదయం దర్శనమిస్తుంది.

ఆదిశక్తి లీలాకథ యొక్క ఈ ప్రథమ చరిత్రలో పలు చరిత్రలు ఉన్నాయి. వాటికి తమవైన లోతైన ఆధ్యాత్మిక అర్థములున్నాయి. కథ యొక్క ఈ వివిధ చరిత్రలలో 1) మార్కండేయ మహర్షి 2) రాజా సురథుడు 3) సమాధి వైశ్యుడు 4) మహామాయ తత్త్వమును బోధపరిచే మేధా ఋషి ఉన్నారు. ఈ చరిత్రలలో గాయత్రీ సాధకుని సాధన యొక్క ఆరంభ భూమిక వర్ణించ బడినది. దీని తరువాత 5) విష్ణు భగవానుడు 6) విష్ణువు కమలనాభి నుండి ఆవిర్భవించిన బ్రహ్మ 7) మధువు 8) కైటభుడు అనే రాక్షసులు ఉన్నారు. వీరు సాధకుని సాధనకు అవరోధములను కల్పిస్తారు. 9) భగవతి కాళరాత్రి, మహాకాళి ఉన్నది. ఆమె ఈ సంపూర్ణ చరిత్రకు అధిష్ఠాత్రి.

ఈ వివిధ చరిత్రల ఆధ్యాత్మిక చర్చలను చేస్తే వీటన్నింటినుండి తత్త్వజ్ఞాన ప్రకాశకిరణాలు వెదజల్లబడతాయి. ఈ కథా భాగపు ప్రథమ చరిత్ర మార్కండేయ ఋషిది. మార్కండేయ మహర్షి ఈ సంపూర్ణ కథలో ఎక్కడా కూడా ఏవిధమైన పాత్రను పోషించరు. ఆయన కేవలము కథను వివరిస్తారు. ఆయన ఈ కథకు సూత్రధారులు. పురాణాలలో మార్కండేయ మహర్షి జీవితకథను వెతికితే ఆయన భగవంతుడైన మహాకాలుడిని ఆరాధించారు, మహాకాలుని కృపతో ఋషి శివాంశునిగా, శివస్వరూపునిగా రూపుదాల్చారు అని తెలుస్తుంది. ఈవిధంగా ఋషి ఈ సంపూర్ణకథను మహాకాలుని అంశగాను, ఆయన ప్రతినిధిగాను ఉండి కథను వినిపిస్తారు. నిజంగానే మహాకాలుని అంశ, ఆయన స్వరూపమే సాధకుని చేతనలో మరియు సమస్త సృష్టిని ఆవరించియున్న భగవతి లీలాకథకు సాక్షి. ఆయనయే వక్తగా ఉంటాడు, అలా ఉన్నాడు కూడా!

కథ యొక్క ప్రథమచరిత్రలో రాజా సురథుని చరిత్ర రెండవది. పృథ్వీతత్త్వ ప్రధానమైన ఈ శరీరమునకు స్వామి జీవాత్మ. అది ఆసురీశక్తుల చేతిలో ఓడిపోయి, హతాశయైన స్థితిలో పడియున్నది. సమాధివైశ్యునిది తృతీయచరిత్ర. ఇతను బుద్ధికి సంకేతము. బుద్ధి 'మనస్సు, ఇంద్రియములు' అనే తన కుటుంబసభ్యులచేతనే తిరస్కరింపబడి, బహిష్కృతమైనది. చతుర్థ చరిత్ర మేధాతిథిది. ఋషి ఆశ్రమము వింధ్య పర్వత శ్రేణులలో ఉంది. అది సాధకుని హృదయస్థానమునకు సంకేతము. ఇక్కడ నివాసముంటున్న మేధాఋషి వాస్తవానికి యోగసాధకుని అంతర్‌ప్రజ్ఞకు ప్రతీక. ఈ అంతర్‌ప్రజ్ఞ సాధకుని జీవితంలో సద్గురువు పాత్ర పోషిస్తుంది. అంతర్‌ప్రజ్ఞతో గాయత్రీ తత్వ ప్రబోధమును పొంది రాజా సురథుడు, సమాధివైశ్యుడు సాధన చేస్తారు. జీవాత్మ మరియు బుద్ధిల సాధనారూపంగా తపస్సు, ధ్యానము అనే రెండు సాధనలు ఆరంభమౌతాయి.

ఈ సాధనలో మేధాఋషి ద్వారా చెప్పబడిన సత్యము సాక్షాత్కరిస్తుంది, ప్రకటీకృతమౌతుంది. అది ఐదవ చరిత్ర. సత్యము స్వయంగా పరమాత్మ స్వరూపము. ఆధ్యాత్మిక సాధకుడు తన శ్రద్ధ మరియు విశ్వాసంతో దీనిని అనుభూతి చెందుతాడు. దీని అంశ తరువాతది అయిన ఆరవచరిత్రకు చెందినది. అనగా బ్రహ్మకు సంబంధించినది. గాయత్రీ సాధకునిలో ఆధ్యాత్మిక మనస్సు అనగా బ్రహ్మ యొక్క అనుభూతి కలుగుతుంది. మధు–కైటభులు అను ఇద్దరు అసురులు ఈ మనస్సును పీడిస్తుంటారు. వీరు వరుసగా మోహము-భయములకు సంకేతము. వీరు సాధకుని సంపూర్ణ సాధనను భగ్నం చేయాలని అనుకుంటారు. అప్పుడు సద్గురువు ద్వారా గాయత్రీ తత్వబోధన పొందిన ఆధ్యాత్మిక మనస్సు ఆదిశక్తి పరమేశ్వరిని ఆర్తితో పిలుస్తుంది. పరమేశ్వరి కృపతో తమస్సును హరించివేస్తుంది. భగవంతుని సవితారూపం దర్శనమిస్తుంది. తక్షణమే విఘ్ననివారణ జరిగి, తత్ఫలితంగా సాధకుని చేతనలో ఆధ్యాత్మిక ఉషోదయం దర్శనమిస్తుంది. ఈ కథ, సత్యముల సుస్పష్ట విపుల వివరణ రాబోయే భాగాలలో పాఠకులు చదువగలరు. వీటి ద్వారా గాయత్రీ సాధకులు గాయత్రీ సాధనా మర్మమును అవగతం చేసుకొనగలరు.

*– అఖండజ్యోతి, జులై 2008*

*అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*


**యుగశక్తి గాయత్రి**

**మాస పత్రిక చదవండి !**

**చదివించండి !!**


**ఎంత శిక్షణ ఇచ్చినా గాడిద యుద్ధరంగానికి పనికిరాదు.**

ప్రపంచ వింతలు

# ఇప్పటికి మనం పిరమిడుల రహస్యాన్ని తెలుసుకొనలేకపోయాం

గ్రీసులోని గొప్ప పిరమిడులు తమ సౌందర్యం మరియు నిర్మాణశైలి కారణంగా ఈనాడుకూడా ప్రపంచమునకు ఆకర్షణా కేంద్రాలుగా నిలిచి ఉన్నాయి. వీటి రహస్యాలు ఇప్పటికి తెలుసుకోలేకపోయాము. వీటి మాయాజాలపు రహస్య పరదాలు అలాగే ఉన్నాయి. సమాధుల (మమ్మీల)ను సురక్షితంగా ఉంచే ఈ పిరమిడ్స్ అనేక పరిష్కరింపబడని పొడుపుకథలు, పుకార్లు అద్భుతంగా మరియు ఆశ్చర్యకరమైనవిగా ఉన్నాయి. మానవీయ సభ్యత ఉదయించిన సమయాన నిర్మించబడిన ఈ పిరమిడులు నేటి అధునాతనమైన విజ్ఞానానికి గొప్ప సవాలుగా నిలిచాయి. ఎందుకనగా ఈనాటి జ్ఞానవిజ్ఞానములు వీటి రహస్యాల చిక్కుముడులను విప్పలేకపోతున్నాయి, పిరమిడుల వంటి నిర్మాణాలను గావించలేకపోతున్నాయి. ఈ కారణంగానే 1798లో నెపోలియన్ ఈజిప్టు మీద ఆక్రమణ చేసినప్పుడు ఈ రహస్యాలతో కూడిన పిరమిడులను చూసి అతను గర్వంతో ఇలా అన్నాడు. 'సైనికులారా! ఈ పిరమిడుల శిఖరాలు 40 శతాబ్దములను మనకు పరిచయం చేస్తున్నాయి.'

ఈజిప్టు పిరమిడులను ప్రపంచంలోని 7 వింతలలో లెక్కిస్తారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే వీటిని ఇప్పటివరకు తెలుసుకోలేదు, అర్థం చేసుకోలేదు. అందువలన వీటిపట్ల, 'రోమాంచితం గావించే రహస్యాలను దాచుకున్న కట్టడాలలో ఏమున్నది?' అనే జిజ్ఞాస రేగుట స్వాభావికమే. మరణానంతరం పరలోకంలో జీవితాన్ని తయారు చేసుకునేందుకు తీవ్రతరమైన ఆకాంక్ష, తీవ్ర వాంఛతో, విశాలమైన ఈ పిరమిడులను నిర్మించి 45 శతాబ్దాలు గడిచినప్పటికి, ఈ సుదీర్ఘకాలావధితోపాటు వీటి రహస్యాల లోతులు కూడా పెరుగుతూనే ఉన్నాయి. నిశ్శబ్దతతో నిండిన విశాలమైన ఎడారులలో అతి పెద్ద రాతిబండలను ఎంతో దూరంగా ఉన్న పర్వతపంక్తులనుండి తీసుకొనివచ్చి వాటితో రేఖాగణిత ప్రక్రియద్వారా గావించిన అద్భుతమైన పిరమిడుల నిర్మాణం, గడచిన కాలపు మానవీయ మేధస్సుకు సాక్ష్యంగా నిలుస్తున్నాయి, దానితోపాటే ఆధునిక విజ్ఞానవేత్తలకు పరిశోధనా వస్తువులుగా ఉన్నాయి. ఆశ్చర్యమును రేకెత్తించే ఈ నిర్మాణాల దిశాధారను ఇప్పటివరకు సరైన రీతిలో తెలుసుకుని, అర్థం చేసుకోలేదు.

కాహిరాలో ఉన్నతమైన పిరమిడులతో పాటు వేరువేరు ఆకారాలు గల 67 పిరమిడులు అక్కడక్కడా చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. వీనిలో కేవలం గిజాలోని గ్రేట్ పిరమిడే ప్రపంచంలోని 7 వింతలలో లెక్కించబడుతున్నది. ఈజిప్ట్‌లోని ప్రాచీనమైన రాజవంశపు 40వ తరానికి చెందిన రెండవ చక్రవర్తి ఖుఫు 4500 సంవత్సరాలకు పూర్వం వీటి నిర్మాణం కావించాడు. ఈ పిరమిడులతోపాటు మరో రెండు చిన్న పిరమిడులు నిర్మించబడ్డాయి. ఖుఫు యొక్క కుమారుడు మరియు మనవల కొరకు ఇవి తయారుచేయబడ్డాయని భావిస్తారు. 481 అడుగుల ఎత్తుగల ఈ చతురస్రాకార పిరమిడులో ఖుఫు సమాధి ఉన్నచోట పలు విశాలమైన గదులున్నాయి. వీటిలో ఒకటి రాజుగారి గది. అక్కడే ఖుఫు సమాధి ఉంది. సరిగ్గా దీనికి క్రిందన రాజుగారి గదికంటే కొంచెం చిన్నదైన రాణి యొక్క గది ఉంది. ఈ విశాలమైన గది (రాజుది) తన విశాలత కారణంగా అద్భుతమైనదే కాక, దీనికున్న రెండు సొరంగాలుకూడా అత్యంత ఆశ్చర్యకరమైనవి. రెండు గదుల నుండి సాగే ఈ సొరంగమార్గాలు పైవైపున వంపు తిరిగి, చివరి అంచున మూసుకుని ఉంటాయి. ఈ సొరంగాల రహస్యం నేటికి అలానే నిలిచి ఉంది. వీటి వెనుక ఉన్న రహస్యమేమిటి? అనేది ఎవ్వరికి తెలీదు. ఇది పరిశోధనాకర్తలతోపాటు, జన మానసములకు కూడా కుతూహలమును కలిగించే విషయం.

యుగయుగాల నుండి ఈ పిరమిడులు మానవులను చకితులను గావిస్తూ వస్తున్నాయి. వీటియొక్క ఒక్కొక్క రాయి వేల సంవత్సరాల ఆకర్షణీయమైన చరిత్రను, కథలను-పుకార్లను తనలో నింపుకొని ఉన్నది. బాహ్య అంతరిక్షం నుండి వచ్చిన ఏలియన్స్ (aliens) ఇతర గ్రహాల నుండి వచ్చిన వారి పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఖుఫే బృహత్తరమైన పిరమిడులను నిర్మించాడు అనేది కొంతమంది విద్వాంసుల అభిప్రాయం. కొంతమంది పరిశోధకులు 'అట్లాంటిక్‌కి చెందిన ప్రజలు వీటిని నిర్మించారు' అని అంటారు. అట్లాంటిక్‌కి చెందిన ప్రజలే ఎలియన్సా? అనేది ఇప్పటికి ఒక రహస్యంగానే ఉంది. ఇలాంటి ఎన్నో ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ ప్రశ్నతో పోటీపడుతూ 'ఈ విశాలమైన గొప్ప కట్టడాల క్రింద మానవజాతి యొక్క చరిత్ర మరియు భవిష్యత్తు లిఖించబడి లేదుగదా?' అనే మరో ప్రశ్న తలెత్తుతున్నది. ఈ సందర్భంగా విశేషజ్ఞులు ఈ పిరమిడుల యొక్క ఆకృతి ఉత్తర-దక్షిణ అక్షాంశం మీద ఉన్న కారణంగా ఇవి బ్రహ్మాండంలో వ్యాపించి ఉన్న తెలిసిన, తెలియని శక్తులను ఉపయోగించుకుని, తమ లోపల ఒక శక్తివంతమైన వాతావరణాన్ని తయారు

**తోటివారితో కలసి నడుస్తూ, వారిని తన దారిలో నడిపించడమే నాయకత్వం.**

చేసుకొన్నాయని అభిప్రాయపడుతున్నారు. ఈ శక్తి జీవించి ఉన్న వాటిని, చనిపోయినవాటిని, జడములను - చైతన్యం కలిగిన అన్ని రకాలైన వస్తువులనూ ప్రభావితం చేస్తుంది. అందువలన జ్యోతిష్యశాస్త్రమును పరీక్షించుటకు, ఉపయోగించుటకు పిరమిడులు నిర్మించబడ్డాయని కొందరి అభిప్రాయం.

పిరమిడులలో ధనాగారం దాగి ఉన్న కారణంగా అనేకమంది వ్యక్తులు దానిని పొందుటకు ఆతురతతో ఉవ్విళ్ళూరారు. ఈ క్రమంలో క్రీ.శ. 820 లో అఖ్ ఖలీఫా అబ్దుల్లాహ్ అల్ మానూమ్ అనే వ్యక్తి ఖఫా యొక్క కోశాగారాన్ని వెదకటానికి కంకణం కట్టుకున్నాడు. అయితే పిరమిడుల యొక్క అనేక రహస్య మార్గములను ఛేదించలేని కారణంగా అతని కోరిక నెరవేరలేదు. ఇలాంటి ఎన్నో ప్రయత్నాలు ఫలించలేదు. 'ఏదియేమైనా ఈ పిరమిడులు ఏ పద్ధతిలో నిర్మించబడ్డాయి? తయారు చేయబడ్డాయి? వీటి రహస్యాలను మొట్టమొదట వర్ణన చేసి, అవగాహన కలిగించినవారు హెరోడోట్స్. ఈ గ్రీకు చరిత్రకారుడు క్రీస్తుకు పూర్వం 450 సంవత్సరాలకు మునుపు ఈజిప్టు యాత్ర చేసి, దాని ఆధారంగా 'ఒక లక్షమంది సైన్యం 20 సంవత్సరాల పాటు నిరంతరం పనిచేసి గిజాలోని గ్రేట్ పిరమిడ్‌లను నిర్మించారు' అని చెప్పాడు. అయితే తరువాత చెయ్యబడిన పరిశోధనల ఆధారంగా ఇది తప్పు అని నిరూపించబడినది.

ఆధునిక పరిశోధనల ఆధారంగా విజ్ఞానవేత్తలు 'ఫరోస్ ఈ పిరమిడుల నిర్మాణమునకుగాను ఒక లక్షమంది ప్రజలను పనులకు నియమించారు. కాని ఇలా సంవత్సరాలు కాక, కొన్ని నెలలలోనే పిరమిడులు నిర్మించబడి ఉండవచ్చునని చెప్పారు. గిజా పిరమిడుల డైరెక్టర్ జనరల్ డా॥ జాహీ హవాజ్ మరియు చికాగో విశ్వవిద్యాలయ వాస్తుశిల్పి మార్క్‌లెనర్‌లు వీటిని గూర్చి అందరికన్నా ఎక్కువ శ్రమ చేశారు. వీరి పరిశోధనా సారాంశంగా తేలినదేమనగా పిరమిడులను నిర్మించినది ఈజిప్టు వాసులేనని. పెద్ద బరువైన రాళ్ళను ఇంత ఎత్తునకు ఎలా చేర్చగలిగారు? దీనికి సంబంధించి మార్క్‌లెనర్, 'తఫలా' అనే పేరుగల సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. తఫలా అనేది ఒకరకమైన మట్టి. అది ఎండిపోయినప్పుడు అత్యంత కఠినంగా ఉంటుంది. కానీ తడిసినప్పుడు అత్యంత మృదువు (తేలిక) గా అవుతుంది. అలాంటి సమయంలో రెండు టన్నుల రాళ్ళనుకూడా తేలికగా జరుపవచ్చు. ఖెజర్ అభిప్రాయం ప్రకారం కూలివారు రెండు నుండి రెండున్నర టన్నులు గల 23,00,000 రాళ్ళను మూడు మూడు నిమిషాలలో ఒకే వేగంతో 147 మీటర్ల ఎత్తునకు చేర్చారు.

పెంటగాన్‌ను సైతం నిర్మించిన అమెరికాలోని డీ.ఐ.ఎం., జె.ఐ.ఎం. అను అతి పెద్ద నిర్మాణసంస్థ ఇలా స్పష్టీకరించినది. 4,000 నుండి 5,000 మంది కార్మికులు 20 నుండి 40 సంవత్సరాల లోపు ఇలాంటి పిరమిడులను నిర్మించగలరు. 481 అడుగుల ఎత్తున్న ఈ ఆశ్చర్యకరమైన పిరమిడులలో, అమెరికా లోని ఎంపాయిర్ స్టేట్ బిల్డింగ్‌తో పోలిస్తే రెండింతల సామగ్రి ఉపయోగించబడినది. గిజాలో ఉన్న మూడు పిరమిడులలో ఎన్ని రాళ్ళు ఉపయోగించబడ్డాయంటే - వీటితో ఫ్రాన్స్ యొక్క నలుదిక్కులా 10 అడుగుల (సుమారు 3 మీటర్లు) ఎత్తు, ఒక అడుగు (సుమారు 30 సెం.మీ.) వెడల్పు గల గోడను నిర్మించ వచ్చు. అతి పురాతనకాలంలో ఈ పిరమిడులను నిర్మించుటలో జ్ఞానం, టెక్నిక్స్ ఇంత అద్భుతమైన రీతిలో ఎలా ప్రయోగించ బడ్డాయి? అనే విషయాన్ని ఆలోచిస్తేనే ఆశ్చర్యం కలుగుతుంది. 20వ శతాబ్దంలోని వంతెనల రూపురేఖలతో సమానంగా పిరమిడుల బాహ్య సరిహద్దు గోడల రాళ్ళ లోపల (వాటిని అతుకుటకు) బాల్స్-సాకెట్స్ ఉపయోగించబడ్డాయి. ఇతర వస్తువుల వలెనే పిరమిడులు కూడా ఎండకు వ్యాకోచించి, చలికి సంకోచిస్తాయి. ఆశ్చర్యం కలిగించే విషయమేమిటంటే వీటిని నిర్మించుటలో భూకంప నిరోధం కూడా దృష్టిలో ఉంచుకొన బడినది. ఒకవేళ ఈ టెక్నిక్ సూక్ష్మతను లేక విధానమును దృష్టిలో పెట్టుకొనకుండా నిర్మించి ఉన్నట్లయితే ఇప్పటివరకు అవి నిలిచి ఉండేవికావు.

డా॥ టామ్కకిన్స్, డా॥ పాటర్, డా॥ విలశుల్ వంటి ప్రఖ్యాతి గాంచిన వైజ్ఞానికులు పిరమిడాలజి మీద లోతైన అధ్యయనం - అన్వేషణ చేశారు. పిరమిడాలజి విశుద్ధమైన ఒక వైజ్ఞానిక శాఖ. దానిలో పిరమిడ్స్ యొక్క నిర్మాణ రహస్యాలను అర్థం చేసుకొనే ప్రయత్నం చేయబడుతుంది. ఈ వైజ్ఞానికుల పరిశోధనా ఫలితం ఆధారంగా పిరమిడుల లోపల కొన్ని విలక్షణమైన శక్తి తరంగాలు క్రియాన్వితమై (active) ఉంటాయి అని తెలుస్తున్నది. ఈ తరంగాల ద్వారా కేవలం చేతనతత్త్వమే కాక, జడపదార్థములు కూడా ప్రభావితమౌతాయి. **ప్రయోగపరీక్షల ద్వారా తెలిసినదేమనగా ఈ నిర్మాణాల లోపలి భాగంలో - క్రిందన ఒకింట మూడొంతుల భాగం (1/3), పైన రెండింట మూడొంతుల భాగము (2/3) ల కూడలి మీద పురాతన నాణెములు, రేజర్‌బ్లేడ్‌లు ఉంచినప్పుడు శక్తి ప్రభావం వలన మెల్లగా నాణెముల మీద మెరుపు వచ్చింది, బ్లేడ్ మరింత పదునెక్కింది అని. చాలాకాలం వరకు పాలను అక్కడుంచినా అవి పాడవకపోవడమేకాక; తరువాత అవి వాటికై అవే పెరుగుగా మారిపోయాయి కానీ విరిగిపోలేదు.**

ఫ్రాన్స్‌కి చెందిన సుప్రసిద్ధ వైజ్ఞానికుడు ఎల్. తురెన్ 'వైన్స్ ఫ్రం ఫ్రాన్స్' అనే తన రచనలో పిరమిడుల నిర్మాణమును గూర్చి సువిస్తృతమైన వర్ణన చేశాడు. దీనిననుసరించి పిరమిడులు

**నీ ప్రతిభ గుర్తింపు పొందాలంటే ముందు ఇతరుల ప్రతిభను గుర్తించడం నేర్చుకోవాలి.**

ఉత్తర–దక్షిణ అక్షాంశం మీద నిర్మించబడ్డాయి. అయస్కాంత–బ్రహ్మాండీయ కిరణాలతో ఈ విలక్షణమైన కట్టడాలు తప్పక సంబంధం కలిగి ఉన్నాయి అనేది కూడా మరో వైజ్ఞానిక రహస్యం. భూగర్భశాస్త్రవేత్తలు ఉత్తర–దక్షిణ ధ్రువాలను కలిపే రేఖనే పృథ్వి యొక్క అయస్కాంత రేఖగా భావిస్తారు. అయస్కాంత శక్తులు విద్యుత్తరంగాలతో సూటిగా సంబంధాన్ని కలిగి ఉన్నాయి. ఈ తథ్యం స్పష్టీకరించే విషయం ఏమనగా పిరమిడులలో బ్రహ్మాండంలో వెదజల్లబడి ఉన్న అయస్కాంతతత్త్వంలో ఉన్నటువంటి అయస్కాంత కిరణాలను సమీకరించే అద్భుతమైన సామర్థ్యమున్నది. ఈ కిరణాలే లోపల ఉన్న వస్తువులు లేక నూతన జీవధారులపైన తమ ప్రభావాన్ని చూపిస్తాయి. వీటి నిర్మాణంలో ఉపయోగించబడిన గ్రానైట్ రాళ్ళు కూడా సూక్ష్మతరంగాలను సంగ్రహించుకునే సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి.

'సైకిక్ డిస్కవరీస్ బిహైండ్ ది ఐరన్ కర్టెన్' అను పేరు గల ఒక పుస్తకంలో పిరమిడుల లోలోపల విద్యుదయస్కాంత తరంగాలు ఉన్నాయి అని చెప్పబడి ఉన్నది. ఈ బ్రహ్మాండీయశక్తి ఎంత శక్తివంతమైనదంటే వీటి లోపల ఉంచబడిన ఏ పదార్థమునైనా క్రుళ్ళిపోనివ్వదు. బహుశా ఈ కారణంగానే వీటి లోపల వేలాది సంవత్సరాలుగా ఉంచబడిన మృతదేహాలు ఈనాటికి క్రుళ్ళి నశించిపోకుండా సురక్షితంగా ఉన్నాయి. ఈ కారణాలను స్పష్టపరుస్తూ 'పిరమిడ్ పవర్' లో ఏ ప్రత్యేక రేఖాగణిత ఆధారంగా అవి నిర్మించబడినాయో వాటి కారణంగా వాటి లోపల ప్రత్యేక తరహా శక్తి ప్రవాహం నిర్మించబడుతున్నది మరియు సూక్ష్మ మైక్రోవేవ్ సిగ్నల్స్ నిరంతరం వెలువడుతూ ఉంటాయి అని వర్ణించబడి ఉంది. ఈ భవనాల నిర్మాణం ఎప్పుడో ఏదో ఒక ఉన్నత లక్ష్యముల కొరకు జరిగి ఉంటుంది అనేది టామ్కిన్స్ అభిప్రాయం.

ఈజిప్టుకు చెందిన గ్రేట్ పిరమిడుల లోపల చేతనాపరమైన మార్పు యొక్క అనుభూతిని కలిగించే కొన్ని చారిత్రక సంఘటనలు కూడా ఉన్నాయి. 1798వ సంవత్సరంలో నెపోలియన్ ఈజిప్టు మీద విజయాన్ని సాధించాడు. అతను ఈజిప్టుకు చెందిన ఈ పిరమిడుల లోపల కొంత సమయాన్ని ఏకాంతంగా గడిపాడు. 'సీక్రెట్ ఆఫ్ గ్రేట్ పిరమిడ్' పుస్తకంలో పీటర్ హాప్‌కిన్ ఈ సంఘటనను గురించి వివరిస్తూ ఇలా వ్రాశాడు. 'బయటకు వచ్చిన నెపోలియన్ ముఖం మీద అద్భుతమైన దీర్ఘాలోచన పొడసూపింది.' 1930 వ దశకంలో దార్శనికుడు, రచయిత అయిన డా॥ పాల్‌బ్రంటన్ పిరమిడుల యొక్క మధ్య గదిలో ఒక రాత్రి గడిపాడు. అక్కడ అతనికి గుప్త శక్తుల అనుభూతి కలిగింది. ఈయన రచించిన "ఎ సెర్చ్ ఇన్ సీక్రెట్ ఈజిప్టు" అనే పుస్తకంలో ఆ అనుభూతుల వర్ణన లభిస్తుంది.

పిరమిడుల రహస్యంలో నిజానికి మానవుని యొక్క అతని అస్తిత్వ రహస్యమే ఉంది. వీటి రహస్యమైన గదులు మరియు పురాతనమైన దస్తావేజులన్నీ మానవీయ ప్రకృతిలో వెలుగొంది ఉన్నాయి.

పిరమిడుల రహస్యాన్వేషణలో పలు ప్రశ్నలు రేకెత్తుతున్నాయి. పిరమిడుల పొరలలో ఏ విజ్ఞానం కప్పబడి ఉన్నది? వీనిలో ఉన్న శక్తి యొక్క స్వరూపమేమిటి? వీనిలోని శక్తికి – బ్రహ్మాండంలోని శక్తితో సంబంధమున్నదా? ఒకవేళ ఉంటే మానవీయ చేతనను వృద్ధి చేయుటలో అది ఎంతవరకు సహాయపడుతుంది? పిరమిడులలో ఇంకా ఎన్ని రహస్యాలు వెలుగుచూడవల్సి ఉన్నాయి? మానవీయ చేతన యొక్క సమగ్రమైన అన్వేషణ చెయ్యకుండా వీటి పరిశోధన అసంపూర్ణంగానే మిగిలి పోతుందనిపిస్తుంది. వీటి రహస్యాల మూలం మానవీయ చేతన యొక్క రహస్యాలలో దాగి ఉన్నది. ఎంత వేగంతో మనం మానవీయ చేతన యొక్క వివిధ తలాలను అర్థం చేసుకుంటామో; అంత మోతాదులో మనం పిరమిడులలో దాగి ఉన్న రహస్యాలను అర్థం చేసుకొనగలం.

*– అఖండజ్యోతి, ఫిబ్రవరి 2005*
*అనువాదం: లక్ష్మీరాజగోపాలు*

## అవగాహనకు పరీక్ష

*ఒక రైతుకు నలుగురు కుమారులుండేవారు. వారి తెలివి తేటలను పరీక్షించాలని తలచి రైతు నలుగురు కుమారులకు నాలుగు గుప్పిళ్ళ ధాన్యాన్ని ఇచ్చి మీకు నచ్చినట్లు చేసుకోండని అన్నాడు. పెద్దవాడు గుప్పెడు ధాన్యాన్ని తేలికగా భావించి పక్షుల ముందు విసిరివేశాడు. రెండవ కుమారుడు వాటిని వండుకొని తిన్నాడు. మూడవ కుమారుడు ఎందుకైనా మంచిదని డబ్బాలో జాగ్రత్తగా దాచి ఉంచాడు. నాలుగవ కుమారుడు వాటిని పొలంలో చల్లి పంటను పండించి అనేక రెట్లు ధాన్యంగా చేసి తండ్రి ముందు తెచ్చి కుమ్మరించాడు.*

*నాటటం, కోసుకోవటం తెలిసిన నాలుగవ కుమారుడే ఉత్కృష్టుడని తండ్రి నిర్ణయించుకుని బాధ్యతలను, తన విలువైన సంపదలను అతనికి అప్పగించాడు. కుటుంబంలో జన్మనిచ్చిన పిల్లలలో ఇటువంటి గుణాలను వికసింప చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది. బాల్యంలోనే ఇటువంటి గుణాలను వికసింపజేసినట్లయితే కుటుంబ పెద్దలు నిశ్చింతగా తమ కుటుంబ బాధ్యతలను వారికి అప్పగించవచ్చు.*

*– ప్రజ్ఞాపురాణం నుండి*

**ప్రయత్నించనిదే ఫలితం లభించదు. సింహమైనా పడుకుని ఉంటే ఆహారం వచ్చి నోట్లో పడదు.**



# హిమాలయాలు - విభూతి గనులు

ఏదైనా కావాలి అని కోరుకున్నాక అది జరిగితే దాన్ని సిద్ధి అంటారు. కానీ ఆధ్యాత్మికపరంగా, పరామనోవైజ్ఞానికంగా పరిశీలిస్తే మాత్రం సిద్ధికి మరింత నిగూఢమైన అర్థం ఉంది. అసాధారణమైన, అద్భుత కార్యాల్ని సాధించగల సామర్థ్యాన్ని సిద్ధి అంటారు. సాధారణ మానవులకే కాదు, మేధావుల తర్క వితర్కాలకు కూడా ఇవి అంతుపట్టవు. జ్యోతిష్యశాస్త్రాన్ని ఉపయోగించకుండా భవిష్యత్తు చెప్పగలగడం, ఎటువంటి పరికరం లేకుండానే కోరుకున్న వస్తువును ప్రత్యక్షం చేయడం, మందు లేకుండానే దీర్ఘరోగాలను నయంచేయడం మొదలైనవి సామాన్యుల వల్లకాని పనులు. వీటిని సిద్ధులంటారు. ఈ పనులను చేయగలిగిన వారిని సిద్ధపురుషులంటారు.

పూర్వం ఋషులకు గొప్ప సిద్ధులుండేవి. కాలక్రమేణా అవి నిద్రాణమైపోయాయి. ఈ మధ్యకాలంలో మళ్ళీ సిద్ధపురుషులు వెలసి కొన్ని అలౌకిక సామర్థ్యాలను ప్రదర్శించారు. ఆధునిక విజ్ఞానాన్ని కూడా ఆలోచింపజేసి, ఈ విషయంలో నెలకొన్న అపనమ్మకాలని కూడా తుడిపేసారు. ఇటువంటి సిద్ధులున్న తపస్వులెందరో నేటికి హిమాలయాలలోని దుర్గమ ప్రాంతాలలో, ఆశ్రమాలలో, తపోస్థలాలలో ఉన్నారు.

పురాణాల్లో చెప్పిన కాలాప గ్రామం అనే ఆశ్రమం ఇప్పటకి హిమాలయాల్లో ఉంది. ఇక్కడ వేల మంది సిద్ధులు, యోగులు సూక్ష్మ శరీరాలతో విహరిస్తూంటారు, సాధన చేసుకుంటుంటారు. మానస సరోవరం, కైలాసాలకు కూడా అవతల ఉన్న ఈ ఆశ్రమాన్ని స్థూల దృష్టితో చూడలేరు. కృపాపాత్రులు, దివ్యదృష్టి సంపన్నులు మాత్రమే దీన్ని చూడగలరు. కొన్ని మైళ్ళ దూరంలో విస్తరించిన ఈ ప్రదేశం ఋతువులు, కాలాలు, వాయుమండలాలకి అతీతమైనది. కాలప్రవాహంలో ఎన్నోసార్లు సృష్టి, లయాలు సంభవించినా ఈ ఆశ్రమం చెక్కుచెదరలేదు. ఇక్కడి వారు కాలాన్ని జయించారు.

వైదిక యుగానికి చెందిన వశిష్ఠ, విశ్వామిత్ర, అత్రి, కణాద, పులస్త్య మొదలైన ఋషులు నేడు కూడా ఇక్కడ సశరీరంగా కనిపిస్తారని అనుభవజ్ఞులు చెప్తారు. ఈ సిద్ధ భూమిలో మహాయోగి గోరఖనాథుడు, జగద్గురువు శంకరాచార్యులు మొదలైన యోగులు కూడా స్పష్టంగా కనిపిస్తారు. వీరే కాక ఎందరో అజ్ఞాత యోగులు కూడా సాధన చేసుకుంటూంటారు. వందల ఏళ్ళ నుండి సాధువులు, సన్యాసులతో పాటు యోగినులు, సన్యాసినులు కూడా ఇక్కడే తపస్సు చేసుకుంటూ కనిపిస్తుంటారు. ఇక్కడ ఎలాంటి ద్వేషాలు, వ్యూహాలు, కుట్రలు, కపటం ఉండవు. పైగా అత్యుత్తమ సాధనలు చేయడంలోను, ప్రకృతి రహస్యాలను కనిపెట్టడంలోను నిమగ్నులై ఉంటారు.

ఇక్కడి సిద్ధయోగ సరస్సు దివ్యమైనది, అద్వితీయమైనది, మనోహరమైనది అని అనుభవజ్ఞులైన సాధకులు చెప్తారు. ప్రకృతి నిర్మితమైన ఈ సరస్సులోని నీరు స్వచ్ఛంగా, నిర్మలంగా, స్ఫటికంతో సమానంగా ఉంటుంది. ఈ నీటిని తాకగానే శరీరం దివ్యంగా, పవిత్రంగా అలౌకికంగా మారిపోతుంది. ఈ నీటిలో స్నానం చేయడం వల్ల వృద్ధాప్యం, రోగాలు వాటంతటవే పోతాయి. ఈ సరస్సు తీరంలో స్ఫటికంతో తయారుచేసిన నావలుంటాయి. ఈ నావలలో అక్కడి యోగులు, సాధకులు సరస్సులో విహరిస్తూంటారు. చుట్టూ సుగంధ పుష్పాలు వికసించి ఉంటాయి. పచ్చని తివాచీ పరచినట్టుంటుంది. ఇక్కడి కల్పవృక్షాల కింద కూర్చుని సాధకుడు ఏది కోరుకున్నా అది తక్షణం జరిగిపోతుంది.

ఎందరో సన్యాసులు, యోగులు ఈ సిద్ధాశ్రమాన్ని దర్శించి వచ్చారు. వారిలో ఒకరు అఖిలేశ్వరానంద స్వామి. ఆయన వ్రాసిన "హిమాలయాల మహాయోగుల గుప్త సిద్ధులు" అనే పుస్తకంలో యోగుల చమత్కారాలు, సిద్ధుల గురించి విస్తారంగా వర్ణించారు. వాటిలో ముఖ్యమైన 12 సిద్ధులు – 1) పరకాయ ప్రవేశం 2) ఆకాశగమనం 3) జలగమనం 4) హాదీ విద్య (నిరాహారం, ఆహారం లేకుండా కూడా కొన్నేళ్ళు జీవించవచ్చు) 5) కాదీ విద్య (ఎటువంటి వాతావరణ ప్రభావం ఉండదు, అంటే ఎండ, చలి, వర్షం, నిప్పు, హిమపాతం ఏవీ అతన్ని శుష్కింపలేవు) 6) కాల సిద్ధి (కొన్ని వేలసంవత్సరాల క్రితం జరిగినవి, కొన్ని వేల సంవత్సరాల తరువాత జరగబోయే సంఘటనలను చూడవచ్చు) 7) సంజీవనీ విద్య–చనిపోయిన వారిని బతికించవచ్చు 8) ఇచ్ఛా మృత్యువు – కాలాన్ని నియంత్రించి ఎన్నేళ్ళు కావాలంటే అన్నేళ్ళు బతకవచ్చు, ఎప్పుడు మరణించాలనుకుంటే అప్పుడు మరణించ వచ్చు 9) కాయకల్పం–శరీరంలో ఎలాంటి మార్పులు కావాలంటే అలా చేసుకోవచ్చు (ముసలివారు, రోగులు కూడా అందంగా, యవ్వనంగా, ఆరోగ్యంగా మారగలరు) 10) లోక గమన సిద్ధి – పృథ్వి మీదే కాక ఇతర లోకాలలో కూడా విహరించవచ్చు. దీని ద్వారా భూలోకం, భువర్లోకం, స్వర్లోకం, మహర్లోకం, జనలోకం, తపోలోకం, సత్యలోకం, చంద్రలోకం, సూర్యలోకం, పాతాళం, వాయులోకాలకు కూడా వెళ్ళి అక్కడ వారిని కలిసి, అక్కడి శ్రేష్ఠమైన విద్యలను నేర్చుకోవచ్చు, నేర్పవచ్చు. 11) శూన్య సాధన

**వైఫల్యానికి కష్టాలు, ఇబ్బందులే కారణమని ఏనాడు ఒప్పుకోవద్దు.**

– ప్రకృతిలోని ఏ వస్తువునైనా సాధించవచ్చు. విలువైన వజ్ర వైఢూర్యాలను కూడా పొందవచ్చు 12) సూర్యవిజ్ఞానం – దీనితో ఒక పదార్థాన్ని మరో పదార్థంగా మార్చవచ్చు.

పతంజలి మహర్షి చర్చించిన ముఖ్య సిద్ధాంతాల్లో సూర్య సిద్ధాంతం ఒకటి. అందరికన్నా ముందు వారే దీని గురించి వర్ణించారు. ఆ తరువాత వారి శిష్యులు సుధన్వా, ప్రియంకు, దేదెత్వ మొదలైనవారు దాన్ని అభివృద్ధి చేసారు. నేటి యుగానికి చెందిన నిమిషుడు, చైతన్య మహాప్రభు, లాహరి మహాశయ, వీరోచనుడు, విశుద్ధానంద స్వామి ఇందులో నిష్ణాతులు.

సూర్య కిరణాల్లో ఎన్నో రంగుల కాంతులుంటాయని పతంజలి మహర్షి అప్పుడే చెప్పారు. వాటన్నిటినీ కలిపితే తెలుపు రంగు వస్తుంది, దాన్నే విశుద్ధాత్మక తత్త్వమంటారు. ఈ శ్వేత వర్ణాన్ని 24 కోణాల స్ఫటికంతో మాత్రమే చూడవచ్చు. ఇందులో ప్రతి కోణం మరొక దాంతో వృత్తాకారావస్థలో ఉంటుంది. సూర్యకిరణాలు ఈ స్ఫటిక లెన్స్ మీద పడినప్పుడు ఘనీభూతమై ఒక వృత్తం నుండి మరో వృత్తంలోకి ప్రవహిస్తూ 24వ వృత్తంలో ప్రవేశించినప్పుడు పూర్తి శుభ్రమైన శ్వేత వర్ణంగా మారిపోతుంది; ఈ కిరణం ఏ పదార్థం మీద పడితే అది కోరుకున్న పదార్థంగా మారిపోతుంది. రాయిని వజ్రంగా మార్చవచ్చు. సూర్య సిద్ధాంతం తెలిసినవారికి ప్రకృతిలోని ఏ పదార్థంలో ఎన్ని వలయాలు ఉంటాయో తెలుసు. ఈ పద్ధతిని ఉపయోగించి అఖిలేశ్వరానంద స్వామి రెండు నిమిషాల్లో రాయిని వజ్రంగా మార్చి చూపించేవారు.

పాశ్చాత్య పరిశోధక మహామనీషి పాల్ బ్రంటన్ రాసిన పుస్తకం, 'ఏ సెర్చ్ ఇన్ సీక్రెట్ ఇండియా' లో సూర్యసిద్ధాంతంలో మర్మజ్ఞులైన విశుద్ధానంద స్వామిని గురించి ప్రస్తావించారు. ఆయన సూర్య సిద్ధాంతానికి సంబంధించిన వేలాది సిద్ధులు కలిగిన వారు. పతంజలి మహర్షి ఉల్లేఖించిన 'జాత్యాంతర పరిణామం' అంటే ఒక వస్తువును మరో దానిగా మార్చడం గురించి వ్యాఖ్యానిస్తూ ఈ వైజ్ఞానికవివేచనను మన ముందుంచారు.

**వారి ప్రకారం ప్రపంచంలో సత్తా స్వరూపంగా లేక శాశ్వత స్వరూపంగా ప్రతి ఒక్క వస్తువు, ప్రతీ చోట ఉంటుంది, కాని అన్నీ వ్యక్తమవవు. ఎక్కువ వికసించిన పదార్థం, ప్రస్ఫుటించే పదార్థం మాత్రమే కంటికి కనిపిస్తుంది. ఒక ఇనుప ముక్కను గమనిస్తే, అందులో ఇనుము మాత్రమే ఉండదు. అందులో అన్ని పదార్థాలు అవ్యక్తంగా ఉంటాయి. అందులోనే స్వర్ణ తత్త్వం కూడా సూక్ష్మంగా ఉంటుంది. ఇందులోని ఈ లుప్తమైన భాగాన్ని జాగృత పరిచి, దాని ప్రమాణాన్ని పెంచితే ఇనుము భావం అణిగిపోయి, బంగారం వికసించడం వల్ల అది బంగారంగా మారిపోతుంది.**

**నిజానికి అక్కడ ఇనుము నాశనమవ్వలేదు, బంగారం సృష్టింపబడలేదు. అవి రెండూ ఇంతకు ముందున్నాయి, ఇప్పుడూ ఉన్నాయి. తేడా అల్లా వాటి నిష్పత్తి, ఘనస్వరూపం మాత్రమే మారాయి. ఈ వ్యక్త–అవ్యక్తాలకి సంబంధించిన రహస్యాన్ని, క్రియాకౌశలాన్ని తెలుసుకుంటే ఎక్కడైనా, ఏ వస్తువునైనా తయారు చెయ్యవచ్చు. యోగశక్తి ద్వారా పదార్థాల రూపాన్ని మార్చే రహస్యం ఇదే, సూర్య విజ్ఞానాన్ని ఉపయోగించుకుని కూడా దీన్ని చేయవచ్చు.**

స్ఫటికంతో సూర్య విజ్ఞానాన్ని ఉపయోగించుకుని ఎలా అయితే ఇది సాధించవచ్చో, ఏ స్ఫటికం లేకుండా యోగ బలంతో కూడా ఈ సిద్ధిని సాధించవచ్చు. 'హిమాలయ మహా యోగుల గుప్త సిద్ధులు' అన్న పుస్తకంలో అఖిలేశ్వరానందగారు ఇలా వ్రాసారు, "బాహ్య ప్రపంచంలో ఒక సూర్యుడు దేదీప్య మానంగా వెలిగిపోతున్నాడు, అంతకన్నా కోట్ల రెట్లు తేజస్సు, తాపంతో మరో సూర్యుడు మనలోనే ఉన్నాడు. కాని ఆ తేజస్సు, తాపం చెల్లాచెదురుగా పడుంది. యోగసాధనల ద్వారా ఈ కిరణాలను సఘనపరుచుకుని (కేంద్రీకరించి) నేత్రాల ద్వారా ఆ ప్రభావాన్ని ఒక పదార్థంపై కేంద్రీకరించితే దాన్ని కోరుకున్న పదార్థంగా మార్చుకోవచ్చు.

అలాగే ఈ పుస్తకంలో పరకాయ ప్రవేశం, రోగ నివారణ, మృత్యు నివారణ మొదలైన సిద్ధుల గురించిన విస్తారమైన వివరణ ఉంది. అలాంటిదే మరో ప్రక్రియ శూన్యంలోనుండి ప్రయాణించడం. దీని ద్వారా ఎంత సామాను తీసుకునైనా సరే ఒక చోట నుండి వేరెక్కడికైనా కొన్ని క్షణాల్లో ప్రయాణించచ్చు. శరీరాన్ని పూర్తిగా నియంత్రించి, ఇడ మరియు పింగళనాడుల్ని సమన్వయ పరుచుకోవాలి. ఇదే ఈ ప్రక్రియలోని రహస్యం. అలా చేయడం వల్ల శరీరం గాలి కన్నా తేలికగా, వేగవంతంగా మారిపోతుంది.

ఈ విధమైన అద్భుతమైన సిద్ధులతో కూడిన ఈ హిమాలయ యోగుల ప్రపంచం నమ్మశక్యం కానిదిగా కనిపిస్తుంది, కౌతుకాన్ని రేకెత్తిస్తుంది, ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. అయినప్పటికి నిత్యం వెలుగు చూస్తున్న అనేక సందర్భాలు ఈ మహా సిద్ధులున్నాయని ధృవపరుస్తున్నాయి. సిద్ధులతో ముడిపడి ఉన్న మరో ముఖ్య విషయం – సాధన. సర్వసాధారణంగా సిద్ధుల వెలుగులలో సాధనా పక్షం కనుమరుగవుతుంది. కఠోర సాధనలు చేస్తేనే సిద్ధులు చేజిక్కుతాయి. కాని జీవిత పరమలక్ష్యాన్ని చేరడానికి ఈ వెలుగుజిమ్మెలు అవరోధాలే అవుతాయి కాబట్టి పెద్దలు తస్మాత్ జాగ్రత్త అంటూ నిర్దేశిస్తారు. సాధన పరిపక్వత చెందిన వారికి ఈ సిద్ధులు కుతూహలాన్ని పెంచకుండా వారికి అనుచరులుగా మారతాయి. వాటిని లోకకళ్యాణానికి మాత్రమే ఉపయోగిస్తారు. ఈ సిద్ధులు ఆధ్యాత్మిక విజ్ఞానానికున్న అపారమైన సామర్థ్యాన్ని ఒప్పుకునేటట్టు చేస్తాయి.

*– అఖండజ్యోతి, మార్చి 2001*

*అనువాదం: శ్రీమతి జయలక్ష్మి*

**ధైర్యమంటే ప్రమాదాన్ని లెక్కచెయ్యకపోవడం కాదు. ప్రమాదాన్ని సరిగా అంచనా వేయడం, అధిగమించడం.**

# కిశోరావస్థలో ఉన్న పిల్లల సున్నితమైన మనస్సును అర్థం చేసుకోండి

బాల్యావస్థ, కిశోరావస్థకు మధ్య ఉన్న స్థితి చాలా సున్నితమైనది. ఈ స్థితిలో వ్యక్తి బాల్యావస్థను దాటి యౌవనములోకి అడుగుపెట్టే సమయం ఆసన్నమౌతుంది. మొండితనము, అల్లరి పనుల వంటి బాధ్యతారహిత ప్రవృత్తుల స్థానంలో గంభీరత, ధీరత్వము వంటి బాధ్యతాయుత ప్రవృత్తులు అలవడతాయి. బాల్యములోని అమాయకత్వమునకు బదులు తెలివితేటలు పెరుగుతాయి. ప్రతిదానికి సంకోచించడం, తటపటాయించడం వంటి గుణాలు తగ్గిపోతాయి. ఈ సమయంలో నిర్ణయాలకు సంబంధించిన ఎన్నో సమస్యలు ఎదురౌతాయి. వీటిల్లో అంతర్గతంగా కుటుంబపరమైన, సామాజికపరమైన, విద్యాపరమైన సమస్యలేకాక తమకు నచ్చిన వృత్తిని ఎంపిక చేసుకోవడం వంటివి చాలా ఉంటాయి.

కిశోరావస్థలో మానసిక ఆరోగ్యమునకు సంబంధించిన సమస్యలపై ఎంతో కృషి చేశారు. కానీ వాటన్నింటికి మూల కారణమైన 'భావనాత్మక అవసరముల గురించి ఎవరు పట్టించుకోవడం లేదు. పరిశోధనలో ముఖ్యంగా ఈ కిశోరావస్థలోని ప్రతిభా ప్రదర్శన, మానసిక ఆరోగ్యము, వారి భావనాత్మక ఆవశ్యకతల గురించి పరిశోధన చేయడం జరుగుతున్నది.

మానవజీవితంలో భావనలకు చాలా ప్రాముఖ్యత ఉంది. జీవితంలో సాఫల్యం పొందాలంటే భావనాత్మక శక్తి చాలా అవసరం. పిల్లలు భావాలను నిర్భయంగా వ్యక్తపరచడం అనేది వారియొక్క ఖచ్చితమైన నడవడికకు ఉత్ప్రేరకంవలె పనిచేస్తుంది. భావనాత్మక శక్తి వల్లనే లక్ష్యము కొరకు చేసే పనిలో తీవ్రమైన ఏకాగ్రత సంభవమౌతుంది. భావనల మీద చేసిన పరిశోధన వల్ల స్పష్టమైన విషయం ఏమంటే వ్యక్తిత్వము అనేది మానవీయ వ్యవహారములను చక్కదిద్దుటలో అత్యంత ప్రముఖ పాత్ర పోషిస్తుంది.

వ్యక్తి తన ఆవేశమును నియంత్రించుకొని మనస్సును సంతులిత పరచుకొని చేసే పనిలో విజయం సాధించాలంటే 80% భావనాత్మక సామర్థ్యం, 20% తెలివితేటల సామర్థ్యం అవసరమౌతాయి.

కిశోరావస్థలో భావనల తీవ్రత చాలా ఎక్కువగా ఉంటుంది. వారికి ఆ వయసులో సరైన మార్గదర్శనం ఇచ్చి వారి భావనాత్మక శక్తిని సరిగ్గా ఉపయోగించుకునేటట్లు చేయగలిగితే సమాజానికి నిర్మాణాత్మకమైన ఒక నూతన రూపం తీసుకురాగలుగుతాము.

పరిశోధకులు తమ ప్రక్రియలో భాగంగా ఎంతోమంది యువతీ యువకుల భావనాత్మక సమస్యల మీద మాట్లాడి వాటిలో ముఖ్యమైన ఆవశ్యకతలను గుర్తించారు. అవి 1. స్నేహము, 2. చర్చించడం, 3. కుటుంబ సహకారం, 4. ప్రశంస, ప్రోత్సాహం 5. స్వతంత్రత. ఇవి లేకపోవడం వల్ల వారిలో క్రమశిక్షణ లోపించి మానసిక అనారోగ్యం, లోలోపలే సంఘర్షణకు గురికావడం లాంటి సమస్యలు ఉత్పన్నమౌతాయి. వీటి ప్రభావం వల్ల ప్రతిభను నిరూపించుకోలేని స్థితి ఏర్పడుతుంది. ఇక్కడ మనం ఇంకో విషయం గమనించాల్సిందేమిటంటే వీరి యొక్క ఈ అవసరాలను తీర్చాలంటే పెద్దలకు సరియైన దృష్టికోణం ఉండాలి. ఇది లేక పోవడం వల్ల వ్యక్తిత్వ వికాసములో చాలా అడ్డంకులు ఏర్పడతాయి.

పిల్లలు లేదా యువకులలోని ప్రతిభాప్రదర్శనను ప్రభావితం చేసే కారకాలలో (Cognitive Factors), బుద్ధిమాత్రమే కాక నైపుణ్యము (Skill), జ్ఞానము (Knowledge), సామర్థ్యము లేదా యోగ్యత (Competency) వంటి కారణాలు చాలా ముఖ్యమైనవి. కుటుంబంలో తల్లితండ్రులు, పిల్లల మధ్య సంబంధాలు, పిల్లల ఎదుగుదలకు కావలసిన అవసరాలు, వారి పాఠ్యాంశాలకు సంబంధించి వారి ఉపాధ్యాయులతోపాటు పిల్లలను ప్రోత్సహించుట అనేవి వారి ఎదుగుదలకు దోహదపడే కారణాలు. ఇవి చాలా ముఖ్యము. వీటన్నింటికంటే పాఠశాల వాతావరణం చాలా ముఖ్యమైనది. దోహదము చేయని కారణాలలో ముఖ్యమైనవి ఏమిటంటే లోలోపలే ముడుచుకుపోయే స్వభావం, బైటికి వ్యక్తపరచని స్వభావం, సామాజిక విధానాలు, వారి అభిరుచులు, జాతి విధానాలు, శారీరిక, మానసిక ఆరోగ్యములు కూడా ఉన్నాయి.

మానసిక ఆరోగ్యము అంటే సంతులిత మానసికస్థితి (balanced mind) ఇది ఉంటే సమాజంలో ప్రశంసలను పొందుతాడు. అతని నిర్ణయాత్మక సామర్థ్యము ఏ పరిస్థితులలోను ఊగిసలాడదు.

**పగ సాధించడానికన్నా క్షమించడానికే ఎక్కువ మనోబలం కావాలి.**

### పరిశోధనా విధానము:

**ఎంపిక:** ఎంపిక చేసిన 6 పాఠశాలల్లోను 125 మంది బాలురను, 125 మంది బాలికలను ఎంపిక చేయడం జరిగింది.

**ఉపకరణాలు:** ప్రస్తుత అధ్యయనము కొరకు వాడిన పరికరాలు:

1. అర్చనా దూబే ద్వారా తయారుచేయబడ్డ భావనాత్మక ఆవశ్యకతల పరిపూర్తిని సూచించే కొలమానము (E.N.F.S (Emotional Need Fulfilment Scale)
2. ప్రతిభను ఎంతవరకు ప్రదర్శించగలుగుతున్నారో పరీక్షించే కొలమానం (Academic Performance) - ఇది విద్యార్థులకు సంవత్సరం చివరి పరీక్షల్లో వచ్చిన మార్కుల మీద ఆధారపడి ఉంటుంది.
3. మెంటల్ హెల్త్ బ్యాటరీ (Mental Health Battery) - ఇది అరుణ్‌కుమార్‌సింహ్, కల్పనాసేన్ ద్వారా తయారు చేయబడింది.

**ప్రక్రియ:** ప్రస్తుత పరిశోధనలో ఎంపిక చేయబడ్డ అభ్యర్థుల భావనాత్మక ఆవశ్యకతలను తీర్చుకొనుట, ప్రతిభాప్రదర్శన, మానసికారోగ్య పరీక్షలను పై ఉపకరణముల ద్వారా కొలిచారు. వచ్చిన ఫలితాలను సంఖ్యాపరమైన విశ్లేషణ కొరకు ఈ-స్క్వేర్ టెస్ట్‌ను ఉపయోగించారు.

### ఫలితాలు మరియు విశ్లేషణ

1. యువతీ యువకుల భావనాత్మక ఆవశ్యకతలను తీర్చుకునేందుకు వారి యొక్క ప్రతిభాప్రదర్శనను కొలిచి లభించిన విలువలను విశ్లేషించగా వచ్చిన ఫలితాలను ప్రస్తుతము వచ్చిన విలువలు అభ్యర్థుల యొక్క ఫ్రీక్వెన్సీ రూపంలో చూపించడం జరుగుతుంది. ఊహించిన ఫ్రీక్వెన్సీ, వచ్చిన ఫ్రీక్వెన్సీలను లెక్కించి ప్రయోగ ఫలితాలను విశ్లేషించడం జరిగింది. ఇక్కడ E.N.F.S (Emotional Need Fulfilment Scale) అనగా భావనాత్మక ఆవశ్యకతల పరిపూర్తి కొలమానము, సంవత్సరమంతా వారు ప్రదర్శించగలిగే ప్రతిభ (A.P. Academic Performance), అనే రెండు అంశాలను కలిపి Above Average సగటుకంటే ఎక్కువ, Below Average = సగటు కంటే తక్కువ, Average = సగటు, Ex = ఉత్తమశ్రేణి, 1. ప్రథమశ్రేణి, 2. ద్వితీయశ్రేణి, 3. తృతీయ శ్రేణిల ద్వారా లెక్కిస్తారు.

భావనాత్మక ఆవశ్యకతలను పూర్తిచేసుకొనుట (E.N.F.S), సంవత్సరం మొత్తం ప్రదర్శించిన ప్రతిభ (A.P) అనే రెండు అంశాలను కలిపి చేసిన ప్రయోగపు స్కేలులో ఉత్తమశ్రేణిలో 8 మంది, సగటుకంటే ఎక్కువ సంఖ్యలో 69 మంది అభ్యర్థులు, సగటు కంటే తక్కువ సంఖ్యలో 85 మంది అభ్యర్థులు, సగటున 96 మంది అభ్యర్థులు మంచి ఫలితాలు పొందారు. ఈ ఫలితాల వల్ల తెలిసినదేమిటంటే భావనాత్మక ఆవశ్యకతలను సగటున లేదా సగటుకంటే ఎక్కువగా పూర్తి చేసుకున్న అభ్యర్థులు ప్రతిభా ప్రదర్శనలో ముందంజలో ఉన్నారు. ఈ రెండింటి మధ్య గల సంబంధమును ఈ-స్క్వేర్ టెస్ట్ ద్వారా పరీక్షించి అది 0.01 వద్ద స్థిరంగా ఉందని తెలుసుకున్నారు. అంటే ఈ రెండు అంశాలు ఒకదానిమీద ఇంకొకటి ప్రభావమును చూపిస్తాయి అని మనకు అర్థమౌతుంది.

**అనగా కిశోరావస్థలోని పిల్లలు తమ సంరక్షకులు లేదా తల్లితండ్రుల నుండి, ఉపాధ్యాయులనుండి, స్నేహితుల నుండి సహకారాన్ని ఆశిస్తారు. తల్లితండ్రులు వారు చదువుకునేందుకు కావలసిన అవసరాలు తీరుస్తూ, స్నేహితులు, ఉపాధ్యాయులు వారిని ప్రోత్సహిస్తూ, సహకరిస్తూ ఉంటే వారిలోని ప్రతిభ ఇనుమడిస్తుంది. ఇలా సహకరించవలసినవారే తిరస్కరిస్తే వారి ప్రతిభ అడుగంటిపోతుంది.**

**ఈ ప్రయోగాల ద్వారా మనకు తెలిసేదేమిటంటే కిశోరావస్థ లోని పిల్లల యొక్క కోరికలు, ఇష్టాలు తీరకపోతే ఆ ప్రభావం వారి మానసిక ఆరోగ్యము మీద పడుతున్నది. అందుచేతనే పెద్దలు పిల్లలతో చర్చించడము చాలా అవసరం. ఇంకా వారు స్నేహమును, కుటుంబ సహకారాన్ని, ప్రశంసలను, ప్రోత్సాహమును, స్వతంత్రంగా తమ భావాలను వ్యక్తపరచ గలగడం వంటి అంశాలను కోరుకుంటారు. ఈ సహకారాలేవీ అందకపోతే ఆ ప్రభావం మానసిక ఆరోగ్యము మీద పడుతుంది.**

కిశోరావస్థలో పిల్లల భావనాత్మకవికాసం చాలా వేగంగా ఉంటుంది. ఆ స్థితిలో వారు తాము బాధ్యత గలవారమనే భావనలోను ఉంటారు. దానివల్లనే వారు అందరు తమను గౌరవించాలని, తమకు అధికారాన్ని ఇవ్వాలని, స్వతంత్రాన్ని ఇవ్వాలని, చిన్నప్పటినుండి తమపై పెట్టిన ఆంక్షలన్నింటినీ తీసివేయాలని కోరుకుంటుంటారు. ఎందుకంటే ఈ సమయంలోనే వారికి స్వతంత్రభావాలతో దృష్టికోణము, అన్ని విషయాలపట్ల జిజ్ఞాస వంటివి పెరుగుతుంటాయి. అందుచేత వారు తమ అభిరుచికి అనుగుణముగానే ఏమి చేయాలో, ఏమి చేయకూడదో నిర్ణయించుకుంటుంటారు. ఇటువంటి స్థితిలో వారిని వ్యతిరేకిస్తే

**మేధాశక్తి క్షీణించడం మొదలైందనడానికి విసుగు తొలి సంకేతం.**

వారిలో విద్రోహభావాలు తలెత్తుతాయి. జీవితంలో తప్పటడుగులు వేయడం మొదలుపెడతారు.

అంతేకాదు ఈ స్థితిలో వారికి ఆత్మీయత చాలా అవసరమౌతుంది. మనస్సులో సంఘర్షణ చెలరేగుతూ ఉండడం వల్ల సమస్యలు, అనుమానాలు పెరిగిపోతూ ఉంటాయి. ఆ స్థితిలో వారు తమ సమస్యలకు సమాధానాన్ని ఆశిస్తారు. అప్పుడు మనం సహనం కోల్పోయి వారిని నిందించడం మొదలు పెడితే వారి హృదయం వేదనతో నిండిపోతుంది. అలాకాకుండా వారి సమస్యను అర్థం చేసుకొని వారితో కలిసిపోయి వారికి సహకారం అందించగలిగితే వారి వికాసానికి తోడ్పడినవారమౌతాము.

**ఫలితము:** కిశోరావస్థ అనేది శారీరిక, మానసిక పరివర్తనకు, భావనాత్మక ఆటుపోట్లతో నిండి ఉండే స్థితి. ఆ స్థితిలో వ్యక్తి తన గురించి, ఇతరుల గురించి, జీవితమును గురించి చక్కగా అర్థం చేసుకోవాలని ప్రయత్నిస్తుంటాడు. ఈ ప్రయత్నంలో తన వికాసానికి సాయపడేవారి తోడు కోరుకుంటాడు. అలా కుటుంబము, స్నేహితులు, ఉపాధ్యాయులు అతని స్వతంత్ర భావాలని గౌరవిస్తూ అతని ప్రోత్సహించినట్లయిన ఆ వ్యక్తిలోని ప్రతిభ వెలికితీయబడుతుంది. వీరిలో ఏ ఒక్కరు సహకరించకపోతే పిల్లలు వారిమీద కోపం తెచ్చుకొని ప్రతీదానికి వారిపై ఎదురు తిరగడం, వారిపై ఒత్తిడి తీసుకురావాలనుకోవడం వంటి ఆలోచనలు చేస్తారు. తమ మనస్సులోని మాట స్వతంత్రంగా చెప్పుకోలేని స్థితి వల్ల కఠినంగా మాట్లాడడం, ఉత్సాహము పోయి నిరాశగా బ్రతుకుతుంటారు. ఇలాగైతే వారి మానసిక ఆరోగ్యం పెంపొందేమాట అటుంచి వారిలోని ప్రతిభ అడుగంటిపోతుంది. పిల్లల సంపూర్ణవికాసానికి కుటుంబ సభ్యుల సహకారం, కుటుంబ వాతావరణం, స్నేహము చాలా మహత్వపూర్ణమైన పాత్రను పోషిస్తాయి. అందుచేత వీరందరు తమ యొక్క బాధ్యతను అర్థం చేసుకొని పిల్లల సముచిత వికాసానికి చక్కటి తోడ్పాటును అందిస్తే వారికి ఉజ్వల భవిష్యత్తు ఏర్పడుతుంది.

– అనువాదం: *శ్రీమతి వల్లీశ్రీనివాస్*

---

## పంచిపెట్టడంలోని పరివార భావన

*ఒక గురువు శిష్యునికి కొన్ని ఫలాలను ఇవ్వటం జరిగింది. అతడు వాటిని తాను తినక పదిలంగా మూటకట్టి ఇంటికి తీసికొనిపోయి తన పిల్లలకు సమంగా పంచి ఇచ్చాడు. మర్నాడు గురువు వద్దకు రాగానే ఆయన "వత్సా! భగవంతుడు ప్రసాదించిన దానిని ఎవరైతే ఆయన సంతానానికి పంచిపెట్టటానికి ఉత్సాహం చూపిస్తారో వారు నీ వలెనే సహృదయులు, సంపన్నులు కాగలుగుతారు, కాని లభించిన దాన్ని ఇతరులకు ఎవరికి పెట్టక తామే అనుభవిస్తారో వారు స్వార్థపరులుగా నిందించబడి భగవంతుని ఆగ్రహానికి గురి అవుతారు" అని శిష్యునికి తెలియజేశాడు.*

*గురువు మాటల్లోని అంతరార్థాన్ని గ్రహించిన శిష్యుడు తనకు లభించిన దానిని తన పిల్లలతోపాటు ఇతరలకు కూడా పంచి పెట్టటానికి నిశ్చయించుకొన్నాడు. ఈ పరివార భావన అభ్యాసం ఒక గొప్ప లోకసేవకుణ్ణి చేయటంలో ఎంతో సహాయపడింది.*

– ప్రజ్ఞాపురాణం నుండి

## కలిసి జీవించడంలో ఉండే లాభం

*ఒక పట్టుదారపు కండెలో దారపుపోగులు పరస్పరం పోట్లాడుకొని విడివిడిగా ఉంటామని పట్టుబట్టాయి. ఎంత నచ్చజెప్పినా వినకపోవడంలో దర్జీ వాటిని ముక్కలు ముక్కలుగా వేరుచేశాడు. దానితో అవి వీస్తున్న గాలికి ఎగిరి చిందరవందర అయినాయి.*

*అలాగే ఒక చోట విడివిడిగా ఉన్న ఈత ఆకులు కలిసివుంటే బాగుంటుందని ఆలోచించాయి. గాలికి చెదరి ఉన్న ఆ ఆకులయొక్క ఉన్నతమైన భావాన్ని గుర్తించిన తోటమాలి వాటిని కలుపుతు అందమైన చాపగా తయారు చేశాడు. దాని అందాన్ని, పనితనాన్ని చూచి ఒక జమీందారు బహుమూల్య ధనాన్ని ఇచ్చి ఆ చాపను కొని, వెంట తీసుకొని వెళ్ళి తన భవనంలో జరిగే ప్రత్యేక కార్యక్రమాల్లోను, పూజల్లోను ఆ చాపను ఆసనంగా పరచుకొనేవాడు. ఈ చిన్నచిన్న ఉదాహరణల ద్వారా వేర్పాటువాదానికి, కలిసికట్టు తనానికి మధ్యగల వ్యత్యాసం, పర్యవసానం ప్రతి ఒక్కరు గుర్తించాలి.*

– ప్రజ్ఞాపురాణం నుండి

**నిజం చెప్పడానికే కాదు, నిజాన్ని ఒప్పుకోవడానికి కూడా ఎంతో ధైర్యం కావాలి.**



పూజ్య గురుదేవుల అమృతవాణి

# ఆధ్యాత్మికత అనగా భావనల ఆట-1

### శరీరము గవ్వ విలువ కూడా చెయ్యదు

నేను ఇక్కడ ప్రాణానికి–శరీరానికి మధ్య గల తేడాను వివరించే ప్రయత్నం చేస్తున్నాను. శరీరపు వెల ఎంత? ప్రాణము వెల ఎంత? ఈ ప్రశ్న వేసుకుంటే గనుక ఒక విషయం అవగాహన కొస్తుంది. ప్రాణము ఉండగా శరీరము పనికొస్తుంది. కానీ ప్రాణం పోయిన తరువాత ఈ శరీరమును ఏమి చేసుకుంటాము? అప్పుడు ఈ శరీరం విలువ శూన్యము. 'ఇది ఆచార్యులవారి శరీరము' అని దీన్ని అమ్మకానికి పెట్టండి. ఎవరైనా కొనటానికి సిద్ధపడ తారా? కొనరు. ఒకవేళ దీన్ని ప్రయోగశాలకి అప్పగిస్తే అక్కడ 3 లేక 4 రూపాయలేమైనా లభించవచ్చు. ఈ శరీరంలో ఎముకలు ఎన్నుంటాయి? కొన్ని ఎముకలుంటాయి. శరీమును బూడిద చేస్తే 10 అడుగుల పొడవు, 7 అడుగుల వెడల్పు గల గోడపూతకు ఆ బూడిద సరిపోతుంది. దీనిలోని సున్నం 3 అణాలు పలుకుతుంది. శరీరంలోని ఇనుము 10 పైసల విలువ చేస్తుంది అంతే!

### శరీరం పెట్టె మాత్రమే!

నేను శరీరమును గురించి వివరిస్తున్నాను. ఈ శరీరంలో ఏమేమున్నాయి? క్రొవ్వు, కొన్ని రసాయనపదార్థములు, జలము, ఎముకలు, రక్తం మొదలైనవి ఉన్నాయి. ఇందులో ఉన్న క్రొవ్వుతో 7 సబ్బులు తయారౌతాయి. సబ్బులు 12 అణాలుంటాయి. దీనిలోని క్రొవ్వుతోటి 3 క్రొవ్వొత్తులు చేసుకోవచ్చు. దీనిలోపల 3 బొక్కెనల నీళ్ళున్నాయి. ఇంకా ఏవో చిన్నాచితకా భాస్వరం వంటి రసాయనాలు ఉంటాయి. మొత్తం దీన్ని వేలం వేస్తే 3 రూపాయల వెల పలుకుతుంది. కానీ ప్రస్తుతం నన్ను తీసికెళ్ళి అమ్మేస్తే 10,000 రూపాయలు లభిస్తాయి. నా ద్వారా వ్రాయబడిన వ్యాసాలను ఎవరైనా అచ్చువేసుకుని ఎంతటి ధనవంతుడౌతాడంటే 7 తరాలవారు కూర్చుని తిన్నా ఆ సంపద తరుగదు. ఇది నా తెలివి యొక్క విలువ. శరీరం ఎందుకు పనికిరాదు. ఇది ఆధ్యాత్మికతను సాధించుకునేందుకు పనికొచ్చే ఒక ఉపకరణము. దీన్ని మనం కళేబరం అంటాము. కళేబరానికి విలువే ఉండదు. ఇది నిరుపయోగమైనది. ఉంగరం చేయించుకోవటానికి కంసాలివద్దకు వెళితే నీకు ఉంగరంతోపాటు ఒక పెట్టె ఇస్తాడు. పెట్టె విలువ 10 అణాలు. ఉంగరం వెల 65 రూపాయలు. పెట్టె అయితే చూడటానికి మెటిసిపోతూ ముచ్చటగా ఉంటుంది. కానీ దాని వెల 10 అణాలే. శరీరం కూడా ఆ పెట్టె లాంటిదే.

### కర్మకాండ కేవలం కళేబరం మాత్రమే!

ఆధ్యాత్మికతలోని ఒక భాగాన్ని కర్మకాండ అంటాము. దీని వెల 10 పైసలు. కర్మకాండ కేవలం చూడటానికి మాత్రమే కనిపిస్తుంది. లోపల జ్ఞానమేమీ ఉండదు. జ్ఞానం ఎందులో ఉందో అది చెప్పే ప్రయత్నమే నేను చేస్తున్నాను. ఆధ్యాత్మికత యొక్క ప్రాణం చేతనత్వంతో సంబంధం కలిగి ఉంటుంది. దానికి మన క్రియాకలాపాలతో పనిలేదు. నోటితో, ముక్కుతో, చేతులతో, కాళ్ళతో మనం చేసే పనులు, కర్మకాండలు ఇవన్నీ కళేబరానివే. శరీరం కొబ్బరి కాయలో కొబ్బరికి పైన ఉండే పెంకుతో సమానం. ఈ పెంకుతో మనకేమీ పనిలేదు. పైగా పెంకు నమిలితే పళ్లూడి పోతాయి. అది కాల్చటానికి మాత్రమే ఉపయోగపడుతుంది. కొబ్బరి 12 అణాలు లేక రూపాయి ఖరీదు చేస్తుంది. అయితే మరి కర్మకాండ చెయ్యనవసరం లేదా? అన్న ప్రశ్న వచ్చినప్పుడు దాన్ని చెయ్యవల్సినదే. ఎందుకంటే కర్మకాండ చెయ్యటం వలన మనిషికి సిద్ధి చేకూరుతుంది. ఫలానా దేవత ప్రసన్నమౌతుంది. ఇటువంటి అనేక లాభాలు ఒనగూడుతాయని భావిస్తారు.

ఆధ్యాత్మికత యొక్క లాభాలన్నీ ఒకానొక రహస్యస్థలంలో దాగి ఉంటాయి. మనిషి యొక్క ప్రాణం, చేతన, అతని నిష్ఠ–విశ్వాసాల మీద పనిచేస్తాయి. దానిద్వారానే అతని జీవితం ప్రభావితమౌతుంది. వాస్తవంగా నమ్మకాలను ప్రభావితం చేయటానికి, ఆలోచనలను ప్రభావితం చేయటానికి ఆధ్యాత్మికత యొక్క పునాది నిర్మించబడింది. తద్వారా మనిషి శ్రేష్ఠమైన వ్యక్తిగా మారి, ఆదర్శవంతంగా రూపుదాల్చి, ఉజ్జ్వలమైన వ్యక్తిత్వంతో మహాత్ముడై చివరకు పరమాత్ముడౌతాడు. ఈ కర్మకాండనంతా ఒక ఆట అంటాను నేను. దీన్ని మీరు పూజ అంటారు. పారాయణ అంటారు. వీటన్నింటిని నేను ఆటలు అంటాను. మనిషికి విశ్వాసం, చింతన, ఆలోచన, నమ్మకం వికసించబడటం కోసం ఈ ఆటలన్నీ ఆడించబడతాయి. వీటి ఉద్దేశ్యం మీకు తెలియదు. వీటిని ఆచరించటం వెనుక గల కారణం మీకు తెలియదు. అప్పుడు మీకు లాభం ఎలా వస్తుంది? మీరు కర్మకాండలు చేస్తూ ఉండండి కానీ మీరు రిక్తహస్తాలతో ఉంటారు. నాకు ఏమీ లభించలేదు అనే ఫిర్యాదు చెయ్యటం తప్ప మీకు ఒరిగేదేమీ ఉండదు.

**అదృష్టం అందరి తలుపు తట్టవచ్చు. కానీ ఆ పిలుపు వినగలిగిన నేర్పు కొందరికే ఉంటుంది.**

## పరీక్ష వ్రాయాలంటే కాగితం-కలం కావాలి

కర్మకాండ యొక్క వ్యాఖ్యానం, దాని ప్రాణం యొక్క వ్యాఖ్యానం మీ ముందు ఉంచుతున్నాను. కలం, కాగితం, పెన్సిల్‌ల ద్వారా పరీక్షలో ప్రశ్నలకు జవాబులు, వ్యాసాలు వ్రాసే విధంగానే కర్మకాండను కూడా భావిస్తాము. బి.ఎ పరీక్షలో ఉత్తీర్ణుడవటం, ఎమ్మేలో ఉత్తీర్ణుడవటం, థీసెస్ సమర్పించటం వీటన్నింటికి ఏ సంబంధమున్నది? కలంతోటే పరీక్ష వ్రాయబడుతుంది. కలంతోటే పీహెచ్.డి. చెయ్యాలి. నేను మీకు మంచి కాగితం తెచ్చిస్తాను. పార్కర్ కలం తెచ్చిస్తాను. మీరు ఎమ్మేలో ఉత్తీర్ణులు కాగలరా? బి.ఎ.లో మొదటి తరగతి తెచ్చుకోగలరా? పరీక్షలో ఉత్తీర్ణత సాధించటం ఫౌంటెన్ కలముతో సాధ్యమైనదని మీరనుకుంటే పొరపాటు పడినట్లే అని చెప్పగలను. కాగితాలు, కలము నిరుపయోగమనుకుంటే నేను మీతో పోట్లాడటానికి సిద్ధంగా ఉన్నాను. అయితే మీరు ఎంత జ్ఞానం సంపాదించినా, ఎంత అధ్యయనం చేసినా మానసికంగా మీరెంత ఎదిగినా పరీక్ష వ్రాయాలనుకుంటే కాగితం, కలం తప్పనిసరిగా ఉండాల్సిందే. అవి లేకుండా మీరు పరీక్షలో ఉత్తీర్ణులు కాలేరు. లేదండీ మాకు అన్ని పాఠములు కంఠస్తం వచ్చు, కనుక మేం అప్పచెపుతాము అంటే పరీక్షాధికారి ఒప్పుకోదు. తప్పకుండా కాగితం మీద కలంతో ప్రశ్నలకు తగిన సమాధానములు వ్రాసితీరవలసిందే.

## ఆధ్యాత్మికత యొక్క మూల మర్మమిది

**పరీక్ష వ్రాయటానికి కాగితము, కలము ఎంత అవసరమో కర్మకాండ కూడా అంతే అవసరము.** గాయత్రీ ఉపాసన ద్వారానే మీకు ఈ శిబిరంలో కర్మకాండలు నేర్పించబడతాయి. జలప్రక్షాళన, ఆచమనం మొదలైనవన్నీ నేర్పబడతాయి. ఆధ్యాత్మికతకు చిహ్నమైన ఈ కర్మకాండల వెనుక దాగిఉన్న ప్రాణశక్తిని నేను మీకు అందించలేకపోతే, దాని వెనకాతల ఉన్న సంకేతాల అర్థములను వివరించలేకపోతే నేను మీ యెడల విశ్వాసఘాతుకం చేసినట్లే. ఆత్మను దగా చేసినట్లే. ఫలానా కర్మకాండతో ఫలానా లాభం కలుగుతుంది. చండీపారాయణతో ఫలానా లాభం ఉంటుంది. 24,000 జపం చేస్తే ఈ లాభం ఉంటుంది అని మీకు బోధిస్తూ ఉంటే మీ జీవితాలను చక్కదిద్దుకోవటం జరుగుతుంది. 'మీరు పాపాత్ములుగానే, నికృష్టులుగానే జీవించండి, సంతోషీమాతను పొగడండి, గణపతిని, హనుమంతుడిని ప్రస్తుతించండి. మీరనుకున్న పని అయిపోతుంది' అని నేను మీకు ఈవిధమైన నమ్మకం కలిగిస్తే ఆధ్యాత్మికవాదం పట్ల జీవుల యొక్క జీవాత్మపట్ల విశ్వాస ఘాతకుడను అవుతాను.

## ప్రేరణలకు, శిక్షణలకు గొప్పతనం

నేను విశ్వాసఘాతకుడిని కాలేను. అసలైన ఆధ్యాత్మిక అంటే ఏమిటో నేను మీకు బోధిస్తాను. దానిని ఆచరించటం, ఆచరించకపోవటం మీ ఇష్టం. నేను కర్మకాండలకు మేఘాల వంటి, హిమాలయాల వంటి గొప్పతనమియ్యలేను. గొప్పతనమంతా ఆధారాలలో, ఆ దిశలలో, ఆ ప్రేరణలలో, ఆ శిక్షణలలో దాగి ఉన్నది. దానినే కర్మకాండ ద్వారా మీకు నేర్పుతున్నాను. నేర్పటానికి వస్తువులు ఉండాలి. బ్లాక్‌బోర్డ్, చాక్‌పీస్ లేకుండా లెక్కలు ఎలా నేర్పగలము? కాస్త చెప్పండి. మ్యాప్ చూపించకపోతే దారెలా తెలుస్తుంది? రైలు ఎప్పుడొస్తుంది? ఎప్పుడు వెడుతుంది? అనేది రైల్వే టైంటేబులే కదా చెప్పేది?

## తప్పుత్రోవ పట్టించేది జ్ఞానమే

మీ మనస్సు సరిగ్గా లేనప్పుడు మీ దగ్గర మ్యాప్ ఉన్నా, టైంటేబుల్ ఉన్నా మీకు లక్ష్యము దగ్గరకు వెళ్ళటం తెలియదు. చేతిలో డబ్బులు లేవు. కాళ్ళు పనిచేయటం లేదు. తెలివి అక్కరకు రావటం లేదు. అప్పుడు శరీరం ఉన్నా సమయం వృథాయేకదా! మీ దగ్గర తెలివి ఉంది. కనుక కాళ్ళు, చేతులు, తెలివి ఉపయోగించి లక్ష్యమునకు చేరుకోగలరు. లక్ష్యము చేరుకోలేకపోతే అన్నీ వ్యర్థమే కదా! నాలుగు తీర్థాల యాత్ర అంటే బదరీనాథ్, కేదార్‌నాథ్, యమునోత్రి, గంగోత్రిల యాత్ర చేస్తామంటే మీ ఇష్టం నాయనా!

ఆధ్యాత్మికతను గూర్చి తప్పుదారిపట్టించే జ్ఞానం ఎంత మూర్ఖమైనదో చూడండి. ఈ పని చేయటం వలన, ఈ కథ వినటం వలన ఈ లాభమొస్తుంది అని చెప్పినప్పుడు ఆ పనులు చేస్తూనే ఉంటారు, కథలు వింటూనే ఉంటారు. కథల వలన ఎవరైనా ఎప్పుడు ఉద్ధరింపబడతారు అంటే దానిలోని నీతిని, సారమును జీవితంలోకి అన్వయించుకున్నప్పుడు. కథా శ్రవణం వలన లాభం ఎప్పుడు ఉంటుందంటే కథలోని ఆచరణీయములను జీవితంలోకి దింపుకున్నప్పుడు. ఒక కథ వింటే దానిలోని ప్రాణం, దాని రహస్యము, మీ జీవితాలలోకి రావాలి. రామాయణం విన్న తరువాత దానిలో చెప్పినట్లుగా మీ జీవితమును మలచుకోవాలి. భాగవతం విన్న తరువాత ఆవిధంగా జీవిస్తే పరీక్షిత్తు మహారాజు వలె మీ అందరికి భాగవతకథ లాభమును కలిగిస్తుందని నేను మీకు నమ్మకంగా చెప్పగలను. మీరు పరీక్షిత్తువలె జీవించలేకపోతే ఏమీ ఉపయోగం ఉండదు.

## ప్రచ్ఛన్న నాస్తికత

ఒక కథ విన్న తరువాత ఆ వ్యక్తి ఆధ్యాత్మిక లాభమును పొందలేకపోతే, తన జీవితంలో దాని సారమును ఆచరణలోకి

ఒక్క అంగుళం దారిమళ్ళినా లక్ష్యానికి వేల మైళ్ళ దూరమయ్యే ప్రమాదం ఉన్నది.

తేనంతవరకు, ఆ దారిన వెళ్ళటానికి ప్రయత్నించనంతవరకు ఆ కథా శ్రవణం వలన ఉపయోగం ఏమీ ఉండదు. కథ వింటే చాలు, కథలో చెప్పిన రీతిలో నడవాల్సిన అవసరమే లేదని అనుకోవటం వల్ల అంతా సర్వనాశనమైపోయింది. నాస్తికత్వం విస్తరించిపోయింది. నాస్తికతను నేను తప్పుపట్టటం లేదు. దీన్నే కమ్యూనిజం అంటారు. అయితే దానిలో కొన్ని నిజాలు కూడా ఉన్నాయి. త్వరలో కమ్యూనిష్టులు ఆధ్యాత్మిక దీక్ష తీసుకోవటానికి అందరికన్నా ముందువరుసలో ఉంటారు. ఈ సంఘటనను మీరు భావికాలంలో దర్శించబోతున్నారు. వారలా ఎందుకు చేస్తారంటే వారి ఆలోచనాపద్ధతి మారుతుంది కనుక. కమ్యూనిష్టులు ఏమంటారంటే 'మాకు భగవంతుడు కనిపించటంలేదు. కాబట్టి ఆయనను మేం నమ్మము.' ప్రత్యక్షవాద కారణంగా వారు తిరస్కరిస్తున్నారు. ఈ కారణంగానే నేను ఆధ్యాత్మికతను ప్రత్యక్ష వాద సిద్ధాంతాల ఆధారంగా, విజ్ఞానశాస్త్రపరంగా, ఇంకా పలు ఇతర ఆధారాలతో ఏనాడైతే ఋజువు చేస్తానో ఆనాటికి ప్రపంచం లోని కమ్యూనిష్టులందరు నాకు శిష్యులైపోతారు. కాని మీరు మాత్రం ఎప్పటికి నా శిష్యులు కాలేరు. ఎందుకంటే మీరు ఆధ్యాత్మికతకు ఆధారభూతమైన సిద్ధాంతాలనన్నింటిని తుడిచి పారేశారు. మీరే నిజమైన నాస్తికులు. జీవితమంతా నాస్తికులుగానే ఉండండి. ద్రోహులందరు భగవంతునిపట్ల ఎలాంటి ఆచరణ కలిగి ఉంటారో మీ ఆచరణ కూడా ఆవిధంగానే ఉంది. తస్మాత్ జాగ్రత్త!!

**ఆస్తికతకు మూలభూత సిద్ధాంతము కర్మఫలం. కనుక మనిషి శ్రేష్ఠకర్మలు చేయాలి.** చెడు పనుల నుండి తనను తాను కాపాడు కోవాలి. అవినీతిని వదలి మనిషి శ్రేష్ఠమైన ఆచరణలను అలవరచుకోవాలి. కానీ భగవంతుడా! జరుగుతున్నది ఏమిటి? ఏమిటిదంతా? నాస్తికుడు ఆధ్యాత్మికత యొక్క మూలభూత సిద్ధాంతాలను తృణీకరిస్తూ, దానికి విరుద్ధంగా వ్యతిరేక ప్రచారం ప్రారంభించాడు. **'మీరు ఏ పనులైనా చెయ్యండి. పర్వాలేదు, అయితే మీరు గంగాస్నానం చేస్తే ఆ పాపాలన్నీ పటాపంచ లౌతాయి.'** ప్రజలను మోసగించే ఇటువంటి ప్రచారం మొదటి **నుండి ఉన్నదే.** సమాజాన్ని మోసగించగలరు. అవినీతిపరులై కూడా మహాత్ములవలె, సాధువులవలె వేషం వేయగలరు. నాలుగు తీర్థముల యాత్ర పూర్తిచేయగలరు. తిలకాలు దిద్దుకోగలరు. భజనలు చేయగలరు. సమాజమును మోసగించే ఇటువంటివారిని లోకులు ధర్మాత్ములుగా భావిస్తూనే ఉంటారు. ఎందుకంటే వారి వేష-భాషలు ఆవిధంగా ఉన్నాయి కనుక.

## చౌకబారు దారులు

ప్రభుత్వాన్ని మోసం చేయటమనే అలవాటు ఈనాడు బాగా వ్యాపించింది. లంచమిచ్చి, ఏదో అసంబద్ధమైన లెక్క పద్దు చూపించి ప్రభుత్వమును మోసగిస్తూనే ఉన్నారు. చట్టాన్ని ఇదివరకే మోసం చేశారు. పరలోకం, పునర్జన్మవంటి వాటి గురించి అంతంతమాత్రం జ్ఞానమే ఉన్నది. ఆధ్యాత్మికత నేడు తల్లక్రిందులుగా అర్థము చేసుకోబడుతున్నది. ఋషులు చెప్పినది, వేదాది శాస్త్రములు చెప్పినది వేరు, చేస్తున్నది వేరు. నేను దీనిని ప్రతిఘటిస్తున్నాను. ఇది భ్రష్టమైనది. దుష్టమైనది. ఇది భ్రష్టమైనది అని ఎందుకు అంటున్నానంటే అనైతికమైన పనులు చేసినప్పటికి మీకు శిక్ష పడటం లేదు కాబట్టి. అనైతికమైన పనులు చేసి దండన నుండి తప్పించుకోవటానికి చాలా తెలివైన విధానాలు ఉన్నాయి. ఒక్క పైసా ఖర్చుపెట్టకుండా గంగలో స్నానం చేయండి. పాపాలన్నీ కొట్టుకుపోతాయి. ప్రతి సంవత్సరం 100 మణుగుల పాపాలు చేయండి. ఒకసారి గంగలో మునగండి. పాపాలన్నీ మిమ్మల్ని వదిలి పారిపోతాయి. మీరు సమాజమును మోసం చేయాలంటే అధికారులకు లంచమివ్వవలసి ఉంటుంది. భగవంతుడిని మోసం చేయటం చాలా తేలిక. గంగానదిలో ఒక్క మునుగు మునగండి. గంగ మీ పాపాలను ప్రక్షాళన చేస్తుంది. మీరు ఉద్ధరింపబడతారు. అసలు ఈ పద్ధతులు ఏవిధంగా మీకు ఉపయోగపడతాయి? వీటివలన నిజంగా మీకు ప్రాయశ్చిత్తం జరిగి, మీరు పాపాల నుండి విముక్తులౌతారా? ఇటువంటి పనికిమాలిన విధానాలు ఇంకా చాలా ఉన్నాయి. **ఆధ్యాత్మికత యొక్క మూల ఉద్దేశ్యము శుభ్రపరచటం. పవిత్రం కావటం. వ్యక్తిత్వమును, మనస్సును సంస్కరించుకోవటం.** దాన్ని భ్రష్టుపట్టించి ఈవిధమైన ఆధ్యాత్మికతను అందించడమేమిటి? **మనకు ఆధ్యాత్మికవిద్య శ్రేష్ఠమైన జీవితం జీవించటానికి, నిర్మలమైన సామాజిక జీవనం సాగించటానికి నేర్పించబడింది. శీలవంతులుగా, ఆదర్శ వంతులుగా, నిష్ఠావంతులుగా జీవించటం కోసం ధర్మ శాస్త్రము లన్నీ రూపొందించబడ్డాయి. జపతపాలు, పూజా పారాయణలన్నీ ఇందుకొరకే. కానీ మనం వాటినన్నింటినీ చౌకబారైనవిగా చేసాము. భగవంతుడిని ప్రసన్నం చేసుకోవటం కోసం చేస్తున్నాము.** భగవానుని అనుగ్రహము, పరలోకము, స్వర్గం మనకు అతి చౌకగా అందుతున్నాయి అని అనుకుంటున్నారు. ఇక మరి అలాంటప్పుడు మంచి పనులు చెయ్యవల్సిన పనేముంది? లోకకల్యాణము కోసం త్యాగబలిదానాల పరంపర అలవర్చుకోవాల్సిన పనిలేదు. అతి తక్కువగా, చౌకగా లభించే ఉపాయాలను మీరు ఉపయోగించవచ్చు.

(సశేషం)

*- అఖండజ్యోతి, ఫిబ్రవరి 2009*

*అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

**విజేత వెనక ఉండేది అదృష్టమో మంత్రదండమో కాదు. కఠిన శ్రమ, అంకితభావం.**

నావారితో నా మాట

# మనలను అత్యంత సమర్థవంతులుగా తయారు చేసేందుకు పరీక్షా సమయం వచ్చేసింది

### లీలాభరితుడైన మహాకాలుని నూతనదిశ

యుగఋషి జన్మశతాబ్ది మూడు సంవత్సరములలో (2011 నుండి 2013) మొదటి సంవత్సరం పూర్తి కావస్తున్నది. ఈ వ్యవధిలో మనం నిర్వహించిన కార్యక్రమమునకు మహోత్సవము అని నామకరణము చేశాము. (2011 నవంబరు 6 నుండి 10 వరకు). ఇప్పుడు 2012 జనవరి 28వ తేది శనివారం రోజున వచ్చే వసంత పంచమితో ఈ ప్రథమ సంవత్సరం పూర్తి అవుతుంది. మనం మనకు ఎంతో ఇష్టమైన ఆరాధ్యుని యుగఋషి అని పిలుచుకుంటాము. ఆయననే మహాకాలుడని భావిస్తాము. సాక్షాత్తూ సదాశివుడే మహాకాలుని రూపంలో మన మధ్యకు వచ్చి ఈ యుగ ప్రత్యావర్తన ప్రక్రియలో మనల్ని కూడా భాగస్వాములను చేసి మన జీవితాలను ధన్యం చేశారు. మనం ఆయన క్రియాపద్ధతి పట్ల అవగాహన కూడా పెంచుకోవాలి. ఆయన చేసే తాండవ నృత్యానికి అనుగుణముగా మనల్ని మనం మార్చుకునేందుకు సంసిద్ధులం కావాలి. పరమపూజ్య గురుదేవులు స్వయంగా ఇలా వ్రాశారు– “మహాకాలుడు కలిపురుషుని ఆటకట్టించేందుకు, అతని మాయామరీచికలను పరాజయం పాలు చేసేందుకు తాండవ నృత్యం చేస్తాడు” ప్రస్తుతము ఈ నృత్యమే జరుగుతున్నది.

### మానవజాతి యొక్క ఆశాకిరణమే ఈ సంస్థ (మిషన్)

గత సంచికలలో మీరు సామూహికశక్తి యొక్క సృజనాత్మకతను, నిర్మాణ కౌశల్యములను, చమత్కారములను గురించి చదివారు. కొంత వ్యవధి తరువాత మళ్ళీ మనం కార్యక్రమములను అన్నింటినీ తిరిగి ప్రారంభిస్తున్నాము. ఈ కార్యక్రమములు ఇలా అనవరతంగా జరుగుతూనే ఉంటాయి. వీటిలో విరామము తీసుకోవడం, సమాప్తి చేయడం లాంటివి చేస్తే సముచితముంగాదు అవి అనవరతము తీవ్రమైన వేగములో అలా జరుగుతూనే ఉండాలి. ఎందుచేతనంటే ఈ రోజులలో మానవజాతికి ఏదైనా ఆశ ఉన్నది అంటే అది అఖిల విశ్వ గాయత్రీపరివార్ సంస్థ మాత్రమే. ఇది నేరుగా హిమాలయాల నుండి సంచాలితమౌతుంది. మనము జరిగిపోయిన సంఘటనలను గురించి బాధపడకుండా, జాగరూకులై ఉంటూ ఆత్మశక్తిని పెంచుకోవాలి. చనిపోయినవారి ఆత్మలకు శ్రద్ధాంజలి సమర్పించి గురుదేవుల పనిని వేగవంతం చేయాలి. అప్పుడే మహాకాలునికి ప్రసన్నత కలుగుతుంది. మనల్ని మనమే ఉత్సాహ పరుచుకుంటున్నప్పటికి, సావధానంగా లేకపోవడం చేత జరిగిన దుర్ఘటనలనుండి చాలా నేర్చుకోవాల్సి ఉన్నదనే ఆలోచనా ధోరణితోనే ముందుకు సాగాలి.

### ఇప్పుడు మనం పక్కకు తిరిగి ఒక కొత్తదిశగా అడుగులు వేయబోతున్నాము

మన మిషన్ జన్మశతాబ్ది సమయంలో ఒక కొత్త దిశగా అడుగులు వేయబోతున్నది. 2011 తరువాత 2012, 2013 సంవత్సరాలు అత్యంత విలువైనవి. ఈ సమయంలో మనం ఎక్కువగా సాధన చేయాల్సి ఉంటుంది. మనం ఎంత ఎక్కువగా సాధనాత్మక ప్రయత్నములు చేయగలుగుతామో 2014కి అంత ఎక్కువగా మనలోసామర్థ్యములు, సద్గుణములు వికసిస్తాయి. విశ్వములో ఇది ఒక విలక్షణమైన సంస్థ. ఇక ఇప్పటినుండి ఆ శక్తివంతమైన సముదాయమునంతటినీ (సంగఠన) కలుసుకునేందుకై ఒక యాత్రను ప్రారంభించబోతున్నాము. జోన్, ఉపజోన్‌లకు సంబంధించిన మన పరిజనులందరు ఈ కార్యక్రమములో పాల్గొనేందుకై బయలుదేరడం జరిగింది. వారంతా మీ వద్దకు వస్తారు. మీకు భవిష్య ప్రణాళికల గురించి తెలియ చేస్తారు. ఇప్పుడు డిసెంబరు, 2012 జనవరి నెలల్లో మేము శాంతికుంజ్ కార్యకర్తలందరికి సాధనాత్మక ప్రశిక్షణ మరియు కార్యకర్తల ప్రశిక్షణా శిబిరములు జరుపుతాము. ఆ తరువాత అన్ని ప్రాంతాలలోను ఈ శిబిరాలు నిర్వహించబడతాయి. 2012 ఫిబ్రవరి 1 నుండి మార్చి 21 వరకు కేంద్రస్థానమైన శాంతి కుంజ్‌లో కూడా అంతఃఊర్జా శిబిరము జరుగుతుంది. అందరినీ కలుసుకునేందుకై యాత్రాక్రమము, క్షేత్రీయసాధనా శిబిరములు, కేంద్రస్థానంలో జరిగే తీవ్రమైన సాధన, ప్రధాన శిబిరముల ద్వారా తగిన వాతావరణము నిర్మితమౌతుంది.

### 2012 సౌర సాధనా సంవత్సరము

2012ను అనుయాజ సంవత్సరముగా మరియు సౌరసాధనా సంవత్సరముగా ప్రకటించడం జరిగింది. ఈ సంవత్సరం

నిన్ను చూసి భయపడేవాడు నిన్ను ద్వేషిస్తాడు.

సూర్యగాయత్రీమంత్ర జపసాధన, ఆహుతులతో పాటు ఇంటింటా దీపయజ్ఞాలు జరగాలి. ప్రతి సాధకుడు కనీసం ఒక మాల సూర్య గాయత్రి చేయాలి. సూర్యగాయత్రీ మంత్రము – **"ఓం భాస్కరాయ విద్మహే దివాకరాయ ధీమహి తన్నో సూర్యః ప్రచోదయాత్".** ఈ మంత్రమును రోజుకు 108సార్లు జపించాలి. ఆ సమయంలో ఉదయించే సూర్యుని ధ్యానించాలి. ఈ జపము వలన ప్రాణశక్తి పెరుగుతుంది. రోగనాశనము, దీర్ఘజీవనము, వికారములను శమింపచేయుట అనేవి ఈ మంత్రము యొక్క ఫలశృతులు. ఈ సంవత్సరం సౌరకళంకాలు, విస్ఫోటము, భయంకర ప్రమాదములతో నిండి ఉంది. వీటినన్నింటినీ ఎదుర్కొనేందుకు తగిన శక్తి సూర్యుని వల్ల మనకు లభిస్తుంది. ఈ జపసాధన వల్ల ఎవరికి ఎటువంటి ఇబ్బంది కలుగదు. దీనితో పాటే 11 మాలల గాయత్రీ మంత్రజపము కూడా జరగాలి. గాయత్రీ మంత్ర లేఖనమును కొనసాగించాలనుకునేవారు కొనసాగించుకోవచ్చు. ఇది అత్యంత మహత్వపూర్ణమైన సాధనా ప్రక్రియ.

## గ్రామ గ్రామాలలో విస్తృతంగా పర్యటించాలి

పరమపూజ్య గురుదేవుల జ్ఞాన శరీరముతో (ఆయన వ్రాసిన పుస్తకములు), పవిత్రపుణ్యక్షేత్రమైన హరిద్వార్ నుండి, యుగ తీర్థమైన ఆవల్‌ఖేడా నుండి మట్టిని, గంగాజలమును తీసుకొని గురుదేవుల జీవన దర్శన ప్రదర్శనలతో ఆరు శతాబ్ది జ్ఞానరథ యాత్రలు 2011 మే నుండి సెప్టెంబరు వరకు దేశమంతటా పర్యటించాయి. ఇప్పుడు గురుసత్తాను చాలా త్వరితగతిన గ్రామాల వరకు తీసుకువెళ్ళాలి. ఈ ప్రక్రియ ప్రారంభం కాబోతున్నది. గుర్తుంచుకోవలసినది ఏమిటంటే ఈ కార్యక్రమం ద్వారా యుగఋషి ఆలోచనలను అందరికీ తెలియచేసి వారి పట్ల ప్రతి ఒక్కరిలో శ్రద్ధను జాగృతము చేయాలి. ఇప్పటికీ ఎన్నో ప్రాంతాలలో గురుదేవుల గురించి తెలియదు. అక్కడికి మన మిషన్ కార్యక్రమాలు చేరనేలేదు. ఇందుకు సంబంధించిన చార్ట్ తయారౌతున్నది. మీ అందరి సహకారంతో ఈ కార్యక్రమము నిర్వహించబడుతుంది.

## కొన్ని మహత్వపూర్ణమైన బాధ్యతలు

గురుదేవుల ఆలోచనలను గురించి తెలియని పెద్దపెద్ద క్షేత్రాలలోకి ఆయన సాహిత్యమును తీసుకువెళ్ళాలి. ఇది చాలా ముఖ్యమైనపని. ఇందుకొరకు అన్ని ప్రాంతాలలో పుస్తకప్రదర్శనలు నిర్వహించాలి. తద్వారా ఈ సంజీవనీ విద్య అన్ని ప్రాంతాలకు చేరుతుంది. మహత్వపూర్ణమైన రెండవకార్యము మిషన్ యొక్క భవిష్యత్తు అయిన యువశక్తికి మెల్లిగా అన్ని బాధ్యతలను అప్పచెప్పాలి. ప్రస్తుతము మిషన్‌ను నడుపుతున్న యంత్రాంగ మంతా ఇదే కోరుకుంటున్నది. అఖండజ్యోతి యొక్క జన్మశతాబ్ది (1926) సమయానికి బాధ్యతలు స్వీకరించగలిగే శక్తివంతమైన యువసంగఠనను తయారుచేయాలి. పూజ్యగురుదేవుల పరంపరలనన్నింటినీ ఆచరిస్తూ అందరి వద్దకు తీసుకువెళ్ళేలా వారిని తీర్చిదిద్దాలి. ఇందుకొరకు యువసమ్మేళనాలు అన్నిచోట్లా జరగాలి.

## నిర్మాణాత్మక కార్యక్రమాలకు దిశ లభించింది

పంచసూత్రీయ కార్యక్రమాలకు దిశ ఇవ్వడమనేది చాలా గొప్ప బాధ్యత. అవి 1) వృక్షగంగ, వృక్షమిత్ర, తరుపుత్రుల అభియానం 2) జలసంరక్షణ (మైక్రోవాటర్ హార్వెస్టింగ్) 3) వ్యసనవిముక్తి, 4) ప్రతి జిల్లాలో ఆదర్శ గ్రామములను తయారు చేయుట, 5) జిల్లాకు కనీసం ఒకటైనా శ్రీరామస్మృతి ఉద్యాన వనమును పెంచాలి. ఈ ఐదు కార్యక్రమాలను సాధనాత్మక సూత్రముతో కలిపి వేగము పుంజుకునేటట్లు చేస్తే రాబోయే రెండు సంవత్సరాలలో దేశమంతటికి చికిత్స చేయడం పూర్తౌతుంది. ఈ ఐదు కార్యక్రమాలలో వ్యక్తి, కుటుంబ, సమాజనిర్మాణములకు సంబంధించిన సమగ్రమైన సూత్రములు ఇమిడి ఉన్నాయి. ఈ వసంత పంచమి నుండి మన సృజనసేనానులంతా రెట్టించిన ఉత్సాహముతో ఈ కార్యక్రమాలలో పాలుపంచుకోవాలి.


## లక్ష్యమును గుర్తుంచుకోండి

మనకు నాలుగు బలహీనతలున్నాయి. అవి 1) నిర్లక్ష్యము, 2) బద్ధకము, 3) అహంకారము, 4) మదము మరియు నెగిటివిటి (నిషేధాత్మక ఆలోచనలు). మనము ఈ బలహీనతల నుండి బయటపడలేమా? అందుకు సాధన మనకు శక్తినిస్తుంది. మన గురుదేవులు మహాకాలుడు. ఆయన మనలను పాత్రత కలవారిగా మార్చి శక్తినిస్తాడు. ఆయనయే యోగీశ్వరుడైన శ్రీకృష్ణునివలె సుపాత్రులైన వారిని అర్జునులుగా భావించి గీతోపదేశం చేసి ఆయన అంశలుగా తయారుచేస్తారు. మనము ఈ వసంతపంచమి నుండి లాల్‌మషాల్‌ను ఒక ఉద్యమంగా భావించి మన ప్రాంతాల నుండి బయలుదేరి **"మనం మారదాం–యుగం మారుతుంది"** అనే నినాదంతో ప్రజల మధ్యకు వెళ్ళాలి. ఇది ఇంక్విలాబ్ జిందాబాద్ తరహాలో వ్యక్తుల నాలుకమీద తాండవించాలి. లేవండి –మేలుకోండి–ఆగకండి– ఎందుకంటే యుగనిర్మాణమనే లక్ష్యము వరకు మనం చేరుకోవాలి.

*– అఖండజ్యోతి, జనవరి 2012*

*అనువాదం: శ్రీమతి వల్లీశ్రీనివాస్*

మంచికోసం జరిగే మార్పులలో కొన్ని అసౌకర్యాలు, ఇబ్బందులు తప్పవు.



ఆరోగ్యమే మహాభాగ్యం - 14

# హోమియో వైద్య సేవ

**కీళ్ళనొప్పులకు హోమియోలో పరిష్కారం తెలియ జేయగలరు?** ***- జె.ఎస్.ఎస్.శర్మ, హైదరాబాద్***

పూర్వం వయసు మీద పడ్డాక వచ్చే కీళ్ళనొప్పులు ఇప్పుడు నడివయసు రాకముందు నుంచే బాధిస్తున్నాయి. జీవనశైలి, ఆహారపు అలవాట్లలో మార్పురావడం, స్థూలకాయం ఈ సమస్య ఎక్కువ మందిలో కనిపించడానికి ప్రధాన కారణాలు.

సాధారణంగా వృద్ధాప్యంలో పీడించే సమ్యలతో ప్రధానమైనది కీళ్ళసమస్య. కీళ్ళ నొప్పులకు ముఖ్య కారణం ఆర్థ్రైటిస్. ఈ సమస్యలో ఎముకలు అరిగి కీళ్ళ నొప్పి రావచ్చు. సాధారణంగా ఈ సమస్య మోకాళ్ళు, భుజాలు, మడమలు, మణికట్టు వంటి ప్రదేశాలలో వచ్చే అవకాశం ఉంది. కాని ఐదుకంటే ఎక్కువ కీళ్ళకు ఈ సమస్య వస్తే దానినే పాలీ ఆర్థ్రైటిస్ అంటారు. రుమటాయిడ్ ఆర్థ్రైటాయిస్, సోరియాటిక్ ఆర్థ్రైటిస్, SLE, పాలీ మయాల్జియా రుమాటికా, ఇన్‌ఫెక్షన్స్, కాన్సర్, డయాబెటిస్ కారణంగా ఆర్థ్రైటిస్ సమస్య ఏర్పడే అవకాశం ఉంది.

**వ్యాధి లక్షణాలు :**

నొప్పి, వాపు, సమస్య ఉన్న ప్రదేశం ఎర్రగా కందిపోవడం, వాపువద్ద వేడిగా ఉండటం, కదలికలు కష్టంగా ఉండటం వంటివి ఈ వ్యాధి లక్షణాలు. ఆర్థ్రైటిస్ వ్యాధి నిర్ధారించేందుకు ఆర్.ఎ. ఫ్యాక్టర్, ఎ.ఎస్.ఓ. టైటర్, కీళ్ళ ఎక్స్‌రే, సిబిపి, ఇఎస్ఆర్, ఎఫ్‌బిఎస్, ఆర్‌బిఎస్, పిఎల్‌బిఎస్, ఎఎన్ఎలతోపాటు సీరమ్ క్యాల్షియం పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుంది. కీళ్ళనొప్పుల సమస్యతో బాధపడేవారు. ముఖ్యంగా బరువు తగ్గడానికి ప్రయత్నించాల్సి ఉంటుంది. అలాగే క్రమం తప్పకుండా వ్యాయామాలు చేయాలి.

**హోమియో చికిత్స :**

హోమియో వైద్య విధానంలో రోగి లక్షణాలను బట్టి, రోగి వ్యక్తిత్వాన్ని బట్టి తగిన చికిత్స చేస్తారు. ఈ సమస్యకు హోమియోలో వాడదగిన మందులు బ్రయోనియా, కాల్చికమ్, లెడమ్‌పాల్, రస్టాక్స్, లైకోపోడియం, మెర్క్‌సాల్, ఫెర్రమ్‌ఫాస్, కాల్కేరియా ఫాస్.

**బ్రయోనియా:** సన్నగా, ధృఢముగా, నల్లగా ఉండి, తొందరగా చిరాకు పడేవారికి ఇది మంచి మందు. ఎప్పుడూ తాము చేసే వృత్తి గురించే మాట్లాడుతుంటారు. ఎప్పుడూ ఇంటికి వెళ్ళాలనుకుంటారు. శరీరంలో ఉండే మ్యూకస్ మెంబ్రేన్స్ అన్నీ పొడిగా ఉంటాయి. కీళ్ళు పట్టినట్లు ఉండి నొప్పి కలుగచేస్తాయి. కీళ్ళవాపువేడి, ఎరుపుదనం మొదలైన లక్షణాలుంటాయి. నొప్పులు సూదులతో గుచ్చినట్లు, కదిలితే బాధ అధికమవడం, విశ్రాంతి తీసుకుంటే కొద్దిగా నొప్పులు తగ్గడం వంటివి లక్షణాలు. వీరికి దాహం ఎక్కువగా ఉంటుంది. మలబద్ధకం, వేడిని భరించలేక పోవడం వంటి లక్షణాలు ఉంటాయి.

**కాల్చికమ్:** ఇది వాతరోగం ఉన్నవారికి మంచి మందు. ఇది ఎముకల చుట్టూ ఉండే పొర. కీళ్ళు, కండరాలు మొదలైన వాటి మీద ప్రభావం చూపుతుంది. నీరసం, శరీరం లోపల చల్లగా ఉండడం, కీళ్ళవాపు, నొప్పి, కీళ్ళుపట్టినట్లు ఉండడం, తిమ్మిర్లు, నొప్పి ఒక కీలు నుంచి ఇంకొక కీలుకు మారుతుండడం, స్పర్శకి నొప్పి అధికమవడం, కాళ్ళు, చేతులు చల్లబడిపోవడం మొదలైన లక్షణాలు ఉంటాయి.

**రస్టాక్స్:** ఒకచోట కుదురుగా కూర్చోలేరు. ఉత్సాహంగా ఉండరు, రాత్రిపూట భయం, గుండెదడ, అధిక శ్రమ, బరువులు మోయడం వల్ల వచ్చిన సమస్యలు, కీళ్ళనొప్పులు, వాపులు, చేతులు, కాళ్ళు పట్టినట్లు ఉండే నొప్పి, చల్లగాలి భరించలేరు, తిమ్మిర్లు సయాటికా వంటి లక్షణాలు ఉంటాయి.


**లైకోపోడియం:** దిగులు, ఒంటరిగా ఉండాలంటే భయం, కొత్త పనులు చేయడానికి ఇష్టపడరు. ఆత్మవిశ్వాసం కోల్పోవడం, మతిమరుపు, తీపి పదార్థాలను ఎక్కువగా ఇష్టపడడం, కీళ్ళనొప్పి, వాపు, వాతరోగం, కాళ్ళు చేతులు బరువుగా ఉండడం, కీళ్ళదగ్గర చిరిగినట్లు నొప్పి, పాదాల నొప్పి, కాలివేళ్ళు, పిక్కలు రాత్రివేళ కొంకర్లు పోవడం వంటి లక్షణాలు ఉంటాయి. సమస్య వేడి వాతావరణంలో ఎక్కువగా ఉంటుంది.

**సలహాల కొరకు సంప్రదించవల్సిన చిరునామా**


**డా॥ టి. నీలవేణి,** బి.హెచ్.ఎమ్.ఎస్.
ఆర్.ఎన్..జి. అడ్వాన్స్‌డ్ హోమియో క్లినిక్
ఇ.నెం. 3-211, యశోద గార్డెన్స్ దగ్గర,
శాంతినగర్, కూకట్‌పల్లి, హైదరాబాద్ - 500 072.
ఇ-మెయిల్: drneelaveni@gmail.com


*ఈ శీర్షిక హోమియో వైద్య విధానం మీద అవగాహన పెంచుకోవడానికే. దయచేసి స్వంత వైద్యం ప్రయత్నించవద్దని మనవి.*

**మంచివాణ్ణి పొగిడితే మరింత మంచివాడవుతాడు. అదే చెడ్డవాణ్ణి పొగిడితే ఇంకా చెడ్డగా తయారవుతాడు.**



# సుభాషితాలలో సుధారస బిందువులు - 3

పరోపకారతత్వం కల్గిన సజ్జనులు ఈ క్రింది లక్షణాలను కల్గి ఉంటారు.

**ఆశాసంహరణంబు, నోర్మియు మదత్యాగంబు, దుర్దోషవాం**
**ఛాశూన్యత్వము, సత్యమున్, బుధమతాచారంబు, సత్సేవయున్**
**వైశద్యంబును, శతృలాలనము, మాన్యప్రీతియుం బ్రశ్రయ**
**శ్రీశాలిత్వము, దీనులందు గృపయున్, శిష్టాలికిన్ ధర్మముల్**

ఆశాపాశములను దగ్గరకు రానీయరాదు. తనవి కాని వస్తువుల పట్ల ఆశ, ఇతరులకు చెందిన వస్తువుల పట్ల ఆకర్షణ కల్గి ఉండడమే దురాశ. అటువంటి దురాశకు దూరంగా ఉండడమేమంటే, మనకు రావలసినది ఆ భగవంతుడే ఇస్తాడు. ఇతరులకు సంబంధించిన వస్తువులను ఆశించడం, వాటిని సాధించుటకు తప్పుడు మార్గాలను అనుసరించడం, పాపాలను చేయడానికి కారణమైన ఆశను కల్గి ఉండరాదు. ఓర్పు, సహనములను కల్గి ఉండాలి. అంటే విద్యపట్ల, లక్ష్యసాధనపట్ల ఓర్పును కల్గి ఉండాలి. కొన్ని సమయాలలో వైఫల్యాలు, అపజయాలు, ఆటంకాలు ఎదురైనప్పటికీ, తాను చేపట్టిన కార్యాన్ని మధ్యలో విడిచి పెట్టకుండా, చివరి వరకు కొనసాగించే ఓర్పును కల్గి ఉండాలి. అతిశయాన్ని, (అహంకారాన్ని) విడిచి పెట్టాలి. "అహం- బ్రహ్మాఽస్మి" అనే ధోరణిని విడిచిపెట్టాలి అంటే "నాకే అన్ని తెలుసును. నేను చెప్పినదే వేదం. నా గమనమే సరియైనది, ఇతరుల ఆలోచనలు, ఆశయాలు అన్నీ దోష పూరితాలు" అన్న ధోరణిని విడనాడాలి. మంచి ఎక్కడ ఉన్నా, ఎవరిలో ఉన్నా దానిని స్వీకరించగలగాలి. పాపములు అనగా ఇతరులను హింసించడం, వారు బాధపడుతుంటే చూసి ఆనందించడం వంటి పైశాచిక కోరికల పట్ల ఆసక్తిని కల్గి ఉండరాదు. సత్యమును పలకడం, పెద్దలు, సజ్జనులు నడిచే త్రోవలో నడవడం, సర్వకాల సర్వావస్థల యందు సజ్జనులను సేవించుట, శత్రువులను సైతం ప్రేమించే ఔన్నత్యము, వినయముతో ఇతరుల ప్రశంసలను పొందే రీతిలో ప్రవర్తించుట, సకల సంపదలు (అష్టసిద్ధులు) కల్గి ఉండుట, ఆర్తులు, దీనులు, వృద్ధులు, వికలాంగుల పట్ల జాలి, దయ, కరుణ వంటి మానవతా గుణాలను కల్గి ఉండడమే, శిష్టులకు, సజ్జనులకు ప్రధాన లక్షణాలుగా భర్తృహరి ప్రతిపాదించాడు. ఈ శిష్టగుణాలను ఆచరించడం ప్రతి ఒక్కరి కర్తవ్యం.

**తృష్ణాంఛింది, భజక్షమాం, జహిమదం, పాపేరతిం, మాకృథాః**
**సత్యంబ్రూహ్యనుయాహి సాధుపదవీం, సేవస్య విదృజ్జనమ్ ।**
**మాన్యాన్ మానయ, విద్విషోఽప్యనునయ ప్రఖ్యాపయ ప్రశయం**
**కీర్తిం పాలయ దుఃఖితే కురు దయామేతత్ సతాం చేష్టితమ్ ॥**

ఉత్తమ గుణాలు, ఉన్నత భావాలుగల వ్యక్తులు సమాజంలో చాలా అరుదుగా కన్పడతారని వివరించారు ఈ క్రింది పద్యంలో.

**హృదయవచశ్శరీరముల నెంతయుఁ బుణ్య సుధా ప్రపూర్ణులై**
**ముదము బహూపకారముల మూడు జగంబులకున్ ఘటించుచున్**
**వదలక సాధు సద్గుణలవంబులు గొండలు సేసి మెచ్చుచున్**
**మదిని వికాసయుక్తులగు మాన్యులు గొందరువొల్తురిద్ధరన్ ॥**

తనువు, మనసు, వాక్కులలో పుణ్యము పొందవలెనన్న సంకల్పాన్ని కల్గి ఉండడం యశస్సును కల్గించును. త్రికరణ శుద్ధిగా మంచి పనులను చేయవలెనన్న సంకల్పాన్ని కల్గి ఉండడం, అందరికీ సహాయం చేస్తూ, ఇతరుల ఆనందమే తమ ఆనందంగా భావిస్తూ, ముల్లోకాలకు మంచి సేవలను అందించాలన్న తపనతో, ప్రవర్తిస్తూ ఉండడం, ఇతరులలోని పరమాణుప్రాయంగా కన్పించే స్వల్ప గుణాలను సైతం అభినందిస్తూ, అందరిముందు ఉన్నతంగా, ఉత్తమంగా ప్రశంసిస్తూ ప్రోత్సాహకరంగా, స్నేహ పూర్వకంగా అభినందించి ఇతరుల పురోగతికి దోహదపడడం, వారి విజయాలలోనే తాము పరిపూర్ణ ఆనందాన్ని పొందే ఉత్తములు ఈ లోకంలో అరుదుగా అగుపిస్తారు. అటువంటి పరోపకార తపోధనులు ధృవతారలుగా లోకంలో ప్రకాశిస్తారు.

**మనసి వచసికాయే పుణ్య పీయూష పూర్ణా**
**స్త్రి భువన ముపకార శ్రేణిభిః ప్రీణయన్తః**
**పరగుణ పరమాణున్ పర్వతీ కృత్యనిత్యం**
**నిజహృది వికసన్తః సన్తి సన్తః కియన్తః**

## మానశౌర్య పద్ధతి

అభిమానమేధనముగా కల్గినవారిని మానధనులుగా పేర్కొంటారు. వీరు ఎంతటి కష్టకాలం ఎదురైనా, చివరికి మృత్యు ద్వారం వద్ద నిల్చినప్పటికీ, తమ స్థాయికి తగినట్లుగా, దిగజారే మనస్తత్వం లేకుండా, ఆత్మాభిమానంతో ప్రకాశిస్తారు. తమ జీవన స్థితిగతులలో ఒడిదుడుకులు ఎదురైనప్పటికీ, మొక్కవోని ధైర్యంతో, స్వాభిమాన ధనంతో, తలవంచని శిఖరంలా తలపడుతూ ఉంటారు. వారిని ఆదర్శంగా తీసుకోవాలన్న సదుద్దేశ్యంతో, భర్తృహరి మానశౌర్యపద్ధతి ద్వారా ఇలా వివరించారు.

ఎంత అరగదీసినా గంధపుచెక్క పరిమళాన్ని కోల్పోదు. ఎన్ని కష్టాలెదురైనా ధీరుడు ఆత్మవిశ్వాసం కోల్పోడు.

**గ్రాసము లేక స్రుక్కిన జరాకృశమైన విశీర్ణమైనసా**
**యాసమునైన నష్టరుచియైనను బ్రాణ భయార్తమైనని**
**స్త్రాసమదేభకుంభ పిశితగ్రహలాలసశీలసాగ్రహా**
**గ్రేసరభాసమానమగు కేసరి జీర్ణ తృణంబు మేయునే?**

జంతువులన్నింటిలోనూ, సింహము మానధనానికి ప్రతీకగా పేర్కొనదగిన జంతువు. అందుకే మృగరాజుగా భాసిల్లుతోంది. సింహం వృద్ధాప్యం (ముసలితనం) చేత బలహీనమైనప్పటికీ, తిండి లేక రోజుల కొద్దీ బాధపడుచున్నప్పటికీ, శక్తి లేకున్నప్పటికీ, ఆహారము కొరకు ఇతరులపై ఆధారపడని ఆత్మాభిమానంగల జంతువు. తానే స్వయంగా మధించిన ఏనుగుల కుంభస్థలం పైకి లంఘించి, దానిని చీల్చి చెండాడే సమర్ధవంతమైన, సాహసోపేతమైన మృగరాజు సింహం. అంతేకాని శక్తి లేదన్న నెపంతో గడ్డితో కాలక్షేపం చేసి, తన ఆకలిని తీర్చుకొనే యత్నం చేయదు. పైగా ఇతర జంతువులు చంపిన జంతుమాంసాన్ని ఎంగిలిగా భావించి, వాసన చూసే యత్నం కూడా చేయదు. అలాగే మానవుడు కూడా ఋజు స్వభావంతో, ఎటువంటి రాజీ లేకుండా తాను అనుకున్న లక్ష్యాన్ని సాధించే యత్నం చెయ్యాలి. పరిస్థితులు అనుకూలించకపోయినప్పటికి, ఎటువంటి అడ్డదారులు త్రొక్కకుండా, ఇతరులను 'దేహి' అని అర్థించక, రాజసంతో, ఠీవితో మెలిగినపుడే అతనికి పరిపూర్ణత లభిస్తుంది.

శకుంతల, దుష్యంతుల ప్రియపుత్రుడైన భరతుడు ఏడేళ్ళ పసిప్రాయంలోనే తన వయస్సుకు భిన్నంగా, మానధన వ్యక్తిత్వంతో సింహపు కిశోరం (పిల్ల) తో ఆటలాడుతూ, వాటి దంతాలను లెక్కించే ప్రయత్నం చేసాడని కాళిదాసు రచించిన "అభిజ్ఞాన శాకుంతలమ్" ద్వారా మనకు తెలుసు. ఆ యువ కిశోరమే, పెరిగి పెద్దవాడయి భరతజాతి గర్వించేరీతిలో, భారతీయులమని సగర్వంగా ప్రకటించే రీతిలో, భారతదేశం అన్న సార్థక నామాన్ని పొందే రీతిలో అత్యున్నత గుణగణాలతో శోభిల్లిన మానధనుడు.

**ప్రాణానపి పరిత్యజ్య, మానమేవాభిరక్షయేత్ ।**
**ప్రాణాస్తతంగ చపలా, మానమాచంద్రతారకమ్ ॥**

అన్న ప్రసిద్ధ ఆర్యోక్తి ప్రకారం ప్రాణాలను సైతం పరిత్యజించి, మానాన్ని రక్షించుకోవాలి. ప్రాణం కేవలం తరంగాల (కెరటాల) వలే చంచలమైనది. 'మానము' సూర్యచంద్రుల నక్షత్రాల వలే ఉన్నతమైనది, శాశ్వత మైనది. కావున మానధనులు అభిమాస ప్రవృత్తితో శోభిల్లుతారు.

**క్షుత్ క్షామోఽపి జరాకృశోఽపి శిథిలప్రాయోఽపి కష్టాందశా**
**మాపన్నోఽపి విపన్న దీధితిరపి ప్రాణేషు నశ్యత్స్వపి ।**
**మత్తేభేన్ద్ర విభిన్న కుమ్భపిశిత గ్రాసైక బద్ధ స్పృహః**
**కింజీర్ణం తృణమత్తిమాన మహతామగ్రేసరః కేసరీ ॥**

– సాధన నరసింహాచార్య

## కుటుంబ నిర్మాణము తరువాతే సన్యాసాశ్రమ స్వీకారం

*స్వామీ విద్యానంద్ ఒక గృహస్థు. పిల్లలు కలవాడు. కానీ సాధువుల, సత్పురుషుల సాంగత్యం వలన వారి ఉపదేశాలకు ప్రభావితుడై సాధువేషాన్ని ధరించి తీర్థయాత్రలకు బయలుదేరాడు. ఎక్కడకు వెళ్ళినా సాధువుల వద్దనే బసచేస్తూ వారిని అధ్యయనం చేయసాగాడు. ఎవ్వరినైతే ప్రజలు జ్ఞానులని, తాపసులని భావిస్తున్నారో వారంతా ఆయన అధ్యయనంలో దొంగలుగా, వ్యభిచారులుగా, వ్యసనపరులుగా చూచాడు. ఈ కటు అనుభవాలు విద్యానంద్‌కు అమిత దుఃఖాన్ని కలిగించాయి. కాషాయ వస్త్రాలను పరిత్యజించి నాగలి చేతపట్టి రైతు వేషధారియై జీవనయాత్రను ప్రారంభించాడు. ఒకవైపు వ్యవసాయంచేస్తూ కుటుంబ బాధ్యతలను శ్రద్ధతో నిర్వర్తిస్తూ మిగిలిన కాలాన్ని ధనాన్ని పరిసర ప్రాంతాల్లో విద్యయొక్క గొప్పదనం గూర్చి, నైతిక విలువలను గూర్చి ప్రచారం చేయటానికి వినియోగించేవాడు. ఆయన ఒక చక్కని విద్యాలయాన్ని నిర్మించి తన పిల్లలతోపాటు అనేకమంది పేద పిల్లలను శ్రద్ధతో చదివించాడు. పండించిన పంటను పూర్తిగా సత్ప్రయోజనాలకు ఖర్చుచేసేవాడు. క్రమంగా ఈయనకు అనేకమంది సహకారులు లభించసాగేరు. వారికి కూడా ఈ విధంగా విద్యాలయాలు నడుపటానికి, సత్సంగాలు జరుపటానికి శిక్షణనిచ్చి ముందుకు నడిపించసాగేడు. సన్యాస ధర్మాన్ని వదిలివేయటంవలన మీరు మీ జీవితంలో పొరపాటు చేశాననిగానీ, నష్టపోయాననీగాని అప్పుడప్పుడూ అనుకుంటూ ఉంటారా? అని ఎవరైనా ప్రశ్నించినపుడు ఆయన "ఎంత మాత్రం లేదు", ఒక విధంగా స్వీకరించి తప్పుచేశాను, వదలివేసిన తరువాత కుటుంబవికాసంతోపాటు సమాజంయొక్క నవనిర్మాణంలో తన పాత్రను పోషిస్తున్నానని అనేవాడు.*

– ప్రజ్ఞాపురాణం నుండి

**తెలివితేటలు, సామర్థ్యం ఉన్నా సాధించాలన్న తపన లేకపోతే మిగిలేది వైఫల్యమే.**

# పుష్యమాస ప్రాశస్త్యం

పుష్యమాసం తెలుగు నెలల క్రమంలో పదవమాసం. ఈ మాసంలో పండుగల సంఖ్య తక్కువగా ఉన్నప్పటికీ, ఆధ్యాత్మికంగా, పౌరాణికంగా కొన్ని ముఖ్య ఘట్టాలు మనకు అగుపిస్తాయి.

## రైవతమన్వాది దినం - రేవతి నక్షత్ర కథ

'రైవతుడు' అనే ధర్మవేది రేవతి, దుర్ధములకు జన్మించి, కాలక్రమంలో రైవత మనువుగా పేరొందిన 5వ మనువు. ఈ మన్వంతరంలో 'విభుడు' అనునతడు ఇంద్రుడు. హిరణ్యరోముడు, వేదశ్రీ, ఊర్ధ్వబాహుడు, వశిష్టుడు మొదలైన సప్తఋషులుగా లోకరక్షణ చేసెడివాడు.

పూర్వం 'ఋతువాక్కు' అనెడి మహా మునికి, రేవతి నక్షత్రం నాలుగవ పాదంలో కుమారుడు జన్మించెను. ఆ కుమారుడు పెరిగి పెద్దవాడై సకల దుర్గుణములతో దుర్జనుడై అందరినీ పీడించ సాగెను. అతని దుష్ప్రవర్తనకు కారణం జన్మనక్షత్రమైన రేవతి అని భావించిన ఋతువాక్కు మిక్కిలి కోపముతో నక్షత్ర మండలం నుండి రేవతికి క్రిందకు పడిపొమ్మని శపించెను.

ఆ శాపం కారణంగా ఆ నక్షత్రం ద్వారక దగ్గరలోగల 'కుముదం' అనే కొండపై పడింది. రేవతి నక్షత్రం పడిన కారణంగా ఆ కొండకు 'రైవతకం' అనే పేరు కల్గినది. ఆ తాకిడికి ఆ పర్వత లోయల మధ్య ఒక తామర కొలను ఆవిర్భవించెను. అందునుండి ఒక కన్యక ఉద్భవించగా, ఆ కన్యకను ప్రముచుడు అనే ఋషి చేరదీసి 'రేవతి' అనే పేరును పెట్టి పెంచి పెద్ద చేశాడు.

తర్వాత 'దుర్దముడు' అనెడి రాజుతో వివాహం జరిపించాలని సంకల్పించిన ఆ మునితో రేవతి, తన వివాహము "రేవతి" నక్షత్ర సమయంలో జరిపించమని తండ్రిని ప్రార్థిస్తుంది. తండ్రి ఆమెతో రేవతి నక్షత్రం భూమిపై పడిపోయినదని, చంద్రయోగం కూడా లేదు కావున అది సాధ్యపడదు అని తెలుపగా, దానికి ఆమె అలకబూని, తన పేరుతో సాదృశ్యం కల రేవతి నక్షత్రానికి తిరిగి పునర్వైభవాన్ని ప్రసాదించి, అదే సమయంలో తన వివాహం జరగాలని పట్టుబట్టెను. చివరకు ఆ ముని, కుమార్తె మాటను కాదనలేక తన తపశ్శక్తితో రేవతి నక్షత్రాన్ని పునః ప్రతిష్ఠించెను.

ఆ విధంగా రేవతి నక్షత్రం, రైవతకుని కథలను తెలిపే ఈ పుష్య ఏకాదశిని పుత్రైకాదశిగా పేర్కొంటారు.

పుష్యమాసపు పౌర్ణమిని "తైపూసమ్" పర్వదినంగా తమిళనాట ప్రసిద్ధి చెందినది. "తిరునల్వేణి" అనే ప్రదేశంలో ఈశ్వరి "తామ్రపర్ణి" నదీ తీరాన తపస్సును ఆచరించినది. ఈశ్వరుడు ఆమెను అనుగ్రహించిన పర్వదినం పౌర్ణమి కావున ఆనాడు (పుష్య పున్నమి) తిరునల్వేణిలో స్నానాన్ని ఆచరిస్తే సర్వపాపాలు తొలగిపోతాయన్న నమ్మకం ఏర్పడింది.

అంబ సముద్రం తాలుకాలో "తిరుప్పుదైమారుతూరు" అనే గ్రామంలో గల దేవాలయంలో ఇంద్రుడు తన భక్తి ప్రపత్తులతో తాను చేసిన పాపాలను పోగొట్టుకున్నాడని అందువలన పున్నమి రోజున పూజలను ఆచరించినచో పాపరహితం కలుగుతుందని విశ్వాసం.

వైదీశ్వరన్ కోవెలలో సుబ్రహ్మణ్యస్వామికి పార్వతీదేవి వేలాయుధమును పౌర్ణమినాడే ప్రసాదించిన కారణంగా గొప్ప ఉత్సవం జరుగుతుంది. అలాగే "పళని"లో కూడా సబ్రహ్మణ్య స్వామికి విశేష పూజలు జరిగే పుణ్యాల పున్నమే ఈ పుష్యపున్నమి.

ఈ పౌర్ణమి రోజున భవిష్య పురాణాన్ని దానంగా అగ్నిష్టోమ ఫలము కలుగుతుంది. ఈ పున్నమినాడు చేసే అభ్యంగన స్నానం సర్వదుఃఖాలను దరిద్రాలను నాశనం చేస్తుందని నమ్మకం.

## తంజావూరులోని తైపూసమ్ ఉత్సవ కథ - పౌరాణిక నేపథ్యం

ద్వాపర యుగంలో చోళరాజ్యాన్ని హంసధ్వజుడు అనే రాజు పాలిస్తూ ఉండేవాడు. అతనికి కాశీ, గయ మొదలైన పుణ్య క్షేత్రాలను దర్శించవలెనన్న కోరిక కల్గింది. అయితే పాలనా వ్యవహారాల ఒత్తిడి వల్ల అది వీలుపడలేదు. అతని పక్షాన ఎవరో ఒక బ్రాహ్మణుడు వెళ్ళినా, ఆ ఫలితం దక్కుతుందన్న పెద్దల సూచన మేరకు ఒక బ్రాహ్మణుని పంపడానికి నిశ్చయించి, అతని కుటుంబ బాధ్యతను తానే నిర్వహించే ఒప్పందంతో, అతని భార్యకు కావలసిన సామాగ్రిని సమకూర్చి, బ్రాహ్మణుణ్ణి యాత్రకు పంపిస్తాడు.

కొన్ని నెలలు గడిచిన తర్వాత, రాజు రాత్రివేళ మారు వేషంలో నగర సంచారం చేస్తూ, బ్రాహ్మణుని ఇంటికి వెళ్ళి, కిటికిలో నుండి లోపలకు చూడగా, ఆ బ్రాహ్మణపత్ని వేరొక వ్యక్తితో చనువుగా ఉండడం చూసి ఆగ్రహంతో, ఆవేశంతో లోపలికి వెళ్ళి, ఖడ్గంతో ఆ అపరిచిత వ్యక్తిని హతమారుస్తాడు. కానీ ఆ వ్యక్తే తన భర్తయని, యాత్ర ముగించుకుని అంతకుముందే వచ్చాడని,

**తప్పులను పదే పదే క్షమించడం మరో పెద్ద తప్పుకు దారితీస్తుంది.**

ఆరునెలల యాత్ర వలన శారీరక మార్పుల వలన గుర్తించలేని స్థితిలో ఉన్నాడని ఆ బ్రాహ్మణపత్ని దుఃఖిస్తూ చెప్పగా, ఆ రాజు తన తొందరపాటు చర్యను నిందించుకుంటూ వలవల ఏడ్చాడు. అతనికి బ్రాహ్మణ హత్యాపాతకం కలిగి, అశాంతికి గురి అవుతాడు.

అపుడు భార్గవుడు అనే ముని సూచనపై తీర్థయాత్రలు చేయడానికి బయలుదేరాడు. ఎన్నో క్షేత్రాలను దర్శించినప్పటికీ ఫలితం లేకపోయింది. చివరకు తంజావూరులోని "తిరువిదై మరుదూరు" దేవాలయంలో ప్రవేశించి, తీర్థస్నానాన్ని ఆచరించిన వెంటనే, బ్రహ్మహత్యాపాతకం విమోచనం కల్గి పునీతుడయ్యాడు. ఆనాడు తైపూస పర్వదినం. ప్రతిఏట తైపూస పర్వదినాన ఉత్సవం జరిపించాలని నాటి నుండి ఒక ఆచారాన్ని ప్రవేశపెట్టిన నాటి నుండి నేటివరకు అద్భుతమైన రీతిలో ఉత్సవం జరుగుచున్నది.

పుష్యమాసంలో వచ్చే అమావాస్యనాడు పితృతర్పణం చేస్తే పితృదేవతలు తప్పక తరిస్తారని విశ్వాసం. దీనినే గోదావరి జిల్లాలలో "చొల్లంగి అమావాస్య" అంటారు.

చొల్లంగి సముద్ర తీరాన గల గ్రామం. గోదావరికి గల ఏడు పాయలలో ఒకపాయ ఇక్కడ సముద్రంలో కలుస్తుంది. అందువల్ల అమావాస్య రోజున ఇక్కడ గోదావరిపాయలో స్నానం చేస్తే, నదీస్నాన ఫలం, సముద్రస్నాన ఫలం ఏకకాలంలో కల్గుతాయని భక్తుల నమ్మకం. "తుల్యుడు" అనే ఋషిని అనుసరించి ప్రవహించే గోదావరిపాయ ఇక్కడి సముద్రంలో కలుస్తుంది. ఈ తుల్యభాగ కథను శ్రీనాథుడు తన భీమేశ్వర పురాణంలో పేర్కొన్నట్లుగా, ఈ తులభాగ గోదావరియందు ఉత్తరాయణ, దక్షిణాయన కాలాల్లో, సూర్య, చంద్ర గ్రహణాలలో స్నానాన్ని ఆచరిస్తే పుణ్యఫలాలు కలుగుతాయని ఋషులు పేర్కొన్నారు.

మార్గశిర / పుష్య మాసాలలో వచ్చేవి అతి ముఖ్యమైన పండుగలు వైకుంఠ ఏకాదశి, భోగి, సంక్రాంతి, కనుమలు.

వైకుంఠ ఏకాదశిని ముక్కోటి ఏకాదశిగా కూడా పేర్కొంటారు. స్వర్గద్వారాలు తెరిచే పర్వదినం. ఉత్తర ద్వారం ద్వారా వైకుంఠ ప్రవేశం చేస్తే పునర్జన్మదోషం ఉండదని, ఈనాడే విష్ణు దేవుడు మూడుకోట్ల దేవతలతో కలిసి భూలోకానికి విచ్చేసాడన్న కథ కూడా ప్రచారంలో ఉంది.

కృత యుగంలో చంద్రావతిని నగరాన్ని రాజధానిగా చేసుకుని దుష్టపాలన చేస్తున్న "మురాసురుడు" అనే రాక్షసుడు పెట్టే బాధలకు తాళలేక విష్ణుదేవుని ప్రార్థించగా, విష్ణువు దేవతలతో కూడి వైకుంఠం నుండి భూలోకానికి వచ్చి ఆ రాక్షసుని సంహరించిన పర్వదినం ఈరోజే కావడం వల్ల వైకుంఠ ఏకాదశిగా వ్యవహరిస్తారు. ఈనాడు దైవదర్శనం చేసుకుంటే తప్పక వైకుంఠ ప్రాప్తి కల్గుతుందని విశ్వాసం.

భోగి, సంక్రాంతి, కనుమల ప్రాశస్త్యం వచ్చే వ్యాసంలో తెల్సుకుందాం.

– సాధన నరసింహాచార్య

## ఐక్యత యొక్క మహత్యం

*ఒకచోట విశాలమైన భవన నిర్మాణం జరుగుతోంది. నిర్మాణ స్థలానికి సమీపంలో ఒక ఇటుకల గుట్ట పేర్చబడి ఉన్నది. ఆకాశాన్నంటే అందమైన భవనాల నిర్మాణం మా వల్లనే జరుగుతోందని ఆశ్రేయస్సంతా మాకే దక్కుతుందని గుట్టలోని ఇటుకలు గర్వించసాగాయి. ఇటుకల యొక్క ఈ గర్విష్టి మాటలను సున్నం విని సహించలేక ఆవేశంతో "మీరు అబద్ధాలు చెబుతున్నారు. విడివిడిగా పడుంటే మీ మధ్య నేను లేకుంటే మీ వలన ఏమీ జరుగదు. మిమ్ములను ఏక సూత్రంతో బంధింపచేసి, భవనాన్ని దృఢంగా ఉంచాలంటే నేనుండి తీరాలి." అని పల్కింది. ఈ మాటలు విని కిటికీలు, తలుపులు పకపకానవ్వుతూ "ఆపండి మీ గొప్పలు. ఎంత గొప్పగా భవన నిర్మాణం జరిగినా దానికి కిటకీలు, తలుపులు లేకుంటే శుద్ధ దండగ." అని పలికేయి. ఈ అన్ని మాటలను మౌనంగా వింటున్న శిల్పి "మీరంతా ఎంత గొప్పగా చెప్పుకున్నా నా యొక్క కళానైపుణ్యం వల్ల మాత్రమే భవనానికి సౌందర్యం అనేది లభిస్తోంది. నా చేయి పడకుండా ఎంత పెద్ద భవన నిర్మాణం జరిగినా దాని వంక ఎవ్వరూ చూడరు, ప్రశంసించరు." అని తెలియజేశాడు.*

*చివరకు భవనమే కలుగజేసికొని వారితో "ఆత్మ బంధువులారా! మీరందరూ చాలా గొప్పవారే – కాని కలిసి ఉండాలి అనే సత్యాన్ని విస్మరిస్తే మీలో ఎవ్వరికి అస్తిత్వం ఉండదు. ఐకమత్యం అనేది లోపించి, వ్యక్తిత్వమే ప్రాధాన్యత వహించిన చోట సదా పతనం, పరాభవమే లభిస్తాయి తప్ప విలువ, గౌరవం ఏమాత్రం దక్కవు. కాబట్టి మీరు మీ మీ మిధ్యాడంబరాలను వదలి ఐక్యత యొక్క మహత్యాన్ని గుర్తించండి." అని పలికింది.*

– ప్రజ్ఞాపురాణం నుండి

**ఒక్కోసారి కన్నీళ్లు కూడా మేలే చేస్తాయి. కళ్ళకు కమ్మిన మసకలను తొలగిస్తాయి.**

nityasmaraNIyulu - 3

# ఆదర్శానికి ఆనవాలు అబ్దుల్ కలామ్-2



రామనాథపురం హైస్కూల్‌లో "ఇయదురై సోలొమోన్" అనే ఉపాధ్యాయుడు **"విశ్వాసంతో నువ్వు నీ విధిని కూడా నిర్దేశించగలవు. వీలుంటే తిరిగి వ్రాయ గలవు"** అన్న మాటలు అబ్దుల్ కలామ్‌లో ఆత్మవిశ్వాసాన్ని, క్రొత్త ప్రపంచంపట్ల ఆశల లోకాన్ని కళ్ళముందుంచాయి.

జీవితంలో విజయం పొందడానికి, సత్ఫలితాలను సాధించ డానికి మూడు విషయాల మీద ఆధిపత్యం సాధించాలి. అవి "కోరిక, నమ్మకం, ఆశ" అనేవి. కోరికను కల్గి ఉండడమే కాదు. అది నేరవేరుతుందన్న నమ్మకం. ఆ నమ్మకాన్ని ఎలాగైన నిజం చేయాలన్న ఆశ మన పురోగతికి సోపానాలు. అని నమ్మారు అబ్దుల్ కలామ్.

అబ్దుల్ కలామ్ ఫోర్త్ ఫారమ్‌లో ఉండగా, ఒకసారి పరీక్షలలో గణితంలో తక్కువ మార్కులు వచ్చాయని, "రామకృష్ణ అయ్యర్" అనే ఉపాధ్యాయుడు ఇచ్చిన దండన, కలామ్‌లో మంచి మార్పును తెచ్చి, మరో పరీక్షలో నూరుశాతం మార్కులు తెచ్చుకొనేలా చేసాయి. ఆనాడు ఆ ఉపాధ్యాయుడు ఇచ్చిన ఆశీస్సు రూపంలో "ఈ విద్యార్థి భవిష్యత్తులో మన పాఠశాలకు, అధ్యాపకులకు మంచి పేరు తేబోతున్నాడు" అన్నమాటలు అక్షర సత్యాలయ్యాయి.

ఇంటర్మీడియట్ చదువుకొరకు ట్రిచి (తిరుచ్చి)లో గల సెయింట్ జోసెఫ్ కాలేజీలో చేరినపుడు, అక్కడి హాస్టల్ రూమ్‌మేట్స్ సహచర్యం, అధ్యాపకుల మార్గదర్శనం వల్ల మత సహనం, త్యాగనిరతి, ఇంగ్లీష్ భాష పట్ల మక్కువతో టాల్‌స్టాయ్, స్కాట్, హార్డీల సాహిత్య పరిచయం, తత్త్వశాస్త్రం, భౌతికశాస్త్రం పట్ల ఆసక్తి కలిగాయి.

కొందరు నమ్ముతున్నట్లుగా "సైన్స్, ఆధ్యాత్మికతలు వేరు" అన్న భావాన్ని కలామ్ మనస్సు అంగీకరించలేదు. **సైన్స్ ఎప్పుడూ ఆధ్యాత్మిక ఉన్నతికి, ఆత్మ సాక్షాత్కారానికి మార్గమని నమ్మడానికి కారణం** అన్నాదొరై, కృష్ణమూర్తి వంటి ప్రొఫెసర్ల అద్భుతమైన విద్యాబోధనయే. జ్యోతిష్యం ఒక కళగా అంగీకరించవచ్చును. కానీ విజ్ఞానపు ముసుగులో పెడత్రోవ పట్టించే మూఢాచారాలకు వేదికగా మారితే అబ్దుల్ కలామ్ అంగీకరించే వాడుకారు.

బి.ఎస్.సి. డిగ్రీ పూర్తి అయ్యాక 'ఫిజిక్స్' సబ్జెక్ట్ తన ఆశలకు, ఆశయాలకు సంబంధించిన విషయం కాదని తెలుసుకున్న కలామ్ ఇంజనీరింగ్‌లో చేరడానికి ఆర్థిక పరిస్థితి అనుకూలించ లేదు. అపుడు అతని సోదరి 'జొహరా' చేసిన అపార త్యాగం అబ్దుల్ కలామ్‌ను చలింపచేసింది. ఆమె తన బంగారుగాజులు, గొలుసు కుదువబెట్టి, మద్రాసు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఫీజు కడుతున్నపుడు, కలామ్ తన తొలి సంపాదనతో ఆ బంగారు గాజులను, గొలుసును విడిపించాలని, అందుకొరకు ఎలాగైనా మెరిట్ స్కాలర్‌షిప్‌ను సాధించాలన్న పట్టుదల అతనిలో మొగ్గ తొడిగింది.

మద్రాస్ ఇన్‌స్టిట్యూట్‌లో చేరిననాడే, ఆ ప్రాంగణంలో ప్రదర్శన కొరకు ఉంచిన రెండు పాత విమానాలు అబ్దుల్ కలామ్‌ను మిక్కిలి ఆకర్షించి, ఏరోనాటికల్ ఇంజనీరింగ్ సబ్జెక్ట్‌ను ఎంచుకునేలా చేసాయి.

విద్యార్థిగా ఉన్నరోజులలో కలామ్‌కు తండ్రి మాటలు నిరంతరం జ్ఞప్తికి వచ్చేవి. "ఇతరులను అర్థం చేసుకున్నవాడు విజ్ఞాని" కానీ తనను తాను తెలుసుకున్నవాడే నిజమైన జ్ఞాని. వివేకం లేని విజ్ఞానం ప్రమాదకరం" ఈ మాటలు ప్రతి ఒక్కరూ నిత్యం మననం చేసుకోవాల్సిన ఆణిముత్యాలు.

విద్యార్థిగా అబ్దుల్‌కలామ్‌కు అందరి విద్యార్థుల వలే సంశయాస్పద వాతావరణం ఏర్పడింది. ఆ రోజుల్లో రాజకీయ చైతన్యము, పారిశ్రామిక ఉద్యమం విస్తృతంగా రాజ్యం చేస్తున్నాయి. కలామ్‌కు తాను పెరిగిన ధార్మిక విలువల నేపథ్యం, చదువుతున్న భౌతికశాస్త్ర సిద్ధాంతాల మధ్య సమన్వయం కుదరక, చాలా అయోమయంగా అగుపించేవి, యదార్థమైన సత్యం, కంటికి కన్పించే భౌతిక ప్రపంచానికి ఆవల ఉందన్న జ్ఞానం, ఆధ్యాత్మిక అనుభవం వల్లనే బోధపడుతుందని చిన్నప్పటి నుండి నమ్మినవాడు కలామ్. పదార్థమొక్కటే సత్యమని, మిగిలినవి (కంటికి కన్పించనవి) కేవలం అపోహలనీ భౌతికశాస్త్రం చెబుతుంటే కలామ్ కలత చెందాడు.

ఇటువంటి తాత్త్విక విషయాలు, భౌతిక శాస్త్ర విషయాలతో సమన్వయం చేయగల ధార్మిక, శాస్త్రీయతలను జోడించి చెప్పగలిగే ఆధ్యాత్మిక తత్త్వగురువుల అవసరం ఉంది. ఈ లోపం వల్లనే భౌతిక శాస్త్రవేత్తలు, ధర్మచింతన లేక అత్యంత ప్రమాదకరమైన ఆయుధాలు, మందులు తయారుచేస్తూ జీవకోటి నాశనానికి

**విజయ శిఖరాలు సోమరులకు అందవు. పట్టుదలతో కృషి చేసేవారికి అవి తలవంచుతాయి.**

దారిచూపుతున్నారు. అందుకే "సైన్స్ విత్ హ్యూమన్ ఫేస్" (మానవతా ముఖంతో కూడిన శాస్త్రజ్ఞానం అవసరం) అన్న నినాదం నేడు నాట్యం చేస్తోంది. కలామ్ కూడా అదే నేపథ్యంతో చదువును పూర్తిచేయగలిగాడు.

మాతృభాషయైన తమిళాన్ని మిక్కిలి గౌరవించే సంస్కారి కలామ్. ఇంజనీరింగ్ ప్రాజెక్ట్ కార్యక్రమంలో ఉండగా, కళాశాల నిర్వహించిన వ్యాసరచనా పోటీలో "మన విమానాన్ని మనమే నిర్మించుకుందాం" అన్న అంశంపై వ్రాసిన వ్యాసం మొదటి బహుమతిని గెల్చుకుంది. నిశిత తర్కపటిమ కల్గిన తమిళభాషకు ఈ సైన్స్ విజ్ఞానం ఆలంబన కావాలన్న కలామ్ వాంఛ స్పష్టమైంది ఆ వ్యాసంలో.

అనంతరం బెంగుళూరులోని హిందుస్తాన్ ఏరోనాటికల్ లిమిటెడ్ (హెచ్.ఏ.ఎల్) లో ట్రైనీగా చేరారు మన కలామ్.

ఏరోనాటికల్ ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్‌గా బాహ్య ప్రపంచం లోనికి అడుగిడిన కలామ్ ముందుగా వైమానికదళ ఉద్యోగ అవకాశం, రక్షణ మంత్రిత్వ శాఖలో, సాంకేతిక ఉత్పాదక డైరక్టరేట్‌లో ఉద్యోగ అవకాశాలు వచ్చాయి.

అయితే 1958లో ఢిల్లీలో జరిగిన రక్షణ మంత్రిత్వశాఖ ఇంటర్వ్యూలో నెగ్గి, సీనియర్ సైంటిఫిక్ ఆఫీసర్‌గా ఉద్యోగాన్ని చేపట్టారు. అప్పట్లో వారి జీతం నెలకు 250 రూ॥లు. వైమానిక దళంలో చేరలేదన్న నిరాశగాని, నిస్పృహగాని కలామ్‌ను బాధించ లేదు.

అయితే ఇంటర్వ్యూకు హాజరైన సమయంలో స్వామి శివానందతో కల్గిన పరిచయం ఆయన జీవితంలో ఒక మధుర జ్ఞాపకంలా నిల్చిపోయింది.

– సాధన నరసింహాచార్య

## సుధన్వుని గృహస్థ సాధన

*మహాభారత యుద్ధకాలంలో సుధన్వుడు, అర్జునుల మధ్య మహాసంగ్రామం కొనసాగుతోంది. మహాబలవంతులు, యుద్ధవిద్యలో ప్రవీణులు అయిన ఆ ఇద్దరిలో జయాపజయాలెవరివో నిర్ణయించటం దుర్లభంగా ఉంది. చూచిచూచి చివరకు పెద్దలు చెరొక మూడు బాణాలను ఇచ్చి అంతిమ నిర్ణయం వాటిమీద ఆధారపడి ఉందని తెలియజేశారు. అటువంటి సంకట పరిస్థితులలో కృష్ణపరమాత్మ అర్జునునికి సహాయం చేయ సంకల్పించి చేతిలోకి జలాన్ని తీసికొని, గోవర్ధన పర్వతాన్ని ఎత్తి, గోవులను, గోపాలకులను కాపాడిన పుణ్యఫలాన్ని అర్జునుని బాణానికి ధారపోసి సంధించమన్నాడు. అదిచూచి సుధన్వుడు భగవంతునికి నమస్కరించి, "నా వద్ద అటువంటి పుణ్యఫలాలేవీ లేవు. కానీ పత్నీవ్రత ధర్మాన్ని పరిపూర్ణ నిష్ఠతో ఆచరిస్తూ ఏకపత్నీవ్రతునిగా జీవనయాత్ర సాగిస్తున్నాను" అని పలికి ఆ పుణ్యఫలాన్ని తన బాణానికి ధారపోసి సంధించి వదిలాడు. చూస్తుండగానే రెండు బాణాలు ఆకాశమార్గంలో ఢీకొన్నాయి. అర్జునుని బాణం నేలకూలింది. కృష్ణుడు రెండవసారి మొసలిబారినుండి గజేంద్రుని రక్షించిన పుణ్యాన్ని, ద్రౌపది మాన సంరక్షణ గావించిన పుణ్యాన్ని అర్జునుని రెండవ బాణానికి ధారపోసి సంధించి వదలమన్నాడు. సుధన్వుడు తన రెండవ బాణానికి తాను శీలవంతునిగా జీవిస్తూ, కష్టపడి నీతిగా సంపాదించిన ధనముతోనే జీవనయాత్ర సాగిస్తున్న పుణ్యఫలాన్ని ధారపోసి సంధించాడు. ఈసారి కూడ సుధన్వుని బాణమే గెలుపొంది అర్జునుని బాణం నేలకూలింది.*

*మిగిలిన మూడవ బాణంమీద అంతిమ నిర్ణయం ఆధారపడివుంది. అందువలన శ్రీకృష్ణుడు ఆ మూడవ బాణానికి తను దుష్టశిక్షణ, శిష్టరక్షణ గావించటానికి పదేపదే అవతారాలు ధరించి, దిగివచ్చిన పుణ్యఫలాన్నంతటిని ధారపోసి అర్జునునికిచ్చి సంధించమన్నాడు. ఇటు సుధన్వుడు తన మూడవ బాణానికి నమస్కరించి సదా పరమార్థంకోసమే పాటుపడుతూ ఏనాడూ స్వార్థ చింతనను తన సమీపానికి రానీయకుండా జీవించిన పుణ్యఫలాన్ని ధారపోసి సంధించాడు. సుధన్వుని బాణమే గెలుపొంది అర్జునుని బాణాన్ని నేలకూల్చింది.*

*కుతూహలంతో చూస్తున్న దేవతలు పైనుండి సుధన్వుని పై పుష్పవర్షాన్ని కురిపించారు. కృష్ణపరమాత్మ ప్రసన్నుడై సుధన్వుని వద్దకు వచ్చి "ఓ నరశ్రేష్ఠుడా నైష్ఠిక గృహస్థ సాధన సమస్త తపోసాధనల కంటే శ్రేష్ఠమైనదని ఋజువు చేశావు" అని పలికి గాఢంగా ఆలింగనం చేసుకొన్నాడు.*

*– ప్రజ్ఞాపురాణం నుండి*

**నీ మనసులో నీకు ప్రశాంతత దొరకకపోతే మరెక్కడో దాన్ని వెతకడం వెర్రితనం.**

## ఆణిముత్యాల శోధన-1 సమాధానాలు

1వ ప్ర: శ్రీరామశర్మఆచార్య గురుదేవులు తమ శిష్యులకు ఆశ్వాసన ఇచ్చారు (1వ పేజీలో)

2వ ప్ర: 1) అన్నమయకోశం 2) ప్రాణమయకోశం 3) మనోమయకోశం 4) విజ్ఞానమయకోశం 5) ఆనందమయకోశం (4వ పేజీలో)

3వ ప్ర: "మనసుంటే మార్గం ఉంటుంది" అనే కథలో (6వ పేజీలో)

4వ ప్ర: "నందిని ధేనువు" (7వ పేజీలో)

5వ ప్ర: సౌరవిజ్ఞానాన్ని సావిత్రి విద్య అని పిలుస్తారు (9వ పేజీలో)

6వ ప్ర: నామంతోపాటు రూపాన్ని కలుపుకునిపోయే విధానం సరియైన పద్ధతి అని పెద్దలు చెప్పారు? (12వ పేజీలో)

7వ ప్ర: వైద్య దివ్యదృష్టితో రోగ నిర్ధారణ (14వ పేజీలో)

8వ ప్ర: విశాలుడు (16వ పేజీలో)

9వ ప్ర: బ్రహ్మవాదినిగా చేసింది (18వ పేజీలో)

10వ ప్ర: "అవినీతిని అంతమందించడమే ప్రతి ఒక్కరు ఊపిరిగా భావించాలి" మరియు గ్రామ స్వరాజ్యం (45వ పేజీలో)

**విజేతల పేర్లు :** తరువాత ప్రకటించబడును.

## అందరికీ ఆహ్వానం

*గాయత్రీ తీర్థ్, హరిద్వార్, శాంతికుంజ్‌వారు 2012 సంవత్సరం సాధనా సంవత్సరంగా ప్రకటించారు. వసంత పంచమి మహాపర్వాన్ని పురస్కరించుకొని తేది 19.01.2012 గురువారం నుండి తేది 27.01.2012 శుక్రవారం వరకు గాయత్రీ శక్తిపీఠం నారాకోడూరునందు గాయత్రీ మహామంత్ర; లక్ష్మీ, సూర్య మహామంత్రముల 9 రోజుల సాధనా శిబిరం జరుగుతుంది. తేది 28.01.2012 వసంత పంచమి పర్వాన్ని పురస్కరించుకొని నవకుండీయ, గాయత్రీ యజ్ఞం, పూర్ణాహుతి నిర్వహించబడుతుంది. సాధకులకు భోజన, వసతి సౌకర్యాలు కలవు.*

**గాయత్రీ శక్తిపీఠం**

**నారాకోడూర్ పో॥, చేబ్రోలు మం॥, గుంటూరు జి॥**
**ఫోన్: 0863-2534658, 2534440**
**సెల్: 9542861999**

## యుగశక్తి చందాదారులకు విజ్ఞప్తి / గమనిక

*యుగశక్తి గాయత్రి మాస పత్రిక సక్రమంగా చేరుట లేదనెడి ఫిర్యాదులు మా కార్యాలయానికి అందుచున్నాయి. వీటిలో కొన్ని: 1) నెల విడచి నెల అందుచున్నాయి. 2) ఒక నెలలో మొదటివారములో అందగా మరుసటి నెలలో నెలాఖరు వరకు అందుట లేదు. 3) ఆ నెలలో కాక మరుసటి నెలలో అందుచున్నాయి. 4) అసలు రావటం లేదు*

*పై వానికి సవినయంగా మీకు ఈ విధముగా తెలియజేయుచున్నాము. మా కార్యాలయంలో చందాదారుల చిరునామాలు కంప్యూటరైజ్ చేశాము. కంప్యూటర్ ద్వారా మీ చిరునామాలు స్టిక్కరుతో ముద్రించబడి వస్తాయి నెల నెలా. ఈ చిరునామాలు జిల్లాల వారీగా రాగా, వానిని పుస్తకాల కవరుపై అంటిస్తారు మన కార్యకర్తలు. తదుపరి వీరిని జిల్లాల వారీగా ప్లాస్టిక్ సంచులలో పెట్టి నిర్దేశించిన పోస్టాఫీసులో ప్రతినెలా 28 లేక 29 తేదీలలో నిర్ణీత ఫీజు చెల్లించి అందజేయుట జరుగుతుంది. అచ్చటి నుండి పోస్టాఫీసు సంచులలో మార్చబడి వివిధ పోస్టాఫీసుల ద్వారా అంచెలంచెలుగా మీ చిరునామాకు చేర్చబడతాయి. ఈ విధానములో గాయత్రి చేతనాకేంద్రము పాత్ర శూన్యము.*

***పాఠకులకు సూచనలు:** 1) మీరు చిరునామాలో మీ పత్రిక కంప్యూటర్ కోడ్ నంబరు (పైభాగాన), క్రింద భాగాన మీ చందా పూర్తికాబోవు నెల, సంవత్సరము ముద్రించబడి ఉంటాయి. 2) మీ చందాకాలము పూర్తికాగానే కంప్యూటర్ దానంతటదే ఆ చందాదారుని పేరు తొలగిస్తుంది. 3) మీరు ఆన్‌లైన్‌లో బ్యాంకు ద్వారా డబ్బు పంపునపుడు, మీ పేరు, ఊరిపేరు తప్పక ముద్రించేలా చూడండి. లేనిచో మీ డబ్బు చిరునామా లేనిదిగా మిగిలిపోతుంది. అట్లే EMO ద్వారా పంపిన డబ్బుతో మీ చిరునామా సక్రమముగా అందుటలేదు. ఉచ్చారణలోపం - దీనితో మీ పత్రిక అందించుటలో చిక్కు ఎదురౌతున్నది. మీరు డబ్బు పంపిన తరువాత ఒక కార్డుపై అన్ని వివరాలను తెలియజేస్తూ, మాకు పంపించినచో చాలా చిక్కులు తొలగిపోతాయి. మీకు ప్రతినెలా పత్రిక 20వ తేది వరకు అందనిచో మాకు తెలియజేయండి, మరియొక పత్రికను మీకు పోస్టు చేయగలము.*

**మా ఫోన్ నం: 040-23700722, 9949111175**

*చందాదారులకు సకాలములో పత్రికను పోస్టు చేయుటలో మా అలసత్వముకాని, అశ్రద్ధకాని ఏ మాత్రము లేవని మరియొక మారు మీకు సవినయముగా తెలియ జేయుచున్నాము*

**ఇట్లు**
**మీ విధేయుడు ఎ. వేణుగోపాలరెడ్డి**

**ఈరోజు ఒక చిన్న అబద్ధం చెబితే, దాన్ని కప్పిపుచ్చుకోవడానికి రేపు మరో పెద్ద అబద్ధం చెప్పవలసిరావచ్చు.**

# ఆణిముత్యాల శోధన - 2

నిర్వహణ : **సాధన నరసింహాచార్య**

**నిబంధనలు :**

1. *ఈ క్రింద మేము అడిగే ప్రశ్నలకు కొట్టివేతలు, తుడుపులు ఉండరాదు.*
2. *సమాధానం క్లుప్తంగా మా "కీ" సొల్యూషన్స్‌కు సరిపోవాలి. (డిశంబర్ 2011 సంచిక ఆధారంగా)*
3. *ఒకరికంటే ఎక్కువమంది కరెక్ట్ సమాధానాలు వ్రాసినచో, బహుమతులు సమానంగా పంచబడును.*
4. *ఈ ఎంట్రీలను 18.01.2012వ తేదీలోగా పంపించవలెను.*
5. *తపాలశాఖ వారి ఆలస్యానికి మేము బాధ్యులం కాదు.*
6. *బహుమతుల విషయంలో తుదినిర్ణయం నిర్వాహకులదే.*

***మొదటి బహుమతి :*** *రూ. 100/-*

***రెండవ బహుమతి :*** *రూ. 50/-*

**1వ ప్రశ్న:** "రేపటి పని నేడే చేయి. నేటి పని ఇప్పుడే చేయి" అన్న సూక్తి ఏ శీర్షికలో చెప్పబడింది?

**2వ ప్రశ్న:** "శ్రద్ధ-ఆసక్తి రెండూ-రెండు కళ్ళలాగా పనిచేస్తాయి" అనే వాక్యం ఏ కథలో ప్రస్తావించబడింది?

**3వ ప్రశ్న:** "ఉదార చరితానాం తు వసుధైవ కుటుంబకమ్" అన్న వాక్యం ఏ వ్యాసంలో ఇవ్వబడింది?

**4వ ప్రశ్న:** ఉపవాసములు ఎన్ని రకాలు? అవి ఏవి?

**5వ ప్రశ్న:** కలిసి మెలసి, పంచుకుని, నవ్వుతూ, నవ్వించడమే కుటుంబ జీవనము" అన్న వాక్యం ఏ వ్యాసంలో అగుపిస్తుంది?

**6వ ప్రశ్న:** గురుదేవులు దేహత్యాగం చేసిన రోజు, సంవత్సరం ఏది?

**7వ ప్రశ్న:** లోకశిక్షణకు ఎన్ని ఆధారములు గలవు?

**8వ ప్రశ్న:** భర్తృహరి సంస్కృత సుభాషితాలకు తెలుగు భావాలతో మెరుగులు దిద్దినవారెవరు?

**9వ ప్రశ్న:** "మాసానాం మార్గశీర్షోఽహం" అన్న ఆచార్యులు ఎవరు?

**10వ ప్రశ్న:** అబ్దుల్ కలామ్‌గారి సందేశమేమిటి?

పేరు : ..........................................................................

చిరునామా : ..........................................................................

..........................................................................

.............................. పిన్ కోడ్ : ..............................

ఫోన్ నెం : ..........................................................................

| | **సమాధానాలు** | **పేజీ నెం. (ఏ పేజీలో గలదు?)** |
|---|---|---|
| 1వ | ______ | ______ |
| 2వ | ______ | ______ |
| 3వ | ______ | ______ |
| 4వ | ______ | ______ |
| 5వ | ______ | ______ |
| 6వ | ______ | ______ |
| 7వ | ______ | ______ |
| 8వ | ______ | ______ |
| 9వ | ______ | ______ |
| 10వ | ______ | ______ |

**ఎంట్రీలు పంపవలసిన చిరునామా**

**ఆణిముత్యాల శోధన C/o. యుగశక్తిగాయత్రి, అశ్విని హౌస్ ప్రక్కన, గాయత్రీ చేతనా కేంద్రం, మూసాపేట, హైదరాబాద్-18**